thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 229 కరీంనగర్ ఆదివారం, 26 అక్టోబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఉబర్ ఓలాకు పోటీగా భారత్ ట్యాక్సీ

న్యూఢిల్లీ : క్యాబ్ సర్వీసులు అందించే ఓలా, ఉబర్‌లకు పోటీగా 'భారత్ ట్యాక్సీ' వస్తోంది. క్యాబ్ నిర్వాహకుల నుంచి ఎలాంటి కమీషన్లు వసూలు చేయకుండా, సహకార పద్ధతిలో నిర్వహించే ఈ సర్వీసుతో.. అటు క్యాబ్ నిర్వాహకులకు, ఇటు ప్రయాణికులకు ప్రయోజనం కలగనుంది. ఓలా, ఉబర్ సంస్థలు క్యాబ్ నిర్వాహకులు, డ్రైవర్ల నుంచి అడ్డగోలుగా 25 వరకు కమీషన్లు వసూలు చేస్తున్నాయని.. ప్రయాణాల రద్దు, రద్దీ సమయాల పేరిట ప్రయాణికుల నుంచి అడ్డగోలు చార్జీలు వసూలు చేస్తున్నాయనే ఆరోపణలున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ప్రైవేటు క్యాబ్ సర్వీసులకు ప్రత్యామ్నాయాన్ని అందుబాటులోకి తేవడం.. క్యాబ్ నిర్వాహకులు, డ్రైవర్లకు ప్రయాణ చార్జీలు పూర్తిగా అందేలా చేయడం లక్ష్యంగా.. కేంద్ర సహకారశాఖ, జాతీయ ఈ-గవర్నెన్స్ విభాగం (ఎన్ఈజీడీ) 'భారత్ ట్యాక్సీ'ని రూపొందించింది. రూ.300 కోట్ల మూలధనంతో 'సహకార్ ట్యాక్సీ కో-ఆపరేటివ్ లిమిటెడ్' సంస్థను ఏర్పాటు చేసింది.




## దూసుకొస్తున్న తుఫాన్ మొంతా

తుఫాన్ వచ్చేస్తోంది.. బంగాళాఖాతంలో ప్రస్తుతం ఉన్న అల్పపీడనం.. క్రమంగా బలపడుతూ తుఫాన్ గా మారుతుంది. దీనికి మొంతా అనే పేరు పెట్టారు. థాయ్ లాండ్ దేశం ఈ తుఫాన్ కు మొంతా అనే పేరు పెట్టింది. సముద్ర మట్టానికి సగటు 5.8 కి.మీ ఎత్తులో విస్తరించిన ఉపరితల ఆవర్తనం శుక్రవారం అల్పపీడనంగా మారుతుందని... తర్వాత 24 గంటల్లో పశ్చిమ-ఉత్తర పశ్చిమ దిశగా కదులుతూ మరింత బలపడే అవకాశం ఉందని విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఈ తీవ్ర అల్పపీడనం వచ్చే సోమవారం నాటికి వాయుగుండంగా మారే అవకాశాలున్నాయని అధికారులు ప్రకటించారు. దీంతో సోమ, మంగళవారం భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హెచ్చరించారు.

తుఫాన్ ప్రభావంతో.. శుక్రవారం ప్రకాశం, బాపట్ల, గుంటూరు, కృష్ణా,నంద్యాల,కోనసీమ జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కోస్తా తీరం వెంబడి గంటకు 35-55 కిమీ వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఇక.. తెలంగాణలో నాగర్ కర్నూల్,నారాయణపేట, యాదాద్రి భువనగిరి, మేడ్చల్ మల్కాజ్ గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, రంగారెడ్డి, హైదరాబాద్, సిద్దిపేట, మహబూబాబాద్, జోగులాంబ గద్వాల, నల్లగొండ, సూర్యాపేట, వరంగల్, ఖమ్మం, జనగాం, వనపర్తి జోగులాంబ గద్వాల జిల్లాలలో అక్కడక్కడ మోస్తారు వర్షం కురిసే అవకాశం ఉంది. మొత్తం 22 జిల్లాలకు ఐఎండీ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. అల్పపీడనాల కారణంగా సముద్రం అల్లకల్లోలంగా ఉంటుంది కాబట్టి మత్స్యకారులు మరి కొద్ది రోజులు వేటకు వెళ్ళరాదని విపత్తు నిర్వహణ సంస్థ సూచించింది.




## గుడ్‌న్యూస్.. త్వరలో భారీగా ఉద్యోగాల భర్తీ

హైదరాబాద్ అక్టోబరు25 : త్వరలో 14వేల అంగన్వాడీ టీచర్ల హెల్పర్ల నియామకాన్ని చేపట్టబోతున్నామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. మహిళా శిశు సంక్షేమాన్ని తమ ప్రభుత్వం ప్రాధాన్యతగా ఎంచుకుందని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. ఎన్నో సవాళ్లు ఉన్నా ఆకాశాన్ని చీల్చుకొని అంతరిక్షం వరకు మహిళలు చేరుకుంటున్నారని ఉద్ఘాటించారు. ఐసీడీఎస్ సేవలకు భారతదేశంలో దివంగత మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ ప్రాణం పోశారని నొక్కిచెప్పారు. మహిళా శిశు సంక్షేమ శాఖలో గ్రేడ్ వన్ సూపర్‌వైజర్లుగా నియమితులైన అభ్యర్థులకు నియామక పత్రాలని ఇవాళ(శనివారం) మంత్రి సీతక్క అందజేశారు. ఈ సందర్భంగా గ్రేడ్ వన్ సూపర్‌వైజర్లుగా నియమితులైన అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారితో ముచ్చటించారు మంత్రి సీతక్క.

# ఇజ్జత్ కా సవాల్!

## ఇక జూబ్లీహిల్స్ ప్రచారంలోకి రేవంత్!





## తాజా సర్వేతో అలర్ట్ - సీన్ ఛేంజ్..!!

హైదరాబాద్ : జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. మూడు ప్రధాన పార్టీల నేతలు ఇక్కడే మోహరించారు. కాంగ్రెస్ కు ఇక్కడ గెలుపు కీలకంగా మారుతోంది. బీఆర్ఎస్ సైతం ఈ ఎన్నికలో గెలుపే లక్ష్యంగా పని చేస్తోంది. గెలుపు పైన మూడు పార్టీల నేతలు పైకి ధీమా వ్యక్తం చేస్తున్నా.. సర్వే నివేదికలు మాత్రం గుబులు పుట్టిస్తున్నాయి. దీంతో, సీఎం రేవంత్ స్వయంగా ఈ ఎన్నిక ప్రచారంలోకి దిగాలని డిసైడ్ అయ్యారు. మరికొందరు మంత్రులకు కూడా బాధ్యతలు కేటాయిస్తున్నారు.

కాగా, జూబ్లీహిల్స్ లో మారుతున్న లెక్కలు ఫలితం పై ఉత్కంఠ పెంచుతున్నాయి. జూబ్లీహిల్స్ లో గెలుపు ఇప్పుడు సీఎం రేవంత్ కు ప్రతిష్ఠాత్మకంగా మారింది. అభ్యర్థి విషయంలో రేవంత్ ఏరి కోరి ఎంపిక చేయటంతో పాటుగా.. పార్టీ నాయకత్వం.. ఎంఐఎంను ఒప్పించారు. ఇక, ఇప్పుడు గెలుపు కోసం కొత్త వ్యూహాలు అమలు చేస్తున్నారు. ఇందు కోసం మంత్రులతో ప్రత్యేకంగా భేటీకి నిర్ణయించారు. సీఎం రేవంత్ ఈ రోజు ఢిల్లీ వెళ్ళారు. అక్కడ ఏఐసీసీ ఆఫీసులో జరిగే పార్టీ సమావేశంలో పాల్గొంటారు. వచ్చిన తరువాత మంత్రులు.. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో పని చేస్తున్న పార్టీ నేతలతో సమావేశం కానున్నారు. తాజా సర్వే నివేదికల గురించి సీఎం వివరించే అవకాశం ఉంది.

అదే విధంగా బీఆర్ఎస్, బీజేపీ వ్యూహాలకు ధీటుగా ఎలా ప్రచారం ముమ్మరం చేయాలనేది రేవంత్ డిసైడ్ చేయనున్నారు. ఇప్పటికే ముగ్గురు మంత్రులకు సీఎం రేవంత్ జూబ్లీహిల్స్ ప్రచార బాధ్యతలను అప్పగించారు. ఇప్పుడు ఒక్కో డివిజన్ కు ముగ్గురు మంత్రుల చొప్పున బాధ్యతలు అప్పగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసారు. అదే విధంగా ప్రతీ ఇంటికి ప్రచారానికి వెళ్లేలా కార్యాచరణ ఖరారు చేసారు. ఇక, ప్రచారం చివరి మూడు రోజులు రేవంత్ రోడ్ షోలు.. సభల్లో పాల్గొనేలా ప్లాన్ సిద్ధం చేస్తున్నారు. తాజాగా మాజీ సీఎం కేసీఆర్ జూబ్లీహిల్స్ ఎన్నికల్లో గెలుపు ఖాయమని పార్టీ నేతల సమావేశంలో ధీమా వ్యక్తం చేసారు. కాంగ్రెస్ కు కౌంటర్ గా చేయాల్సిన ప్రచారం పైన దిశా నిర్దేశం చేసారు. అటు బీజేపీ సైతం ముఖ్య నేతలను ప్రచారంలోకి దించేలా ఆలోచన చేస్తోంది. దీంతో.. తాజాగా వచ్చిన సర్వే నివేదికలతో.. సీఎం రేవంత్ ఎక్కడా అతి విశ్వాసం.. అజాగ్రత్త లేకుండా పక్క ప్రణాళికా బద్దంగా ముందుకు వెళ్లాలని మంత్రులకు సూచిస్తున్నారు. ఈ మేరకు మంత్రులతో జరిగే భేటీలో జూబ్లీహిల్స్ ప్రచారం.. బాధ్యతల పైన రేవంత్ స్పష్టత ఇవ్వనున్నారు.




# అంతు పట్టని బీహారీ ఓటర్ల అంతరంగం!

## రెండు కూటముల్లో అదే టెన్షన్...!

దేశ రాజకీయాల్లో ఆసక్తి రేపుతున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికల పోరులో ఎన్డీయే, ఇండియా కూటమి (మహాఘట్ బంధన్), ప్రశాంత్ కిశోర్ జన్ సూరజ్ పార్టీ మధ్య బిగ్ ఫైట్ నడుస్తోంది. మొదటి విడత కోసం ఇప్పటికే నోటిఫికేషన్ విడుదలై నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో బిహార్ ఓటర్లు ఈసారి ఎవరికి పట్టం కట్టబోతున్నారు? ఎవరిని ఇంటికి పంపనున్నారు అనేది ఉత్కంఠ రేపుతోంది. ఈ నేపథ్యంలో తాజాగా సి-ఓటర్ సర్వే సంచలన విషయాలు వెల్లడించింది. ఈ సర్వే ప్రకారం జేడీయూ-బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి బిహార్ ప్రజలు జై కొట్టబోతున్నట్లు వెల్లడైంది. ఎన్డీయే కూటమికి మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు 40.2 శాతం అవకాశాలు ఉన్నాయని మహాఘట్ బంధన్‌కి 38.3 శాతం, జన్ సూరజ్ పార్టీకి 13.3 శాతం అవకాశాలు ఉన్నట్లు అంచనా వేసింది. అయితే ఎన్డీయే కూటమి, ఇండియా కూటమికి మధ్య కేవలం 2 శాతం మాత్రమే తేడా ఉండటంతో అంతిమంగా విజయం ఎవరి వైపు నిలవబోతోందని అనేది సంచలనంగా మారింది.

**సీఎంగా తేజస్వీకి మద్దతు:** ఒక వేళ ఎన్డీయే అధికారం ఏర్పాటు చేస్తే నితీశ్ కుమార్ తిరిగి ముఖ్యమంత్రిగా కొనసాగాలా అనే ప్రశ్నకు 47.6 శాతం మంది ఓటర్లు ఓకే చెప్పగా 39.7 శాతం మంది నో చెప్పారు. ఏమీ చెప్పలేమని మరో 121.7 శాతం మంది తమ అభిప్రాయం వెల్లడించారు. పార్టీల పరంగా బలాబలాలు ఎలా ఉన్నా ముఖ్యమంత్రిగా ఎవరు ఉండాలనే ప్రశ్నకు భిన్నమైన సమాధానం వచ్చింది. ఇందులో ప్రస్తుత సీఎం నితీశ్ కుమార్ మూడో స్థానానికి పడిపోయారు. బిహార్ ముఖ్యమంత్రిగా ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ కు ఏకంగా 36.2 శాతం మంది మద్దతు ఇవ్వగా 23.2 శాతంతో ప్రశాంత్ కిశోర్ రెండో స్థానంలో నిలిచారు.

15.9 శాతంతో నితీశ్ కుమార్, 8.8 శాతంలో చిరాగ్ పాశ్వాన్, 7.8 శాతంతో బీజేపీ నేత సామ్రాట్ చౌదరికి మద్దతు లభించింది. ఇక ఓటు నిర్ణయాన్ని ప్రధానంగా ఏ అంశం ప్రభావితం చేయబోతోందనే ప్రశ్నకు అభ్యర్థుల స్థానిక అంశం 19 శాతం ప్రభావితం చేయబోతోందని, పార్టీ సిద్ధాంతాలు 28.4 శాతం పని చేయబోతున్నాయని తేలింది. ప్రత్యేక సమస్యలు 32.7 శాతం, జాతీయాంశాలు 4.0, సీఎం పనితీరు 5.6 శాతం, ప్రధాని పనితీరు 3.6 శాతం పని చేయబోతోందని అంచనా వేసింది.

**బిహార్ సమస్యలు తీర్చేది వాళ్లే:** కూటమి పట్ల సంతృప్తిగా లేకపోతే ఎవరు పొత్తులను మార్చుకునే అవకాశం ఉందనే ప్రశ్నకు చిరాగ్ పాశ్వాన్ పొత్తు మార్చుకునే అవకాశం ఉందని 35.1 శాతం మంది జితన్ మాంఝీ 15 శాంత, ఉపేందర్ కుశ్వా 5 శాతం ముకేశ్ షైనీ 12.7 శాతం అలయెన్స్ నుంచి స్విచ్ అవుతారని అభిప్రాయపడ్డారు. ఇక బిహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ రాజకీయ గందరగోళం సృష్టించిన ఎస్ఐఆర్ ఎలక్షన్ లో నిష్పక్షపాతాన్ని మెరుగు పరిచిందా అని ప్రశ్నించగా అవును ఇప్పుడు పోల్స్ కచ్చితంగా పారదర్శకంగా జరుగుతాయని 42.6 శాతం మంది అభిప్రాయపడగా గందరగోళానికి కారణం అయిందని 31 శాతం, ఈ విషయంపై అభిప్రాయం చెప్పడానికి ఇది చాలా తొందర అవుతుందని 16.5 శాతం మంది, ప్రభావితం కాదని 3.5 శాతం మంది చెప్పారు. బిహార్ సమస్యలు ఎవరు తీరుస్తారనే ప్రశ్నకు మహాఘట్ బంధన్ కు 36 శాతం, ఎన్డీయే కూటమికి 34 శాతం, జన్ సూరజ్ కు 13, ఎవరూ తీర్చలేరని 9 శాతం మంది అభిప్రాయపడ్డారు. ఇక ఇండియా కూటమికి రాహుల్ గాంధీ చేపట్టిన ఓట్ అధికార్ యాత్ర హెల్ప్ అయిందని 51 శాతం మంది అభిప్రాయపడగా 32.8 శాతం హెల్ప్ కాలేదని చెప్పారు.




## అప్రమత్తమైన రవాణా శాఖ.. హైదరాబాద్‌లో ప్రైవేటు బస్సుల విస్తృత తనిఖీలు

హైదరాబాద్: కర్నూలు బస్సు ప్రమాద ఘటనతో తెలంగాణ రవాణా శాఖ అప్రమత్తమైంది. ప్రైవేటు బస్సులను అధికారులు తనిఖీ చేస్తున్నారు. విజయవాడ హైవే, బెంగళూరు హైవేపై ఆర్టీఏ బృందాలు విస్తృత తనిఖీలు చేపట్టాయి. రాజేంద్రనగర్ పరిధి గగన్ పహాడ్ వద్ద సోదాలు చేశారు. ఏపీ నుంచి వస్తున్న ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేశారు. వాహనాల్లోని ఫైర్ సేఫ్టీ, మెడికల్ కిట్లను పరిశీలించారు. నిబంధనలు పాటించని 5 ట్రావెల్స్ బస్సులపై కేసులు నమోదు చేశారు. బస్సు అద్దం పగిలినా అలాగే నడుపుతున్న ట్రావెల్స్ బస్సును సీజ్ చేశారు. జడ్చర్ల వద్ద ఈ వాహనం రోడ్డుప్రమాదానికి గురైందని ప్రయాణికులు తెలిపారు.

ఎల్బీ నగర్‌లోని చింతలకుంట వద్ద ఆర్టీఏ అధికారులు తనిఖీలు చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన ట్రావెల్స్ బస్సును సీజ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై తిరుగుతున్న మరో 4 బస్సులపై కేసులు నమోదు చేశారు.




హైదరాబాద్: నగరంలోని చాదర్‌ఘాట్‌లో కాల్పుల ఘటన కలకలం రేపింది. హైదరాబాద్ సౌత్ ఈస్ట్ డీసీపీ చైతన్య.. సీపీ కార్యాలయంలో మీటింగ్‌కు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో సెల్‌ఫోన్ చోరీ చేసి పారిపోతున్న ఇద్దరు దొంగలను గుర్తించారు. వారిని పట్టుకునేందుకు డీసీపీ, ఆయన గన్‌మెన్ ప్రయత్నించారు. ఈ క్రమంలో ఓ దొంగ.. డీసీపీపై కత్తితో దాడికి యత్నించాడు. ఈ ఘటనలో డీసీపీ కింద పడిపోయారు. వెంటనే తేరుకున్న డీసీపీ సాయి చైతన్య.. పారిపోతున్న దొంగలపై కాల్పులు జరిపారు.

గాయపడిన ఓ నిందితుడిని నాంపల్లి ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. చాదర్‌ఘాట్‌లోని విక్టరీ ప్లే గ్రౌండ్ సమీపంలో ఈ ఘటన జరిగింది. ఘటనా స్థలిని సౌత్, సెంట్రల్ జోన్ డీసీపీలు స్నేహా మెహ్రా, శిల్పావళి పరిశీలించారు.




## మద్యం టెండర్లపై ముగిసిన వాదనలు.. తీర్పు రిజర్వ్ చేసిన హైకోర్టు

హైదరాబాద్ : తెలంగాణలో మద్యం దుకాణాల కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ గురువారంతో ముగిసిన విషయం తెలిసిందే. అయితే, రాష్ట్రంలో బీసీ బంద్, బ్యాంకుల బంద్‌లతో దరఖాస్తు చేసుకోలేకపోయామన్న ఫిర్యాదులతో ఎక్సైజ్ శాఖ మద్యం షాపుల దరఖాస్తుల గడవును ఈ నెల 23 వరకు పొడిగించింది. అయితే, దరఖాస్తును గడువు పెంచడం చట్ట విరుద్ధమంటూ పలువురు మద్యం వ్యాపారులు తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు వారి పిటిషన్లపై ఇవాళ మరోసారి ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు న్యాయమూర్తి ఎన్ తుకారంజీ తీర్పును రిజర్వు చేశారు. వాదనల సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది టెండర్ల గడువు ఏ నిబంధన ప్రకారం పొడిగించారో చెప్పాలన్నారు. అయితే, టెండర్లపై పొడిగింపుపై లిఖితపూర్వక వాదనలు సమర్పిస్తామని ఏఏజీ సమర్పించారు. అదేవిధంగా మద్యం టెండర్లకు సోమవారం యథావిధిగా డ్రా తీసుకొవచ్చి కోర్టు స్పష్టం చేసింది. తీర్పునకు లోబడే మద్యం దుకాణాలు లైసెన్స్ కేటాయించాలని ఆదేశాలు జారీ చేశారు. కాగా, తీర్పు రిజర్వ్ చేసిన నేపథ్యంలో ఓ వైపు ప్రభుత్వం కోర్టు నుంచి ఎలాంటి తీర్పు వస్తుందోనని ఆసక్తిగా చూస్తుంటే.. మరోవైపు గడువు తర్వాత మద్యం షాపులకు దరఖాస్తు చేసిన ఆశావహుల్లో తమ పరిస్థితి ఏంటనే ఆందోళన వ్యక్తం అవుతోంది. అయితే, గత వాదనల సందర్భంగా జస్టిస్ ఎన్ తుకారంజీ సంచలన వ్యాఖ్యలు చేశారు. అసలు మద్యం దరఖాస్తుల గడువు పెంపునకు చట్టబద్ధత ఉందా.. అని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ఇలా ఇష్టానుసారంగా వ్యవహరించడం కుదరదని కామెంట్ చేశారు. చట్ట విరుద్ధంగా గడువు పెంచితే దరఖాస్తులు రద్దు చేయాల్సి ఉంటుందని జస్టిస్ తుకారంజీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరపు న్యాయవాది విజ్ఞప్తి మేరకు కేసులో తదుపరి విచారణను ఇవాల్టికి వాయిదా వేశారు. మరోవైపు మద్యం దుకాణాల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించకపోవడంపై దాఖలైన పిటిషన్‌పై ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది.



## హరీశ్‌రావు చొరవ.. జోర్డాన్ నుంచి తెలంగాణకు చేరుకున్న వలస కార్మికులు

సంగారెడ్డి: ఉపాధి నిమిత్తం జోర్డాన్ వెళ్లి వివిధ కారణాలతో అక్కడే చిక్కుకున్న 12 మంది వలస కార్మికులు ఎట్టకేలకు తెలంగాణకు చేరుకున్నారు. వారిని సొంతూళ్లకు చేర్చేందుకు మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు కృషి చేశారు. కంపెనీకి చెల్లించాల్సిన పెనాల్టీ, విమాన ఛార్జీలు స్వయంగా చెల్లించారు. ఈక్రమంలో తెల్లవారుజామున హైదరాబాద్‌కు చేరుకున్న వలస కార్మికులు.. హరీశ్‌రావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జోర్డాన్‌లో అనేక ఇబ్బందులు, కష్టాలు ఎదుర్కొన్న తమను ఆదుకొని, స్వదేశానికి తిరిగి వచ్చేలా చేశారని పేర్కొన్నారు. సరైన తిండి కూడా లేకుండా అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు చెబుతూ కన్నీరు పెట్టుకున్నారు. ఎలాంటి ఆందోళన చెందవద్దని ఈ సందర్భంగా హరీశ్‌రావు వారికి భరోసా ఇచ్చారు. తెలంగాణలో ఉండి ఉపాధి, ఉద్యోగ మార్గాలపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల్లో జగిత్యాల, నిర్మల్, కామారెడ్డి, నిజామాబాద్, సిద్దిపేట జిల్లాల్లోని తమ సొంతూళ్లకు వలస కార్మికులు పయనమయ్యారు.

## సీఎం, మంత్రుల ఆధిపత్య ధోరణి భరించలేకే ఐఏఎస్‌ల రాజీనామా: సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్: సీఎం, మంత్రుల ఆధిపత్య ధోరణి భరించలేకే కొందరు ఐఏఎస్‌లు రాజీనామా చేస్తున్నారని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి నేత సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. రిజ్వీ నిజాయతీ గల అధికారి అని ప్రజలందరికీ తెలుసన్నారు. ఆయన్ను మానసికంగా వేధించడంతోనే రాజీనామా చేశారని పేర్కొన్నారు. రాజకీయ నాయకులకు ఐఏఎస్ రిజ్వీ రాజీనామా చెంపపెట్టు అన్నారు. సీఎం, మంత్రులు లూటీ చేస్తున్నారని ఆరోపించారు. సీఎంపై మంత్రి కుమార్తె ఆరోపణలు చేశారని నిరంజన్‌రెడ్డి ఎద్దేవా చేశారు.




## అమరవీరుల కుటుంబాలకు రూ.కోటి ఇవ్వాలి: కవిత

హైదరాబాద్: అమరవీరుల కుటుంబాలకు కోటి రూపాయలు ఇవ్వాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ జాగృతి జనం బాటలో భాగంగా అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు.

అనంతరం నిజామాబాద్ పర్యటనకు కవిత బయలు దేరి వెళ్లారు. తెలంగాణ ఉద్యమంలో 1200 మంది అమరులయ్యారన్నారు. తెచ్చుకున్న తెలంగాణలో అమరుల ఆశయాలు నెరవేర్చడంలో ఎంత వరకు ముందుకు వెళ్లామో ఆలోచించుకోవాలని కవిత కోరారు.



## ప్రైవేట్ ట్రావెల్స్ వెనకడుగు.. ఆర్టీసీకి ఊహించని గిరాకీ




హైదరాబాద్, అక్టోబర్ 25: కర్నూల్ బస్సు ప్రమాదం తరువాత ఆర్టీఏ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టారు. ఫిట్‌నెస్ లేని ప్రైవేటు బస్సులపై కొరడా ఝులిపిస్తున్నారు అధికారులు. నిబంధనలు పాటించని 12 బస్సులపై కేసులు నమోదు చేయడంతో పాటు.. 8 బస్సులను సీజ్ చేశారు. మరోవైపు కర్నూల్ ప్రమాదం తరువాత ప్రైవేటు బస్సుల యాజమాన్యాల్లో కూడా చలనం వచ్చినట్లు తెలుస్తోంది. ఫిట్‌నెస్ లేని బస్సులను పెద్ద ఎత్తున నిలిపివేస్తున్న పరిస్థితి. ముందుగా బుక్ చేసిన టికెట్లను కూడా ప్రైవేటు ట్రావెల్స్ రద్దు చేస్తున్నాయి. వీకెండ్ కావడంతో ప్రైవేటు ట్రావెల్స్‌లో ప్రయాణికులు భారీగా బుకింగ్ చేసుకున్నారు. అయితే ఫిట్‌నెస్ లేని బస్సులు, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బస్సులపై ఆర్టఏ చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో భారీగా బస్సులను యాజమాన్యాలు నిలిపివేస్తున్నాయి. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలతో పాటు బెంగళూరులో కూడా ఆర్టీఏ అధికారులు భారీగా బస్సులను సీజ్ చేస్తున్నారు. తెలంగాణలో వారం రోజులు పాటు స్పెషల్ డ్రైవ్‌లు కొనసాగునున్నాయి. ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు పెద్ద ఎత్తున బుకింగ్‌లను రద్దు చేయడంతో ఆర్టీసీకి గిరాకీ పెరిగింది.

## అక్కడకు మేం వస్తాం.. మీరు వస్తారా.. హరీష్‌కు అడ్లూరి సవాల్



సిద్దిపేట, అక్టోబర్ 25: కేబినెట్ మీటింగ్‌న ఉద్దేశించి మాజీ మంత్రి హరీష్ రావు చేసిన వ్యాఖ్యలపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ..రాష్ట్ర కేబినెట్ సమావేశాన్ని హరీష్ రావు దండుపాళ్యం బ్యాచ్ అనడం బాధాకరమన్నారు. తమను అవహేళన చేశారని.. ఉద్యమ నాయకుడు ఇలా అనడం సిగ్గు చేటు అంటూ మండిపడ్డారు. 2004లో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలో హరీష్ రావు మంత్రిగా పని చేశారని.. ఆ విషయం హరీష్ మరవద్దని అన్నారు మంత్రి. మంత్రి వర్గంలో ప్రజలకు అవసరం అయ్యే మీటింగ్ తప్ప.. దండుపాళ్యం లాగా దోచుకోవడం కోసం మీటింగ్ పెట్టలేదని స్పష్టం చేశారు. 10 ఏళ్లు అధికారంలో ఉండి అలా అనడం బాధాకరమన్నారు. ఒక మాజీ ఎమ్మెల్యేతో తనను తిట్టించడం దారుణమని మండిపడ్డారు. హరీష్ భజన మండలితో తనను తిట్టించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. తెలంగాణా ఏర్పాటులో తాము కూడా త్యాగాలు చేశామని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 20 నెలల్లోనే ఇంతగా టార్గెట్ చేయడం ఏంటని సీరియస్ అయ్యారు. 2014 బీఆర్ఎస్ హామీలను నెరవేర్చారా అని ప్రశ్నించారు. దళిత ముఖ్యమంత్రి, ఇంటి కో ఉద్యోగం లాంటి హామీలు ఏమయ్యాయని నిలదీశారు. ముఖ్యమంత్రి, మంత్రిని ఏకవచనంతో మాట్లాడటం ఏంటంటూ ఫైర్ అయ్యారు. 10 ఏళ్లలో ఎప్పుడైనా ఒక్క నియామక పత్రం ఇచ్చారా అని అడిగారు. బీఆర్ఎస్ చేసిన అప్పులకు మిత్తీలు కట్టుకుంటూనే సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలును నేరవేర్చక పోతే ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ పాలన, రెండేళ్లలో కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. 'హైదరాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం దగ్గర మేము వస్తాం మీరు వస్తారా' అంటూ ఛాలెంజ్ చేశారు. 42 శాతం బీసీ రిజర్వేషన్‌ను కేంద్రం ఎందుకు అమలు చేయడంలేదో రాష్ట్రంలో ఉన్న ఇద్దరు కేంద్ర మంత్రులు చెప్పాలని డిమాండ్ చేశారు. 'నేను వివాదం చేయడానికి ఇక్కడికి రాలేదు. మాకు ఆస్తులు, ఫామ్ హౌస్‌లు కాదు మా దళితులకు ఆత్మగౌరవం ముఖ్యం. జూబ్లీహిల్స్, గ్రామస్థాయి ఎన్నికలు ఉన్నాయ్ అందులో ప్రజలు ఎవరికీ బ్రహ్మరథం పడుతారో చూద్దాం' అంటూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పేర్కొన్నారు. కాగా.. ఈరోజు ఉదయం పట్టణంలోని వెంకటేశ్వర స్వామిని మంత్రి దర్శించుకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన మంత్రికి పూర్ణకుంభంతో ఆలయ పూజారులు, అధికారులు స్వాగతం పలికారు.




## మరో ప్రైవేట్ బస్సు బోల్తా.. 20 మందికి గాయాలు

**హైదరాబాద్, అక్టోబర్ 25: కర్నూలు బస్సు ప్రమాద ఘటన మరువకముం దే మరో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుకు ప్రమాదం జరిగింది. హైదరాబాద్‌లోని పెద్ద అంబర్‌పేట దగ్గర న్యూ గో ట్రావెల్స్ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 20 మంది ప్రయాణికులకు గాయాలు అయ్యాయి. వీరిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. న్యూ గో ఎలక్ట్రికల్ బస్సు మియాపూర్ నుంచి గుంటూరు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదానికి సంబంధించి పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.**




## పసిడి ప్రియులకు అలర్ట్.. బంగారం ధర మరికొంచెం పెరిగింది..

**ఆల్ టైమ్ రికార్డ్ స్థాయిల నుంచి క్రమంగా దిగి వస్తున్న బంగారం ధర శనివారం ట్రేడింగ్‌లో స్వల్పంగా పెరిగింది. దీపావళి తర్వాత బంగారం ధర భారీగా తగ్గిన సంగతి తెలిసిందే. అంతర్జాతీయంగా బంగారం ఔన్స్ ధర తగ్గడంతో దేశీయంగా కూడా పసిడి ధరలు క్రమంగా దిగివచ్చాయి.. అయితే శనివారం ట్రేడింగ్‌లో మాత్రం బంగారం స్వల్ప పెరుగులను నమోదు చేసింది. శనివారం (అక్టోబర్ 25న) మధ్యాహ్నం 12 గంటల సమయంలో హైదరాబాద్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1, 25, 620కి చేరింది. నిన్నటితో పోల్చుకుంటే 125 రూపాయల మేర పెరిగింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 1, 15, 150కి చేరింది . నిన్నటితో పోల్చుకుంటే 115 రూపాయల మేర పెరుగుదల నమోదు చేసింది. ఇక, దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 25, 770కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 1, 15, 300కి చేరుకుంది.**

# జాతీయ గుమ్మడికాయ దినోత్సవం

**- ప్రకృతి ప్రసాదానికి కృతజ్ఞతగా, ఆరోగ్యానికి అంకితమైన ఉత్సవం - అక్టోబర్ 26... జాతీయ గుమ్మడికాయ దినోత్సవం**




ప్రతి సంవత్సరం అక్టోబర్ 26న ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే జాతీయ గుమ్మడికాయ దినోత్సవం ప్రకృతికి కృతజ్ఞత తెలియజేసే ఒక అర్థవంతమైన వేడుక. పంటల కాలాన్ని, రైతుల కృషిని, ప్రకృతి ప్రసాదాన్ని గుర్తించు కోవడమే కాకుండా, ఆరోగ్యపరమైన సత్ప్రయోజనాలను పునరుద్ఘాటించే ఉత్సవం ఇది. అమెరికా దేశంలో ప్రారంభమైన ఈ దినోత్సవం, నేడు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందింది. హాలోవీన్ పండుగకు ముందు రోజు జరుపుకునే ఈ దినం, శరదృతువులో పంటల పండుగ ఉత్సాహాన్ని ప్రతిబింబిస్తుంది. గుమ్మడికాయ లేదా పుంప్కిన్ అనే ఈ పండు కుకుర్బిటేసి కుటుంబానికి చెందినది. ఇది తొలుత అమెరికా ఖండంలో పండించబడినప్పటికీ, ప్రస్తుతం ప్రపంచంలోని దాదాపు అన్ని దేశాలలో సాగు జరుగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా గుమ్మడికాయల ఉత్పత్తి సంవత్సరానికి సుమారు 2.8 కోట్ల టన్నులుగా నమోదవుతోంది. చైనా, భారతదేశం, రష్యా, అమెరికా, మెక్సికో దేశాలు ప్రధాన ఉత్పత్తిదారులు. అమెరికాలోని ఇల్లినాయిస్ రాష్ట్రం ఒక్కటే దేశంలో సుమారు 90 శాతం గుమ్మడికాయల ఉత్పత్తి చేస్తుంది. గుమ్మడికాయ రంగు, ఆకారం, పరిమాణంలో విభిన్నంగా లభిస్తుంది. నారింజ, పసుపు, పచ్చ, తెలుపు రంగుల్లో కనబడే ఈ పండు 90 శాతం నీటిని కలిగి ఉంటుంది. ఇందులో విటమిన్ A, C, E, పొటాషియం, ఐరన్, ఫైబర్, బీటా కేరోటిన్ వంటి అనేక పోషక పదార్థాలు ఉన్నాయి. బీటా కేరోటిన్ శరీరంలో విటమిన్ Aగా మారి కంటి చూపును మెరుగు పరుస్తుంది. గుమ్మడికాయలో ఉన్న యాంటీ ఆక్సిడెంట్లు హృదయ రోగాలను, మధుమేహాన్ని నివారించడంలో దోహద పడతాయి. తక్కువ క్యాలరీలు ఉండటంతో బరువు నియంత్రణకు కూడా ఇది మేలు చేస్తుంది. గుమ్మడికాయ గింజల్లో మగ్నీషియం, జింక్, ఐరన్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉండి మూత్రపిండాల ఆరోగ్యానికి, రక్త ప్రసరణకు తోడ్పడతాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికల ప్రకారం, రోజువారీ ఆహారంలో 100 గ్రాముల గుమ్మడికాయ చేర్చితే శరీరానికి అవసరమైన విటమిన్ A లో సుమారు 245 శాతం అవసరం నెరవేరుతుందని తేలింది. గుమ్మడికాయ పంట వ్యవసాయపరంగా అత్యంత లాభదాయకమైనదిగా పరిగణించ బడుతుంది. ఇది తక్కువ నీటితో ఎక్కువ దిగుబడిని ఇస్తుంది. ఒక్క హెక్టారుకు సగటుగా 20 నుండి 25 టన్నుల దిగుబడి వస్తుంది. భారతదేశంలో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, ఒడిశా రాష్ట్రాల్లో విస్తృతంగా సాగు జరుగుతుంది. పంటకాలం శరదృతువు చివరి దశలో ఉండటంతో అక్టోబర్ చివర్లో దీన్ని కోతకు తెస్తారు. ఆ కాలంలో రైతులు తమ పంటను మార్కెట్లోకి తీసుకువచ్చి, సమాజంతో పంచుకుంటూ ఆనందిస్తారు. అమెరికా, కెనడా దేశాలలో గుమ్మడికాయ పంట కోత సీజన్‌లో పలు పండుగలు నిర్వహిస్తారు. అమెరికాలోని ఇల్లినాయిస్, ఒహియో రాష్ట్రాల్లో ప్రతి ఏడాది "Pumpkin Festival" ఘనంగా జరుగుతుంది. 2016లో న్యూ హాంప్‌షైర్‌లో నిర్వహించిన ఫెస్టివల్‌లో ప్రపంచ రికార్డు సృష్టిస్తూ ఒకే వేదికపై 30,581 గుమ్మడికాయలు అలంకరించి ప్రదర్శించారు. అంతేగాక ప్రతి సంవత్సరం "Pumpkin Weigh-Off" అనే పోటీలు నిర్వహించి, అతిపెద్ద గుమ్మడికాయను ఎంచుతారు. 2023లో అమెరికా మినెసోటా రాష్ట్రానికి చెందిన రైతు ట్రావిస్ గ్యారిసన్ పెంచిన గుమ్మడికాయ 2,749 పౌండ్లు (1,247 కిలోలు) బరువుతో ప్రపంచ రికార్డు సృష్టించింది. సాంస్కృతికంగా గుమ్మడికాయకు ఉన్న ప్రాధాన్యం అద్భుతమైనది. అమెరికాలో అక్టోబర్ 31న జరుపుకునే హాలోవీన్ పండుగలో గుమ్మడికాయ "జాక్-ఓ-లాంటర్న్" రూపంలో ప్రధాన ఆకర్షణగా ఉంటుంది. ప్రజలు గుమ్మడికాయను చెక్కి, అందులో దీపాలు వెలిగించి తమ ఇళ్ల ముందు ఉంచుతారు. ఇది చలికాలం ప్రారంభానికి సంకేతం, అలాగే చెడు శక్తులను నివారించడానికి సంకేతాత్మక సంప్రదాయం. ఈ ఆచారం ఐర్లాండ్‌లో ఉద్భవించి తరువాత అమెరికాలో ప్రసిద్ధి చెందింది. భారతీయ సంస్కృతిలో కూడా గుమ్మడికాయకు విశిష్టమైన స్థానం ఉంది. వేదపారంపర్యంలో దీన్ని "కూష్మాండ" అని పిలుస్తారు. ఇది దేవతార్చనలో, హోమాల్లో, యజ్ఞాల్లో బలిగా ఉపయోగిస్తారు. చెడు శక్తులను దూరం చేయడానికి 'బలి గుమ్మడికాయ'ను పగులగొట్టడం ఒక ఆచారం. దక్షిణ భారత రాష్ట్రాలలో గుమ్మడికాయ వంటలు, చట్నీలు, పాయసాలు సాధారణంగా ప్రతి ఇంటి వంటలో భాగమవుతాయి. ఆయుర్వేద గ్రంథాలలో కూష్మాండ రసాయనాన్ని శరీర వేడిని తగ్గించి మానసిక ప్రశాంతతను పెంచే ఔషధంగా పేర్కొన్నారు. గుమ్మడికాయ వంటలోనూ, వైద్యంలోనూ, పండుగల్లోనూ అంతర్భాగమైంది. పాయసం, హల్వా, పాయ్, కేక్, సూప్ వంటి అనేక వంటకాల్లో దీన్ని ఉపయోగిస్తారు. ప్రపంచవ్యాప్తంగా "Pumpkin Pie" అనేది థాంక్స్ గివింగ్ పండుగకు ప్రసిద్ధ వంటకం. జపాన్, చైనా దేశాల్లో దీన్ని పులుసులు, వేపుళ్లు, సూప్‌లలో విస్తృతంగా వాడుతారు. జాతీయ గుమ్మడికాయ దినోత్సవం కేవలం పంట పండుగ మాత్రమే కాదుబీ అది మన జీవన శైలిలో ప్రకృతి పట్ల కృతజ్ఞత భావాన్ని పెంచే సందేశం. గుమ్మడికాయ పంట రైతులకు ఆర్థిక స్థిరత్వం, వినియోగదారులకు ఆరోగ్య రక్షణ, పర్యావరణానికి స్నేహపూర్వక భవిష్యత్తును అందిస్తుంది. ఈ రోజున మనం గుమ్మడికాయతో చేసిన వంటకాలను పంచుకోవడం, రైతుల కృషిని గౌరవించడం, ప్రకృతి వనరులను సంరక్షించడం ద్వారా ఈ ఉత్సవానికి నిజమైన అర్థం ఇవ్వగలం. గుమ్మడికాయ ప్రకృతి దయగా పుట్టిన పండుగ పండు. ఇది పంటల కాలాన్ని, ఆరోగ్యాన్నీ, ఆనందాన్నీ కలిపే జీవన ప్రతీక. ప్రతి సంవత్సరం అక్టోబర్ 26 మనకు గుర్తు చేసే సందేశం ఒక్కటేు ప్రకృతి ప్రసాదాన్ని గౌరవించు, రైతు కృషిని గుర్తించు, ఆరోగ్యకరమైన జీవనాన్ని అలవరుచుకో. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# జూబ్లీ ఉప ఎన్నిక గెలుపు కోసం ప్రధాన పార్టీల జంగ్

## రాజకీయ ప్రతిష్టకు ప్రతీకగా మారిన జూబ్లీహిల్స్ పోరాటం



జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రాష్ట్ర రాజకీయ వాతావరణాన్ని మళ్లీ కదిలించింది. తెలంగాణ రాజధానిలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నియోజకవర్గం ఇది. మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణంతో ఖాళీ అయిన ఈ స్థానానికి నవంబర్ 11న పోలింగ్ జరగనుంది. 2025లో తెలంగాణ రాజకీయ దిశను సూచించే లిట్మస్ టెస్ట్‌గా ఈ ఉప ఎన్నికను అన్ని ప్రధాన పార్టీలు పరిగణిస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న ఈ తొలి ఉప ఎన్నిక కావడంతో దీని ఫలితం పట్ల దేశవ్యాప్తంగా కూడా ఆసక్తి నెలకొంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గం సామాజిక, ఆర్థిక, రాజకీయంగా మిశ్రమ స్వరూపం కలిగినది. ఫిల్మ్ నగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ వంటి ఆధునిక ప్రాంతాలు, బోరాబండా, యూసుఫ్‌గూడ, ఎర్రగడ్డ వంటి పాత కాలనీలు కలిపి ఈ నియోజకవర్గాన్ని ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి. సుమారు నాలుగు లక్షల ఓటర్లు ఉన్న ఈ ప్రాంతంలో మధ్యతరగతి, మైనారిటీ వర్గాలు, యువత కీలక పాత్ర పోషిస్తున్నారు. ముస్లింలు, క్రైస్తవులు కలిపి దాదాపు 35 శాతం వోటర్లను కలిగి ఉండటం వల్ల, వీరి ఓటు ధోరణి ఫలితంపై నేరుగా ప్రభావం చూపనుంది. మాగంటి గోపీనాథ్ బీఆర్ఎస్ పక్షాన వరుసగా విజయం సాధించి ఈ నియోజకవర్గంలో గట్టి ఆధారం ఏర్పరచుకున్నారు. గత జూన్ లో ఆయన అనూహ్య మరణం నేపథ్యంలో... ఆయన భార్య మాగంటి సునీతను బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించింది. కుటుంబ అనుబంధం, మమకారం, సమాజాభిమానం అనే మూడు భావోద్వేగ రేఖలపై పార్టీ తన వ్యూహాన్ని మలచుకుంది. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు తదితర కీలక నేతలు ఈ ప్రచారాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా మలుస్తున్నారు. మహిళా ఓటర్లలో సానుభూతి వాతావరణాన్ని పెంచడం, మైనారిటీలలో పూర్వ మద్దతును తిరిగి సంపాదించడం, నగరంలోని మౌలిక సదుపాయాల విస్తరణలో బీఆర్ఎస్ చేసిన పనులను గుర్తుచేయడం అనే మూడు అస్త్రాలతో ప్రచారం సాగిస్తోంది. అలాగే బాకీ కార్డుల పంపిణీ ద్వారా ప్రయోజనం ఆశిస్తున్నది. బీఆర్ఎస్ ప్రణాళిక ప్రకారం ఓటు శాతం పెరగడం కంటే తమ ఓటు బ్యాంకు కుదురుగా ఉండడం ముఖ్యమని పార్టీ ఆలోచిస్తోంది. కాంగ్రెస్ పక్షం అధికారంలో ఉన్న ప్రభుత్వం కాబట్టి, ఈ ఉప ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేలు మొత్తం 13 మంది బృందంగా ప్రచార బాధ్యతలు చేపట్టారు. అభ్యర్థి నవీన్ యాదవ్ యువకుడు, ఓ స్థానిక నాయకుడిగా ప్రజల్లో పరిచయం కలిగిన వ్యక్తి. ప్రభుత్వ పథకాలు ు గృహజ్యోతి, ఉచిత బస్సు ప్రయాణం, గృహనిర్మాణం, మహిళల సంక్షేమ పథకాలు ు ప్రచారంలో ప్రధాన ఆయుధాలుగా మారాయి. కాంగ్రెస్ పార్టీ నగర యువతను ఆకర్షించేందుకు సోషల్ మీడియా వ్యూహాలకు కూడా ప్రాధాన్యం ఇస్తోంది. పార్టీ అంతర్గత సర్వేలు, మైనారిటీ వోటర్ల మద్దతు, కొత్త ఓటర్ల ఉత్సాహం ఆధారంగా ఈ ఉప ఎన్నికలో తాము ఆధిక్యంలో ఉన్నామని కాంగ్రెస్ నేతలు ప్రకటిస్తున్నారు. అయితే అధికారంలో ఉన్న ప్రభుత్వానికి వ్యతిరేక భావన, స్థానిక స్థాయిలో అభ్యర్థి పరిమిత పరిచయం అనే అంశాలు పార్టీకి సవాళ్లుగా నిలుస్తున్నాయి. భారతీయ జనతా పార్టీ ఈ పోటీలో మూడో పక్షంగా ఉన్నప్పటికీ, నగర ప్రాంతాల్లో తన ఆధారాన్ని విస్తరించాలన్న వ్యూహంతో బరిలోకి దిగింది. లంకల దీపక్ రెడ్డి పార్టీ అభ్యర్థి. కేంద్ర ప్రభుత్వ పథకాలు ు సబ్కా సాథ్, సబ్కా వికాస్, మోదీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు లభించిన రహదారి, రైల్వే, మెట్రో అభివృద్ధి ప్రాజెక్టులు ు బీజేపీ ప్రచారానికి ఆధారం. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నేతృత్వంలో, పార్టీ అధ్యక్షులు రాంచందర్ రావు సారథ్యంలో, బీజేపీ సీనియర్ నేతలు ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. కాంగ్రెస్%-%ఎంఐఎం మైత్రిని ఎత్తి చూపుతూ మైనారిటీల ధోరణిపై ప్రశ్నలు లేవనెత్తడం ద్వారా మధ్యతరగతి వోటర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే బీజేపీకి ఈ ప్రాంతంలో శాశ్వత శక్తివంతమైన పార్టీగా ఎదగడం కోసం అవసరమైన మౌలిక వేదిక ఇంకా పూర్తిగా ఏర్పడలేదు. ఈ ఎన్నికలో మొత్తం 81 మంది నామినేషన్లు దాఖలు కాగా, పరిశీలన అనంతరం 58 మంది పోటీదారులు మిగిలారు. వీరిలో 51 మంది స్వతంత్రులు ఉండటం గమనార్హం. ఈ నేపథ్యంలో ఓటు విభజన, కులవర్గాల ఆధారంగా వ్యూహరచన, పార్టీ శ్రేణుల సమీకరణ ు ఇవన్నీ నిర్ణాయకమయ్యాయి. ఇదిలా ఉండగా, బీఆర్ఎస్ నకిలీ ఓటర్ల జాబితాలపై చేసిన ఆరోపణలను రాష్ట్ర ఎన్నికల అధికారి నిరాధారమని తేల్చారు. మరోవైపు, కాంగ్రెస్ కార్యకర్తలచే నకిలీ ఓటరు కార్డులు పంపిణీ చేశారనే ఫిర్యాదుపై పోలీసులు విచారణ ప్రారంభించడం ప్రచార వేడిని మరింత పెంచింది. మైనారిటీ ప్రాంతాలలో సమాధుల భూముల కేటాయింపుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన వాగ్దానం నెరవేర్చడం కూడా ఓటర్లను ఆకర్షించే ప్రయత్నంగా పార్టీ వినియోగిస్తోంది. రాజకీయంగా ఈ ఎన్నిక మూడు ప్రధాన అంశాల చుట్టూ తిరుగుతోంది ు ప్రజలలో ప్రభుత్వంపై ఉన్న నమ్మకం, మాజీ పాలనపై ప్రజల అభిప్రాయం, భవిష్యత్ నగరాభివృద్ధి దిశ. బీఆర్ఎస్ భావోద్వేగ పిలుపు, కాంగ్రెస్ పరిపాలనా సంకల్పం, బీజేపీ వికసిత నగరం స్వప్నం ు ఈ మూడు మధ్య ప్రజల తీర్పు నిర్ణయాత్మకం కానుంది. నగరంలో యువత, మహిళా వోటర్లు, మైనారిటీల వోటు శాతం పెరిగితే ఫలితం మరోవైపు మలుపు తిరిగే అవకాశముందని విశ్లేషకులు చెబుతున్నారు. రాజకీయ పరిశీలకుల అభిప్రాయంలో ఈ ఉప ఎన్నిక కేవలం జూబ్లీహిల్స్ పరిధిలోనే కాకుండా, రాష్ట్ర రాజకీయం ఎటు దిశగా పయనిస్తుందో సూచించే సూచికగా నిలవనుంది. బీఆర్ఎస్ తిరిగి పుంజుకుంటుందా? కాంగ్రెస్ తన ప్రజాదరణను నిలబెట్టుకుంటుందా? బీజేపీ నగరంలో ప్రత్యామ్నాయ శక్తిగా నిలుస్తుందా? అనే ప్రశ్నలకు ఈ ఫలితం సమాధానం ఇవ్వనుంది. జూబ్లీహిల్స్ ప్రజలు ఇప్పుడు రెండు భావోద్వేగాల మధ్య నిలబడి ఉన్నారు ు ఒకవైపు మాగంటి కుటుంబ పట్ల ఉన్న అనుబంధం, మరోవైపు ప్రస్తుత ప్రభుత్వంపై విశ్వాసం. నవంబర్ 11న పోలింగ్ జరగగా, ఫలితాలు రాష్ట్ర రాజకీయ సమీకరణాలపై విస్తృత ప్రభావం చూపనున్నాయి. ఈ ఉప ఎన్నిక కేవలం ఓ ఖాళీ భర్తీ కాదు, తెలంగాణలో మూడు ప్రధాన పార్టీల భవిష్యత్తు శక్తిసామర్థ్యాలను అంచనా వేయించే రాజకీయ యుద్ధరంగం. ప్రజాస్వామ్యంలో ఓటు శక్తి ఎప్పటిలానే ఈసారి కూడా రాజకీయ దిశను నిర్ణయించే కీలక శక్తిగా నిలవనుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# బంగ్లాలో చైనా ఎంట్రీ.. భారత్ కు ముప్పు?



భారతదేశానికి, బంగ్లాదేశ్‌కు మధ్య దశాబ్దాలుగా ఉన్న మైత్రి ఇప్పుడు ఒక కీలకమైన పరీక్షను ఎదుర్కొంటోంది. ఈ పరీక్షకు కేంద్రబిందువు – పవిత్రమైన తీస్తా నది. 1996లో కుదిరిన గంగా జలవిభజన ఒప్పందం 2026తో ముగియనున్న నేపథ్యంలో తీస్తా నది జలాల పంపిణీ విషయంలో బంగ్లాదేశ్ చైనా వైపు చూడటం భారత్‌కు కొత్త భద్రతా సవాళ్లను సృష్టిస్తోంది.

**తీస్తా నది వివాదం: నీటి కొరతతో బంగ్లా ఆందోళన...** తీస్తా నది సిక్కింలో జన్మించి పశ్చిమ బెంగాల్ గుండా బంగ్లాదేశ్‌లోకి ప్రవహిస్తుంది. ఈ నది నీటి వాటాపై రెండు దేశాల మధ్య దశాబ్దాలుగా వివాదం నడుస్తోంది. 2011లో ఇరు దేశాల మధ్య జలవిభజన ఒప్పందం కుదిర్చేందుకు ప్రయత్నించినా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వ్యతిరేకత కారణంగా అది ఆగిపోయింది. దీని ఫలితంగా, బంగ్లాదేశ్‌లోని ఉత్తర ప్రాంతాలు వేసవిలో తీవ్రమైన నీటి కొరతతో అల్లాడుతున్నాయి. వ్యవసాయం, తాగునీరు కోసం తీస్తా జలాలపై ఆధారపడిన లక్షలాది మంది ప్రజల్లో అసంతృప్తి పెరిగింది.

**డ్రాగన్ దూకుడు: చైనా 'తీస్తా రివర్ మాస్టర్ ప్లాన్'...** బంగ్లాదేశ్ పడుతున్న ఈ ఇబ్బందిని చైనా తనకు అనుకూలంగా మలుచుకుంటోంది. బంగ్లాదేశ్ ప్రభుత్వం చైనాతో కలిసి "తీస్తా రివర్ మాస్టర్ ప్లాన్" అమలు చేయడానికి సిద్ధమవుతోంది. ఈ భారీ ప్రాజెక్టు కింద, చైనా సంస్థలు బంగ్లాదేశ్‌లో అత్యాధునిక డ్యామ్‌లు, కాలువలు, వరద నియంత్రణ వ్యవస్థలను నిర్మించడానికి సుముఖత వ్యక్తం చేశాయి. బంగ్లాదేశ్‌కు ఇది ఆర్థికంగా, నీటి భద్రత పరంగా లాభదాయకంగా కనిపించినప్పటికీ, దీని వెనుక చైనా యొక్క వ్యూహాత్మక ఉద్దేశం స్పష్టంగా ఉంది.

**భారత్ ఆందోళన: భద్రతా సమస్యగా మారిన నీటి వివాదం..** భారతదేశం ఈ పరిణామాన్ని కేవలం నీటి పంపకాల సమస్యగా చూడటం లేదు, ఇది తమ తూర్పు సరిహద్దు భద్రతకు ముప్పుగా భావిస్తోంది. చైనా గత కొన్నేళ్లుగా దక్షిణాసియాలో తన పట్టును పెంచుకునేందుకు అనేక దేశాల్లో భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులను చేపడుతోంది శ్రీలంకలో హంబన్‌టోట ఓడరేవు లీజు.. నేపాల్, మాల్దీవులులో అనేక ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టుల నిర్మాణం... ఇప్పుడు బంగ్లాదేశ్‌లో కూడా తీస్తా నది వద్ద చైనా ఇంజినీర్లు, సాంకేతిక బృందాలు పనిచేయడం అంటే భారత ఈశాన్య రాష్ట్రాలకు, సరిహద్దు భద్రతకు నేరుగా సవాలు విసిరినట్టే అవుతుంది.

**నిపుణుల హెచ్చరిక...** భారత వ్యూహాత్మక నిపుణుల అభిప్రాయం ప్రకారం, "బంగ్లాదేశ్‌లో చైనా నిర్మించే ప్రతి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్ వెనుక వ్యూహాత్మక ఉద్దేశం ఉంటుంది. తీస్తా నది ప్రాజెక్ట్ ద్వారా చైనా గంగానది జల ప్రవాహాలను.. భారత అంతర్గత జల వ్యవస్థలను అంచనా వేయడానికి, వాటిపై పరోక్ష నియంత్రణ సాధించడానికి ప్రయత్నించవచ్చు."

**మైత్రికి పరీక్ష: బంగ్లా ప్రజాభిప్రాయం మళ్లుతుందా?...** ప్రస్తుతం బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా ప్రభుత్వం భారత్‌తో మెరుగైన సంబంధాలనే కొనసాగిస్తోంది. కానీ, 2026 గడువు దగ్గర పడుతుండగా, తీస్తా ఒప్పందంపై భారత్ నుంచి స్పష్టమైన హామీ లభించకపోతే, నీటి కొరతతో బాధపడుతున్న బంగ్లాదేశ్ ప్రజాభిప్రాయం అనివార్యంగా చైనా వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది. ఈ పరిణామం భారతదేశ–బంగ్లాదేశ్ స్నేహానికి, దక్షిణాసియాలో భారత్ ఆధిపత్యానికి పెద్ద పరీక్షగా నిలుస్తుంది. తీస్తా వివాదం ఇపుడు కేవలం నీటి రాజకీయాలు కాదు, అది భారత్ చైనా భౌగోళిక రాజకీయ పోటీకి కొత్త వేదికగా మారుతోంది. భారత్ తక్షణమే దౌత్యపరమైన, ఆర్థికపరమైన ప్రత్యామ్నాయాలను బంగ్లాదేశ్‌కు అందించకపోతే, తూర్పు సరిహద్దుల్లో కొత్త, తీవ్రమైన భద్రతా సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది.

# 'అత్యాచారం చేయడానికి స్నేహం ఎలాంటి లైసెన్స్ ఇవ్వదు'!

ఇటీవల కాలంలో మైనర్ బాలికలపై రకరకాల కారణాలతో లైంగిక వేధింపులు, అత్యాచారాలు జరుగుతున్న సంగతి తెలిసిందే! తాజాగా ఏపీలోని తునిలోనూ అలాంటి ఘటనే వెలుగు చూసి తీవ్ర కలకలం రేపింది. మరోవైపు మైనర్లపై స్నేహం పేరు చెప్పి అత్యాచారాలకు పాల్పడుతున్న ఘటనలు పెరుగుతున్నాయని అంటున్నారు. అలాంటి ఘటనలోనే తాజాగా ఢిల్లీ హైకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. అవును.. 17 ఏళ్ల బాలికపై అత్యాచారం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి ముందస్తు బెయిల్ నిరాకరించిన ఢిల్లీ హైకోర్టు.. తామిద్దరమూ స్నేహితులమే అనే వాదనను సూటిగా తోసిపుచ్చింది! బాధితురాలిపై పదే పదే అత్యాచారం చేయడానికి, ఆమెను నిర్బంధించడానికి లేదా ఆమెను కనికరం లేకుండా కొట్టడానికి స్నేహం అనుమతి ఇవ్వదని పేర్కొంది. వివరాల్లోకి వెళ్తే... మైనర్ అయిన బాధితురాలు చేసిన ఫిర్యాదు ప్రకారం.. కొన్నేళ్లుగా నిందితుడితో ఆమెకు పరిచయం ఉంది. ఈ క్రమంలో... అతడు తన స్నేహితుడి ఇంట్లో ఆమెను బంధించి.. కనికరం లేకుండా కొట్టి.. లైంగికంగా వేధించాడు. ఈ విషయాన్ని ఎవరికైనా చెప్తే చంపేస్తానని బెదిరించాడు. దీనిపై ఆమె కోర్టును ఆశ్రయించింది! ఈ సందర్భంగా స్పందించిన నిందితుడు... తామిద్దరం ఇష్టపూర్వకంగా ఆ బంధాన్ని కొనసాగించా




మని, ఎఫ్.ఐ.ఆర్ నమోదులో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోర్టును ఆశ్రయించాడు. దీనిపై తాజాగా విచారణ జరిపిన జస్టిస్ స్వర్ణ కాంత శర్మ ఈ ముందస్తు బెయిల్ పిటిషన్ ను తిరస్కరించారు. ఈ సందర్భంగా... సంబంధిత పార్టీలు స్నేహితులు అయినప్పటికీ.. బాధితురాలిపై పదే పదే అత్యాచారం చేయడానికి, ఆమెను తన స్నేహితుడి ఇంట్లో బంధించడానికి, ఆమెను కనికరం లేకుండా కొట్టడానికి స్నేహం ఎటువంటి లైసెన్స్ ఇవ్వదని.. ఫిర్యాదుదారు తన వాంగ్మూలంలో ప్రాథమికంగా వెల్లడించినట్లుగా వైద్య రికార్డుల ద్వారా ఇది ధృవీకరించబడిందని న్యాయమూర్తి ఉత్తర్వులో పేర్కొన్నారు. మరోవైపు.. ఎఫ్.ఐ.ఆర్ దాఖలు చేయడంలో 11 రోజుల జాప్యం జరిగిందని.. తనకు, బాధితురాలికి మధ్య సంబంధం ఏకాభిప్రాయంతో ఉందని పేర్కొంటూ నిందితుడు బెయిల్ కోరిన విషయంపైనా స్పందించిన జస్టిస్ స్వర్ణ కాంత శర్మ... సహజంగానే భయం, తన మనసుకు తగిలిన గాయం.. ఈ ఘటన గురించి తల్లిదండ్రులకు చెప్పడానికి బాధితురాలు నిరాకరించిందని అన్నారు! అందువల్ల, పైన పేర్కొన్న పరిస్థితుల దృష్ట్యా ప్రస్తుత కేసులో మోపబడిన ఆరోపణల తీవ్రతతో పాటు, ప్రాథమికంగా రికార్డులో ఉన్న అంశాల ద్వారా ధృవీకరించబడినందున, ముందస్తు బెయిల్ మంజూరు చేయడానికి ఎటువంటి అవకాశం లేదని ఈ కోర్టు గుర్తించిందని.. దీని ప్రకారం, ప్రస్తుత ముందస్తు బెయిల్ దరఖాస్తు కొట్టివేయబడిందని న్యాయమూర్తి అన్నారు!

# రష్యన్ స్పై చరిత్రకు సజీవ ప్రతీక.. ఈ 'అందమైన గూఢచారి'

ఒకప్పుడు ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రష్యన్ గూఢచారి అన్నా చాప్‌మాన్ మరోసారి వార్తల్లోకి ఎంట్రీ ఇచ్చారు. అమెరికాలో అరెస్టై 15 ఏళ్ల తరువాత ఇప్పుడు ఆమెకు రష్యా ప్రభుత్వం నూతన బాధ్యతలు అప్పగించింది. రష్యన్ ఇంటెలిజెన్స్ చరిత్ర, వారి గూఢచర్య విజయాలను ప్రపంచానికి పరిచయం చేయడానికి కొత్తగా ఏర్పాటు చేసిన "మ్యూజియం ఆఫ్ రష్యన్ ఇంటెలిజెన్స్"కు అన్నా చాప్‌మాన్‌ను చీఫ్‌గా నియమించడం పుతిన్ ప్రభుత్వ నిర్ణయం.

ఒకప్పుడు లేడీ జేమ్స్ బాండ్‌గా ప్రసిద్ధి చెందిన ఈ మాజీ గూఢచారి ఇప్పుడు రష్యన్ స్పై చరిత్రకు సజీవ ప్రతీకగా నిలుస్తున్నారు.

**దౌత్య కుటుంబంలో పుట్టిన గూఢచారి...** అన్నా చాప్‌మాన్ దౌత్య నేపథ్యం కలిగిన కుటుంబంలో జన్మించారు. ఆమె తండ్రి సోవియట్ యూనియన్ కాలంలో విదేశీ వ్యవహారాల విభాగంలో ఉన్నతాధికారిగా సేవలందించారు. మాస్కోలోని ప్రముఖ యూనివర్సిటీలో ఎకనామిక్స్ చదివిన ఆమె, తరువాత బ్రిటన్‌కు చెందిన సైకాలజీ విద్యార్థి అలెక్స్ చాప్‌మాన్‌ను వివాహం చేసుకున్నారు. లండన్‌లో స్థిరపడ్డా, నాలుగేళ్లకే ఇద్దరి మధ్య విభేదాలు వచ్చి విడిపోయారు.

**గూఢచర్యంలోకి అడుగు...** లండన్‌లో ఉన్న సమయంలో ఓ రష్యన్ గూఢచారి ఆమెతో పరిచయం అయ్యాడు. అన్నా నెట్‌వర్కింగ్ నైపుణ్యాలు, ఆకర్షణ, ధైర్యం చూసి ఆయన రష్యన్ ఇంటెలిజెన్స్ విభాగంలో చేరమని సూచించాడు. పలు పరీక్షలు, ట్రైనింగ్‌లను విజయవంతంగా పూర్తి చేసిన తరువాత ఆమెను రష్యా సీక్రెట్ ఆపరేటివ్‌గా నియమించారు. ఆకర్షణీయమైన



వ్యక్తిత్వంతో, చురుకైన ఆలోచనలతో ఆమెను "రష్యన్ బ్లాక్ విడో" అని పిలిచేవారు. ఉన్నత రాజకీయ నేతలు, వ్యాపారవేత్తలతో పరిచయాలు పెంచుతూ రహస్య సమాచారాన్ని సేకరించడం ఆమె ప్రధాన బాధ్యతగా ఉండేది.

**అమెరికాలో అరెస్టు.. ప్రపంచాన్ని కుదిపిన సంఘటన...** 2009లో రియల్‌ఎస్టేట్ వ్యాపారిగా అమెరికాలో అడుగుపెట్టిన అన్నా, అసలైన మిషన్ మాత్రం రహస్యమైంది. ఎఫ్‌బీఐ ఇప్పటికే రష్యన్ స్లీపర్ సెల్స్‌పై "ఆపరేషన్ ఘోస్ట్ స్టోరీస్"ను అమలు చేస్తుండగా, 2010లో అన్నా చాప్‌మాన్ సహా మరో 9 మందిని అరెస్టు చేశారు. వారు రష్యా ప్రభుత్వానికి రహస్య సమాచారాన్ని పంచుకుంటున్నట్లు ఎఫ్‌బీఐ నిర్ధారించింది. ఈ ఘటన ప్రపంచ గూఢచార చరిత్రలో ఒక కీలక మలుపుగా నిలిచింది. రెండు వారాల వ్యవధిలోనే అమెరికా–రష్యా దేశాల మధ్య గూఢచారుల మార్పిడి ఒప్పందం కుదరడంతో, అన్నా స్వదేశానికి చేరుకున్నారు.

**రష్యాలో సెలబ్రిటీగా మారిన అన్నా...** రష్యాకు తిరిగి వచ్చిన తర్వాత అన్నా చాప్‌మాన్ జాతీయ స్టార్‌గా మారిపోయారు. ఆమె టీవీ షో హోస్ట్‌గా, పబ్లిక్ స్పీకర్‌గా, తరువాత పుతిన్ పార్టీతో కలిసి రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇప్పుడు రష్యన్ ఇంటెలిజెన్స్ మ్యూజియం చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించడం ఆమె జీవితంలో మరో కీలక అధ్యాయంగా మారింది.

**వ్యక్తిగత జీవితం...** అన్నా చాప్‌మాన్ ప్రస్తుతం రష్యాలో నివసిస్తున్నారు. ఆమెకు ఒక కుమారుడు ఉన్నాడు. పలు దేశాల్లో వివాదాస్పద వ్యక్తిగా ఉన్నప్పటికీ, రష్యాలో ఆమెను "దేశభక్తి ప్రతీక"గా చూడడం గమనార్హం.

ఒకప్పుడు అమెరికా గూఢచారి వ్యవస్థను సవాలు చేసిన అన్నా చాప్‌మాన్ ఇప్పుడు రష్యా గూఢచార చరిత్రను సంరక్షించే బాధ్యతను చేపట్టడం ఆసక్తికర పరిణామం. అందం, చతురత, ధైర్యం.. ఈ మూడు గుణాలతో ప్రపంచానికి గుర్తుండిపోయిన ఆమె కథ మరోసారి రష్యన్ ఇంటెలిజెన్స్ చరిత్రలో కొత్త పుట రాసింది.

చురకలు

# సంపాదకీయం

## వలసదారులే వలసలను అనడమా?

## నిక్కీ హేలీ కొడుక్కి జర్నలిస్ట్ ఇచ్చిపడేశాడు

అమెరికా రాజకీయాల్లో మరోసారి వలసల అంశం చర్చకు దారితీసింది. రిపబ్లికన్ నేత, మాజీ ఐక్యరాజ్యసమితి రాయబారి నిక్కీ హేలీ కుమారుడు నలిన్ హేలీ చేసిన ఒక ట్వీట్ ఇప్పుడు అమెరికా సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయింది. సామూహిక వలసలు అమెరికా ఉద్యోగ అవకాశాలను దెబ్బతీస్తున్నాయని ఆయన చేసిన వ్యాఖ్యలపై తీవ్రమైన విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**నలిన్ హేలీ వివాదాస్పద ట్వీట్...** "అమెరికాకు వలసలు ఆపాలి. విదేశాల నుంచి వచ్చే వలసల వల్ల స్థానిక అమెరికన్లకు ఉద్యోగాలు దొరకడం లేదు" అంటూ నలిన్ హేలీ ట్వీట్ చేశారు. ఈ ట్వీట్ అమెరికా అంతటా చర్చకు దారితీ సింది. వలసలు, వీసాలు, ఉద్యోగాలు అనే సున్నితమైన అంశంపై ఆయన చేసిన వ్యాఖ్యలను చాలామంది 'ద్వేషపూరితం'గా అభివర్ణించారు.


**"మీ తాత కూడా ఇండియా నుంచే వచ్చారు" : మెహదీ హసన్ రిప్లై...** ఆ ట్వీట్‌కు బ్రిటిష్-అమెరికన్ జర్నలిస్ట్ మెహదీ హసన్ ఘాటు సమాధానం ఇచ్చారు. "మీ తాత అజిత్ సింగ్ రంధవా 1969లో ఇండియా నుంచి అమెరికా వలస వచ్చారు. మీరు ఇప్పుడు మాట్లాడుతున్న మాటలు మీ కుటుంబ చరిత్రను మరిచిపోయిన ట్టు ఉన్నాయి. మీ తాత కూడా వలసదారుడే. మీరు వలసలను విమర్శిస్తే, అదే మీకు వర్తిస్తుంది" అంటూ హసన్ కౌంటర్ ఇచ్చారు. హసన్ రిప్లై సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో నలిన్ హేలీకి సమాధానం ఇవ్వలేని స్థితి ఏర్పడింది.

**భారతీయుల కష్టపడి సాధించిన స్థానాలు...** ప్రస్తుతం అమెరికాలోని టాప్ కంపెనీలలో అనేక సంస్థలకు భారతీయులు సీఈవోలుగా ఉన్నారు. గూగుల్ (సుందర్ పిచాయ్), మైక్రోసాఫ్ట్ (సత్య నాదెళ్ల), అడోబ్ (శాంతను నారాయణ్) మొదలైన వారు. భారతీయులు ఐటి, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఫార్మా, బయోటెక్, రీసెర్చ్ వంటి రంగాల్లో కష్టపడి పనిచేసి అమెరికా ఆర్థికవ్యవస్థకు పెద్దదైన తోడ్పాటు అందిస్తున్నారు. తక్కువ వేతనాలతోనైనా అధిక నిబద్ధతతో పనిచేయడం వల్ల అమెరికన్ కంపెనీలు భారతీయులపై విశ్వాసం పెంచుకున్నాయి.

**వలసల ప్రభావం రెండు కోణాలు...** అమెరికాలో వలసలపై రెండు విభిన్న అభిప్రాయాలు ఉన్నాయి. వలసల వల్ల స్థానికులకు ఉద్యోగాలు తగ్గుతున్నాయి. వలసలు అమెరికా ఆర్థిక వ్యవస్థను బలపరిచాయిబి టెక్ రంగంలో నైపుణ్యం కలిగిన ప్రజలు కొత్త ఆవిష్కరణలకు మార్గం సుగమం చేశారు.

**ట్రంప్ తర్వాత పెరిగిన వలస వ్యతిరేకత...** డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా వచ్చిన తర్వాత అమెరికాలో "అమెరికా ఫస్ట్ " అనే నినాదం బలంగా వినిపించింది. వీసా నిబంధనలను కఠినతరం చేయడం, వలసదారులపై ఒత్తిడి పెంచడం వంటి చర్యలు తీసుకున్నారు. ఈ విధానాలే నిక్కీ హేలీ కుటుంబానికి దగ్గరగా ఉన్న రాజకీయ వర్గాల్లో ఇప్పటికీ కొనసాగుతున్నాయి. నలిన్ హేలీ చేసిన ట్వీట్ ఒక విషయం స్పష్టంగా చూపించింది. అమెరికాలో వలసల అంశం ఎంత సున్నితమైనదో. అయితే మెహదీ హసన్ ఇచ్చిన రిప్లై మరో ముఖ్యమైన సందేశాన్ని ఇచ్చింది. "ఈరోజు అమెరికా ప్రపంచ శక్తిగా నిలిచినందుకు కారణం వలస దారుల కృషే." నిక్కీ హేలీ కుటుంబ చరిత్ర కూడా ఆ సత్యాన్ని తేలికగా నిరాకరించలేదనే విషయం ఈ ఘటన మరోసారి నిరూపించింది. "మీ తాత కూడా ఇండియా నుంచే వచ్చాడు" అన్న వాక్యం.. వలసల విలువను గుర్తు చేసే బలమైన సందేశం.

# చరిత్ర మరిచిన చరితార్థుడైన జర్నలిస్టు గణేశ శంకర్ - అక్టోబర్ 26... గణేశ శంకర్ విద్యార్థి జయంతి



భారత స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో ఎన్నో త్యాగాలు చేశారు. అందులో కొందరు గుర్తింపు లేకుండా పోయారు. ఆలాంటి వారిని సందర్భం వచ్చినప్పుడల్లా గుర్తు చేసుకోవాల్సిన అవసరం అనివార్యంగా ఉంది. భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను ఉరితీసిన రెండు రోజుల తరువాత, మరొక అమర వీరుడు భారత దేశం కోసం తన ప్రాణాలను అర్పించాడు. 40ఏళ్ల వయసులో ఒక లక్ష్యం కోసం ప్రాణాలను పోగొట్టుకున్న అసలు సిసలైన దేశ భక్తుడు. అయితే దురదృష్ట వశాత్తూ చాలామంది ఆయనను, ఆయన త్యాగాన్ని మరచి పోయారు. ఆయన భగత్ సింగ్ లాంటి విప్లవ వీరులతో కలిసి పోరాడిన స్వాతంత్ర్య పోరాట యోధుడు, పాత్రికేయుడు, భారత జాతీయ కాంగ్రెస్ నాయకుడు, జాతీయోద్యమ కారుడు. అను వాదకుడు, ముఖ్యంగా హిందీ వార్తాపత్రిక "ప్రతాప్" వ్యవస్థాపక సంపాదకుడిగా సుపరిచితుడు. ఒక వార్తా పత్రిక వేదికగా,18 సంవత్సరాల పాటు బ్రిటిష్ వలస పాలనపై రాజీ లేని పోరు సల్పి పోరాడిన దమ్మున్న ఎడిటర్. విద్యార్థి ఆయనే గణేశ్ శంకర్ విద్యార్థి. అరుదైన వ్యక్తిత్వం కలిగిన గణేష్ శంకర్ తనకు తానే తన పేరు చివర "విద్యార్థి" (జ్ఞానాన్ని కోరేవాడు) అనే పదాన్ని చేర్చుకున్నాడు. గణేశ్ శంకర్ విద్యార్థి (26 అక్టోబర్ 1890 %-% 25 మార్చి 1931) ఫతేపూర్ జిల్లా హాథ్‌గావ్ అనే గ్రామంలో ఒక క్షత్రియ కుటుంబంలో జన్మించాడు. మంగోలి అనే గ్రామంలో ఒక మాధ్యమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసే తండ్రి జయ నారాయణ్ శిక్షణలో ప్రాథమిక విద్యను అభ్యసించి తర్వాత మంగోలి, విదిశలలో హైస్కూలు విద్య చదివాడు. పేదరికం కారణంగా చదువు కొనసాగించ లేక గుమాస్తాగా, అధ్యాపకునిగా కాన్పూరులో పనిచేశాడు. ప్రజా జీవితం పట్ల, జర్నలిజం పట్ల ఆసక్తి కలిగివుండి జాతీయోద్యమం పట్ల ఆకర్షితుడయ్యాడు. విప్లవ భావాలను ప్రచారం చేస్తున్న కర్మయోగి, స్వరాజ్య అనే హిందీ ఉర్దూ పత్రికలకు ఆయన పంపిణీ దారుగా పనిచేస్తూ క్రమేపీ ఆ పత్రికలలో రచనలు చేయడం ప్రారంభించాడు. ఆ క్రమంలో "విద్యార్థి" అనే కలం పేరును పెట్టుకున్నాడు. ఆయన ప్రతిభ చూసి పండిట్ మహావీర్ ప్రసాద్ ద్వివేది 1911లో తన హిందీ సాహిత్య మాసపత్రిక "సరస్వతి"లో ఉప సంపాదకునిగా ఉద్యోగం ఇచ్చాడు. అయితే సాహిత్యం కంటే వర్తమాన విషయాలు, రాజకీయాలలో ఉన్న ఆసక్తితో హిందీ రాజకీయ వారపత్రిక "అభ్యుదయ"లో ఉప సంపాదకునిగా ఆయన చేరాడు. 1913లో కాన్పూరుకు తిరిగి వచ్చి పాత్రికేయుడిగా, స్వాతంత్ర్య సమర యోధుడిగా తన జీవితాన్ని మలుచు కున్నాడు. "ప్రతాప్" అనే విప్లవాత్మక వారపత్రికను స్థాపించి తను మరణించే వరకు 18 సంవత్సరాలపాటు నడిపాడు. ఆ పత్రిక అనతి కాలంలోనే అన్నిరకాల అణచివేతలు వ్యతిరేకంగా పోరాడే పత్రికగా గుర్తింపు పొందింది. ఆ పత్రిక ద్వారా గణేష్ శంకర్ రాయబరేలీ రైతుల పక్షాన, కాన్పూరు మిల్లు కార్మికుల పక్షాన నిలిచి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాడు. ఫలితంగా పలుమార్లు న్యాయస్థానాలలో అభియోగాలను ఎదుర్కొని భారీ జరిమానాలను చెల్లించాడు. ఐదు సార్లు జైలుకు వెళ్ళి వచ్చాడు. 1916లో లక్నోలో మహాత్మా గాంధీని ఆయన తొలిసారి కలిసి జాతీయోద్యమంలో చేరాడు. 1917-18లలో హోమ్ రూల్ ఉద్యమానికి నాయకత్వం వహించాడు. కాన్పూర్ జౌళీ కార్మికుల మొదటి సమ్మెను ముందుకు నడిపించాడు. 1920లో ప్రతాప్ దినపత్రిక ఎడిషన్‌ను ఆరభించాడు. అదే ఏడాది రాయ్‌బరేలీ రైతాంగ పోరాటంలో అరెస్ట్ అయ్యి రెండేళ్ళు కఠిన కారాగారశిక్ష అనుభవించాడు. 1922లో విడుదలైన వెంటనే ఫతేగఢ్‌లో ఒక సభలో రాజ్య ద్రోహాన్ని ప్రేరేపించే విధంగా ప్రసంగించాడనే కారణంతో తిరిగి వెంటనే అరెస్టు చేశారు. ఫతేగఢ్‌లో జరిగిన ప్రావిన్షియల్ పొలిటికల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడిగా శంకర్‌కు దేశద్రోహ ప్రసంగానికి జైలు శిక్ష విధించ బడింది. 1924లో భగత్‌సింగ్ కు సన్నిహితుడై ఆయన భగత్‌సింగ్‌తో కలిసి పోరాడాడు. తరువాత చంద్రశేఖర్ అజాద్‌కు కూడా సన్నిహితుడయ్యాడు. 1925లో స్వరాజ్ పార్టీ తరఫున ప్రావెన్షియల్ శాసన సభలకు జరిగిన ఎన్నికలలో కాన్పూర్ నుండి శాసన సభ్యుడిగా ఎన్నికై 1929 వరకు కొనసాగాడు. 1929లో కాంగ్రెస్ పార్టీలో చేరాక తన సభ్యత్వానికి రాజీనామా చేశాడు. 1928లో మజ్దూర్ సభను స్థాపించి మరణించే వరకూ నాయకత్వం వహించాడు.1929లో యునైటెడ్ ప్రావిన్స్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియమించ బడ్డాడు. ఆ ప్రాంతంలో సత్యాగ్రహ ఉద్యమానికి నాయకత్వం వహించాడు. 1930లో గోరఖ్ పూర్, న్యూ ఢిల్లీలలో జరిగిన హిందీ సాహిత్య సమ్మేళనాలకు హాజరయ్యాడు. అదే సంవత్సరం తిరిగి అరెస్టయి జైలుకు వెళ్ళాడు. గాంధీ - ఇర్విన్ సంధి ప్రకారం 1931 మార్చి 9న విడుదలయ్యాడు. కరాచీలో జరిగే కాంగ్రెస్ సమావేశాలకు హాజరు కావాలని తయార వుతుండగా అదే సమయంలో కాన్పూరులో మత ఘర్షణలు చెలరేగాయి. గణేశ్ శంకర్ విద్యార్థి అల్లరి మూకల మధ్య నిలబడి వారిని వారించి వేలాది మంది అమాయకుల ప్రాణాలను కాపాడాడు. వారిలో హిందువులు, ముస్లిములు కూడా ఉన్నారు. ఈ ప్రయత్నంలో ఆయనను ఒక అల్లరి మూక దారుణంగా పొడిచి చంపింది. అలా మత పరమైన ఘర్షణలు అడ్డుకునే క్రమంలో అమరుడు అయినాడు. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# గృహ హింస నిరోధక చట్టం పై అవగాహన అవసరం - అక్టోబర్ 26.. గృహహింస నిరోధక చట్టం అమలు దినం...




భారత దేశంలో స్త్రీల పైన హింస రోజురోజుకీ పెరుగుతూనే ఉంది. ప్రభుత్వం ఎన్ని చట్టాలు చేసినా.. న్యాయ వ్యవస్థ బాధితులకు అండగా నిలబడుతున్నా.. హింసకు గురయ్యే వారి సంఖ్య మాత్రం ఏమాత్రం తగ్గుముఖం పట్టడం లేదు. గృహహింస చట్టం చాలా వరకు బాధితులకు న్యాయం చేకూరుస్తుంది. ఇది ఒక సివిల్ చట్టం. నేరం చేసిన వాళ్ళను దండించడం కాకుండా బాధితులకు ఉపశమనం కల్పించే చట్టం. వేధింపులకు గురవుతున్న మహిళలకు రక్షణ కవచంగా ప్రభుత్వం మహిళలకు (43/2005 చట్టం) రక్షణ చట్టానికి 2005లో పార్లమెంట్ ఆమోదం తెలిపింది. గృహ హింస నుండి మహిళల రక్షణ చట్టం, 26 అక్టోబర్ 2006 నుండి అమల్లోకి వచ్చింది భార్యను వేధించే భర్తపైనే గృహహింస కేసు పెట్టడం కాదు, భర్తను వేధించే భార్యపై కూడా కేసు పెట్టవచ్చని సుప్రీంకోర్టు ఇటీవల తీర్పు ఇచ్చింది. ఒక వ్యక్తి శారీరక, మానసిక ఆరోగ్యానికి హాని కలిగించే లేదా గాయపరిచే ప్రమాదానికి గురి చేసే ఎలాంటి చర్య అయినా గృహ హింస కిందకే వస్తుంది. అవతలి వ్యక్తి శారీరక, మానసిక, ఆర్థిక, లైంగిక దాడుల్లో దేనికి గురి చేసినా అది గృహ హింస కిందకే వస్తుంది. ఇలాంటి హింసకు గురవుతున్న వారు ముఖ్యంగా మహిళలకు చట్టం చాలా రక్షణ కల్పిస్తుంది. పురుషులకు కూడా ఈ చట్టం వర్తిస్తుందని చాలా మందికి తెలియనే తెలియదు. గృహ హింస కి గురైన మహిళ స్థానిక మహిళా కోర్టు, మహిళా పోలీస్ స్టేషన్ లేదా ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వద్ద తనపై జరిగిన హింస గురించి వివరిస్తూ కేసు ఫైల్ చేయవచ్చు. నిందితులపై కేవలం క్రిమినల్ కేసులు మాత్రమే కాదు.. సివిల్ కేసు పెట్టే అవకాశం కూడా ఉంటుంది. గృహ హింస బాధితులు కేసు ఫైల్ చేయగానే ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎంక్వైరీ ప్రారంభిస్తారు. ఫిర్యాదు చేసిన వ్యక్తి దగ్గర సమాచారం సేకరించి.. ఆ తర్వాత జరిగిన సంఘటనల గురించి సాక్షులను ప్రశ్నించి రిపోర్ట్ తయారు చేస్తారు. ఈ రిపోర్ట్ నే ఇన్సిడెంట్ రిపోర్ట్ అంటారు. గృహ హింస బారిన పడిన మహిళలకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం 2005లో గృహ హింస నిరోధక చట్టం తీసుకొచ్చింది. అంతేకాదు.. సెక్షన్ 498ఎ, 406,323,354 ల ప్రకారం గృహ హింస కేసులో నిందితులకు శిక్ష పడుతుంది. ఈ నిందితుల్లో ఆడవారు ఉంటే వారిపై కూడా ఈ చట్టం ద్వారా శిక్ష అమలు చేసే వీలుంటుంది. కేవలం వివాహం అయిన మహిళలకే కాకుండా లివ్ ఇన్ రిలేషన్ షిప్ లో ఉండేవారికి కూడా గృహ హింస చట్టం రక్షణ కల్పిస్తోంది. పెళ్లయిన లేదా లివ్ ఇన్ రిలేషన్ షిప్ లో ఉన్న స్త్రీని ఇల్లు వదిలి వెళ్లిపోవాలని హింసించడం కూడా గృహ హింస కిందకే వస్తుంది. ఈ చట్టం కింద ఎల్ జీబీటీ లకు కూడా రక్షణ ఉంటుంది. గృహ హింస జరిగిందని నిర్ధారించేందుకు దాన్ని ప్రత్యక్షంగా చూసిన వ్యక్తి వాంగ్మూలం, డాక్యుమెంటరీ ప్రూఫ్, ఆడియో, వీడియో ప్రూఫ్ వంటివి సాక్ష్యాలుగా పనికొస్తాయి. గృహ హింస చట్టం అనేది కేవలం వరకట్నం కోసమే కాకుండా ఎలాంటి సందర్భాల్లో అయినా.. ఎందుకోసమైన ఒక వ్యక్తి తన కుటుంబంలోని మరో వ్యక్తి ముఖ్యంగా స్త్రీలను హింసిస్తే వారికి వర్తించే చట్టం. మానసికంగా, శారీరకంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎలా హింసించినా అది గృహ హింస కిందకే వస్తుంది. ఒక స్త్రీ వరకట్నం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ అది తీసుకురానప్పుడు హింసిస్తే దానికి 498ఎ కింద కేసు నమోదు చేస్తారు. న్యాయస్థానాన్ని ఆశ్రయించడానికంటే ముందు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో గృహహింస చట్టం కింద దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. అక్కడ ధరఖాస్తు చేసుకున్న కేసులు న్యాయస్థానం వరకు వెళ్లకుండా కౌన్సెలింగ్‌లోనే పరిష్కారం అయ్యే అవకాశం ఉంది. మహిళలకు కొన్ని ప్రత్యేక హక్కులు ఉన్నాయి. 18 ఏళ్లు నిండని బాలికను ప్రేమ పేరుతో తీసుకుని వెళ్లి వివాహం చేసుకుంటే.. సెక్షన్ 366 ప్రకారం యువకునికి 10 ఏళ్ల జైలు శిక్ష విధించవచ్చు. ఏ స్త్రీ అయినా భర్త బతికి ఉండగా మరో వ్యక్తిని వివాహం చేసుకోవడానికి వీల్లేదు. అలా వివాహం చేసుకుంటే నేరం. ముస్లిం మహిళల విషయంలో ఈ నిబంధన చెల్లదు. వివాహమైన ఏ మతానికి చెందిన మహిళ అయినా భర్తతో కాక మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకోరాదు. మగవారిపై కూడా గృహ హింస జరగొచ్చు. ఆలాంటప్పుడు వారు వెంటనే ఈ విషయాన్ని స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి ఎఫ్ ఐ ఆర్ కాపీ తీసుకోవాల్సి ఉంటుంది. దీనికోసం మెడికల్ డాక్యుమెంట్స్ వంటి ఆధారాలు కూడా సమర్పించాల్సి ఉంటుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# తెలంగాణ వాతా వరణం... మాదిరెడ్డి సులోచన రచానా నేపథ్యం - అక్టోబర్ 26... మాదిరెడ్డి సులోచన జయంతి

తెలుగునాట నవలల్ని విశేషంగా చదివింపచేసే ఆలవాటు చేసిన రచయితల్లో మాదిరెడ్డి సులోచన ఒకరు. ఆనాడు కాల్పనిక ప్రభావంతో రచనలు చేసిన వారిలో ఆమె ఒకరు. ఊహజనిత చిత్రణ కంటే వాస్తవిక జీవిత చిత్రణకు ప్రయత్నించారు. ప్రేమలు, పెళ్ళిళ్ళు కంటే కుటుంబ జీవితానికి ప్రాధాన్యం ఇచ్చింది. ఉత్తమ ఉపాధ్యాయిని, ఉత్తమ కథా రచయిత్రి అవార్డులు పొందారు. తెలంగాణ రచయిత్రుల సాహిత్య ప్రస్థానంలో మాదిరెడ్డి సులోచన ఒక మైలురాయి. ఆచార్య పాకాల యశోదారెడ్డి తరువాత తెలంగాణ పలుకుబడి, తెలంగాణ స్థానీయతను రచనల్లో చూపించిన రచయిత్రి మాదిరెడ్డి. మారుతున్న కాలంలో మారని విలువలను తెలియ జెప్పడంతో పాటు స్త్రీలను చైతన్య వంతులను చేసే ధ్యేయంతో నవలా యజ్ఞం సాగించిన రచయిత్రి మాదిరెడ్డి సులోచన. సమాజం విధించే కుహనా కట్టుబాట్లు, ఆచారాలను ఆత్మస్థైర్యంతో ఎదుర్కొని, జీవితాలను తీర్చిదిద్దుకున్న పాత్రలు మాదిరెడ్డి నవలల్లో కనిపిస్తాయి. అలాగే, మార్పులకు లోనవుతున్న ఆర్థిక విధానాలతో ప్రభావితమైన సామాజిక విలువలు, ఆ క్రమంలో విపరీత మైన సంఘర్షణలకు లోనైన స్త్రీల జీవితాలకు కూడా సులోచన నవలలు అద్దం పడతాయి. సమాజంలో ఎన్ని మార్పులు వచ్చినా, ఎన్ని తరాలు మారినా, మారని మానవ నైజాలు, ప్రవృతులూ, ప్రేమ , ద్వేషం, స్వార్థం లాంటివి మాదిరెడ్డి సులోచన నవలలో స్పష్టంగా కనిపిస్తాయి. అర్ధ శతాబ్ది క్రితం, తెలంగాణ వాతవరణం, మానవ సంబంధాలూ కలిపి చక్కనైన కుటుంబ కథా నవలలను వ్రాశారు. ఆమె నవలలలో ఎక్కువగా మధ్య తరగతి కుటుంబాలలలో ఎదురయ్యే సమస్యలు కనిపిస్తూ వుంటాయి. మన చుట్టూ వుండే వాతావరణం ప్రతిబింబిస్తూ వుంటుంది. ఆ నవల చదువుతూ వుంటే ఇది ఎక్కడో మనమధ్యే జరిగిందే అన్నట్లు అనుభూతిని కలిగిస్తుంది. మాదిరెడ్డి సులోచన (26.10.1935 - 16.2.1983) మహబూబ్ నగర్ జిల్లా శంషాబాద్ లో 1935 అక్టోబర్ 26న ఒక భూస్వామ్య కుటుంబంలో మామిడి రామకృష్ణారెడ్డి, మాణిక్యమ్మ దంపతులకు జన్మించారు. ఆ రోజుల్లో దొరలు, దేశముఖ్ ల ఇళ్ళల్లోని ఆడపిల్లలు ఘోషా పాటించడం వల్ల సులోచన ప్రాథమిక విద్యను ఇంట్లోనే పూర్తి చేసుకున్నారు. కొంతకాలం ఆర్య సమాజ్ గురుకుల పాఠశాల, బేగం పేటలో చదువుకుని మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు. రాజ బహదూర్ వెంకట్రామిరెడ్డి కళాశాల, నారాయణ గూడలో బి.ఎస్సీ డిగ్రీ చదివారు. భువనగిరి, నల్గొండ జిల్లా వాస్తవ్యులైన మాదిరెడ్డి రామచంద్రారెడ్డితో 1952లో వివాహం జరిగింది. వివాహం తర్వాత భర్త ప్రోత్సాహంతో ఉన్నత విద్యను అభ్యసించారు. అలా ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి బి.యిడి ఎం.ఎ., ఎం.యి.డి పూర్తి చేశారు. తర్వాత మాదిరెడ్డి సులోచన ఉపాధ్యాయవృత్తిలో చేరి 1971 వరకు సుమారు పది సంవత్సరాలు కెమిస్ట్రీ ఉపాధ్యాయినిగా సెయింట్ జాన్స్ హైస్కూలులో పనిచేశారు. బోధనను తన వృత్తిగానే కాక ప్రవృత్తిగా కూడా మలచుకున్న ఉత్తమ పాటు ఇథియోపియా, జాంబియా దేశాలకు వెళ్ళి అక్కడ కూడా కొంతకాలం ఉపాధ్యాయినిగా పనిచేశారు. 1965 లో ' జీవనయాత్ర ' పేరుతో ప్రారంభమైన ఆమె నవలా ప్రస్థానం తరంగాలు , కలహంస, అంద గాడు, అపురూప , నాగ మల్లికలు, సంధ్య, శిక్ష, పూల మనసులు, మిస్టర్ సంపత్ ఎంఎ, లాహిరి, సజీవ స్మృతులు, స్నేహ ప్రియ, రాలిన రేకులు, నవతరం, ఎంత ఘాటు ప్రేమయో, పంతులమ్మ, వారసులు, కలకాదు సుమా, వంశాంకురం, అందని పిలుపు, నెలవంక, బిందు పథం, సుప్రియ, గడ్డితినే మనుషులు, మరో ప్రేమకథ, గాజు బొమ్మలు, ప్రేమ పంజరం, అపరంజి, సంసార నౌక, పుణ్య పురుషులు, ఋతుచక్రం, చిగురాకులలో చిలకమ్మ, మీరైతే ఏం చేస్తారు, ఆశయాల ఆఖరి మెట్టు, అధికారులు - ఆశ్రిత జనులు, సంధ్యారాగం, గెలుపు నాదే, అభినేత్రి, ఇల్లు కట్టి చూడుపెళ్ళి చేసి చూడు, శ్రీనిలయం, సృష్టిలో తియ్యనిది లాంటి 72 నవలలతో పాటూ దాదాపు 150 కథలు, 21 నాటికలు, 10 ఏకాంకికలు రాశారు. వీరి రచనలు ఆనాటి దిన, వార, మాస పత్రికల్లో ప్రచురిత మయ్యాయి. ఆమె రచించిన 10 నవలలు మేన కోడలు, ప్రేమలు - పెళ్ళిళ్ళు, ఈ కాలం పిల్లలు, ఈ తరం మనిషి , కళ్యాణి, కలవారి సంసారం, చందమామ, తరం మారింది మొదలైనవి సినిమాలుగా నిర్మించ బడ్డాయి. 1977 లో తరం మారింది సినిమాకు నందిఅవార్డు లభించింది. ఆమె రచనలపై



అనేక పరిశోధనలు జరిగాయి. 1965 నుండి రచనలు ప్రారంభించిన మాదిరెడ్డి సులోచన 1983 ఫిబ్రవరి 16న అకాల మరణం చెందే వరకు రచనను కొనసాగించారు. గృహలక్ష్మి నవలకు 1978లో స్వర్ణ కంకణము లభించింది. ఉత్తమ ఉపాధ్యాయిని, ఉత్తమ కథా రచయిత్రి అవార్డులు పొందారు. దాదాపు రెండు దశాబ్దాలపాటు విభిన్న సామాజిక సమస్యలను ఇతివృత్తంగా చేసుకొని నవలలు వ్రాసి ఆంధ్ర పాఠకుల హృదయాలలో చిర స్మరణీయంగా నిలచి పోయిన మాదిరెడ్డి సులోచన 1984లో ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలిన దుర్ఘటనలో మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# కొలిచేకొద్దీ.. మిగులుతోంది భూమి!

ఖమ్మం: ఖమ్మం నగరంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు(ఎన్నెస్పీ) భూములు ఆక్రమణకు గురయ్యాయి. కొన్నిచోట్ల ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటుచేశారు. వివిధ పార్టీల కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలకు నామమాత్రపు రుసుముతో అధికారులు విక్రయించారు. ఏఏ సంస్థకు ఎంత కేటాయించారు, మిగులు భూమి ఎంతన్నది దస్త్రాలకే పరిమితమైంది. కొన్నేళ్లుగా ప్రభుత్వరంగ సంస్థలు, పరిశ్రమల స్థాపనకు స్థలం దొరకని పరిస్థితి నెలకొంది. పునఃపరిశీలన చేయకపోవటంతో రూ.కోట్ల విలువైన స్థలాలు అన్యాక్రాంతమ వుతున్నాయి. రీసర్వే జరిపి మిగులు భూములను వెలికితీసి పరిరక్షించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించటంతో రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు. ఇప్పటివరకు సుమారు రూ.50కోట్ల విలువైన జాగాలు కబ్జాకు గురవకుండా ముళ్లకంచె ఏర్పాటుచేశారు.

**కబ్జాల నిగ్గు తేల్చేందుకే..**

ఖమ్మం కొత్త బస్టాండ్ సమీపంలో గతంలో ఎన్నెస్పీ క్యాంపు, 700కుపైగా క్వార్టర్లను 93.24 ఎకరాల్లో ఏర్పాటుచేశారు. మేజర్-2, పిల్లకాల్వల కింద సుమారు 54 ఎకరాల భూములు ఉన్నాయి. శిథిలావస్థకు చేరిన క్వార్టర్లను కొన్నేళ్ల క్రితమే తొలగించి ఆ భూములను రెవెన్యూ అధికారులకు అప్పగించారు. నగరం విస్తరించటంతో కాలనీలు ఏర్పడ్డాయి. కొందరు ఎన్నెస్పీ స్థలాలను ఆక్రమించగా జీఓ-58, 59 ప్రకారం అధికారులు క్రమబద్ధీకరించారు. కబ్జాల నిగ్గుతేల్చటానికి రీసర్వే ముమ్మరంగా సాగుతుండటంతో మిగులు భూమి లెక్క తేలుతోంది.

ఎన్నెస్పీ భూదస్త్రాల ఆధారంగా పక్కాగా సర్వేచేస్తేనే ఆక్రమణలకు చెక్ పడుతుందని నగరవాసులు భావిస్తున్నారు.



రీకన్వే భూములు ఎవరి ఆధీనంలో ఉన్నాయి? రికార్డు ప్రకారమే వాడుకుంటున్నారా? అదనంగా ఆక్రమించారా? అనే లెక్కలను అధికారులు సేకరిస్తారు.

రీసర్వేలో తేలిన మిగులు భూముల చుట్టూ కంచె వేసిన ప్రాంతాలు..

గుర్తించిన భూమి (ఎకరాల్లో)

కొత్తబస్టాండు వెనక.. 3.20

కోర్టుకు ఇచ్చిన భూమి.. 3.08

ఎన్ఎస్టీ రోడ్డు సమీపంలో 0.20

సీపీఎం కార్యాలయం సమీపంలో.. 0.10

పాకబండ.. 2.0

**రీకన్వే జాగాలపై దృష్టి**

ఎన్నెస్పీ క్యాంపు కోసం కొందరు రైతులు భూములిచ్చారు. కొన్నిచోట్ల స్థలాలు ఖాళీగా ఉండటంతో తిరిగి రైతులకు అప్పగించారు. 'రీకన్వే' క్రయవిక్రయాలతో ఎన్నో స్థలాలు చేతులు మారాయి. వాటిలో నివాసగృహాలు, వాణిజ్య సంస్థలు వెలిశాయి. రీకన్వే ప్లాట్ల యజమానులు కొందరు మిగులు భూములనూ ఆక్రమించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అప్పటి దస్త్రాల ఆధారంగా నీటిపారుదల, రెవెన్యూశాఖ అధికారులు సంయుక్త సర్వేకు సిద్ధమయ్యారు. ఎన్నెస్పీ భూములు ఆక్రమణకు గురవుతుండటంతో వెలికితీయాలని రీసర్వే చేయిస్తున్నాం. కాల్వలు కబ్జాకు గురవకుండా హద్దురాళ్లు పాతుతాం. మిగులు భూముల పరిరక్షణకు డిజిటల్ మ్యాపులు రూపొందిస్తున్నాం.

అనుదీప్ దురిశెట్టి, కలెక్టర్, ఖమ్మం

# విద్యలో భాగం.. విరులతో లాభం

అశ్వారావుపేట : అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో బీఎస్సీ అగ్రికల్చర్ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ప్రయోగాత్మక శిక్షణ(ఏఈఎల్పీ)లో భాగంగా ఒక బృందంలోని ఎనిమిది మంది సభ్యులు బంతిపూలు సాగు చేసి లాభాలు సాధిస్తున్నారు. చివరి(నాలుగో) సంవత్సరం విద్యార్థులకు వ్యవసాయ ఆధారిత పంటలపై క్షేత్రస్థాయిలో ప్రయోగాత్మక శిక్షణ ఇస్తారు. పంటలను ఎప్పుడు సాగు చేయాలి, అధిక దిగుబడులు సాధించేందుకు చేపట్టే యాజమాన్య పద్ధతులు, తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు ఏమిటి? అనే విషయాలతోపాటు పండించిన పంటలను మార్కెట్ ఎలా చేయాలో స్వయంగా విద్యార్థులే చేస్తారు. దసరా, దీపావళి, కార్తిక మాసాలను లక్ష్యంగా చేసుకుని ఎకరం విస్తీర్ణంలో బంతి సాగు చేశారు.

**తక్కువ పెట్టుబడి.. అధిక రాబడి**

విద్యార్థులు ప్రయోగాత్మకంగా సాగు చేసిన బంతి తోటలో తక్కువ పెట్టుబడులు పెట్టి అధిక దిగుబడులు సాధిస్తున్నారు. దుక్కులు, మల్చింగ్, డ్రిప్, విత్తనాలకు సుమారు రూ.30 వేలు ఖర్చు చేశారు. కళాశాలలో సహ విద్యార్థులు తయారు చేసిన వానపాముల సేంద్రియ ఎరువు వినియోగించారు. సుమారు ఆరు నుంచి ఎనిమిది టన్నుల పూల దిగుబడి వస్తోందని విద్యార్థులు తెలిపారు. ఇప్పటి వరకు రెండు టన్నులు విక్రయించామని, వచ్చిన నగదు కళాశాలకే వెచ్చిస్తున్నట్లు చెబుతున్నారు.

**భవిష్యత్తుపై భరోసా: నవ్య, ఏజీబీఎస్సీ విద్యార్థిని**

క్షేత్రస్థాయిలో పంటలు సాగు చేసి దిగుబడులు సాధించడం మాలో ఆత్మ విశ్వాసాన్ని పెంచింది. భవిష్యత్తులో ఉద్యోగం రాకున్నా పొలంలో బంతిసాగు చేసి అధిక దిగుబడులు ఎలా సాధించాలో ఏఈఎల్పీ శిక్షణలో నేర్చుకున్నాం. మా బృందం సభ్యులు సాగు చేసిన బంతి తోటలో ప్రస్తుతం రోజుకు రెండు క్వింటాళ్ల పూలు కోస్తున్నాం. బయట మార్కెట్లో కిలో రూ.వందకు అమ్ముతుండగా.. మేము రూ.50 నుంచి రూ.70లకు విక్రయిస్తున్నాము.

**మార్కెటింగ్‌లో మెలకువలు నేర్చుకున్నాం: మంజుల, విద్యార్థిని**

బీఎస్సీ అగ్రికల్చర్ విద్యలో భాగంగా తొలి మూడేళ్లు తరగతి గదుల్లోనే గురువులు చెప్పిన పాఠాలు విని నేర్చుకునే వాళ్లం. నాలుగో సంవత్సరం క్షేత్రస్థాయిలో పంటల సాగు, వాటిలో ఎదురయ్యే సమస్యలు, అధిక దిగుబడులు సాధించడం ఎలా, పండించిన పంటల మార్కెట్ ఎలా చేయాలో స్వయంగా నేర్చుకున్నాం. మేము సాగు చేసిన బంతి తోట నుంచి వచ్చిన పూలను మార్కెట్ కూడా మేమే చేస్తున్నాం. ఎంత పెట్టుబడి పెట్టాం. దిగుబడి ఎంత వచ్చింది. లాభాలు ఎలా వచ్చాయో తెలిసింది.

# చేయి తడిపితేనే పనులు



ధర్మపురి : విద్య, వ్యవసాయం తదితర రంగాల్లో ఉమ్మడి జిల్లా ముందంజలో నిలుస్తుండగా.. అదే సమయంలో అనిశా కేసులతోనూ వార్తల్లో నిలుస్తోంది. ఇటీవల జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలో పలు శాఖల సిబ్బంది, అధికారులపై అనిశా దాడులు చేసింది. పలు శాఖల్లో లంచాలు తీసుకుంటూ పట్టుబడ్డారు. బయట పడినవి చాలా తక్కువ అని అనిశా దృష్టికి రాకుండా అక్రమాలకు పాల్పడేవారు ఎక్కువ ఉంటారని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

ఈ ఏడాది ఏసీబీ కేసుల వివరాలు(ఉమ్మడి జిల్లాలో)

కేసులు: 22 ట్రాప్, 1 ఆర్‌సీవో

అరెస్టు: 31 మంది రెగ్యులర్ ఎంక్వైయిరీ: 07

పలు శాఖలపై నిఘా కరవు

సాధారణ రైతు నుంచి మహిళల రుణాల వరకు ఫైలు కదలాలంటే ఎంతోకొంత చెల్లించాల్సిందేననే పరిస్థితి కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పన్నులశాఖ, రెవెన్యూ, రవాణా శాఖల సేవలపై నిఘా కరవైంది. చిన్న చిన్న ధ్రువీకరణ పత్రాలకు రూ.వేలాది లంచాలు తీసుకొని పేదలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

**భూ సర్వే కోసం రూ.30 వేలు**

రాజన్న సిరిసిల్ల పురపాలికకు చెందిన ప్రవీణ్‌కు చిన్న బోనాలలో 3 ఎకరాల భూమి ఉండగా, ఈ భూమి సర్వే కోసం సర్వేయర్‌కు ప్రవీణ్ రూ.10 వేలు అందజేశారు. సర్వేకు సంబంధించిన ధ్రువపత్రం కోసం రూ.20 వేలు అడుగగా, బాధితుడు ఆ సొమ్మును ఈనెల 14న సర్వేయర్ ప్రైవేట్ అసిస్టెంట్‌కి ఇస్తుండగా అనిశా అధికారులు పట్టుకున్నారు.

**పంచాయతీ కార్యదర్శి..**

గంగాధరలోని మధురానగర్‌కి చెందిన పంచాయతీ కార్యదర్శి ఈ నెల 10న రూ.10 వేలు లంచం తీసుకుంటుండగా అనిశా అధికారులు పట్టుకొన్నారు. మధురానగర్‌కి చెందిన గంగాధర రజిత ఇందిరమ్మ రెండో విడత బిల్లు మంజూరుకు రూ.10 వేలు డిమాండ్ చేశాడు. రజిత భర్త శ్రీకాంత్ కార్యదర్శికి రూ.10 వేలు ఇస్తుండగా.. అధికారులు వలపన్ని పట్టుకున్నారు.

**ఆర్టీవో అసలు స్వరూపం**

జగిత్యాల జిల్లా రవాణా అధికారి సరైన పత్రాలు లేని కోరుట్లకు చెందిన జేసీబీని ఇటీవల పట్టుకున్నారు. కేసు నమోదు చేయకుండా ఉండాలంటే రూ.40 వేలు ఇవ్వాలని వాహన యజమాని శశిధర్‌ను డిమాండ్ చేశారు. చివరికి రూ.35 వేలకు ఒప్పందం కుదరగా, అదే రోజు రూ.13 వేలు చెల్లించిన శశిధర్ మిగతా సొమ్మును తర్వాత ఇస్తానన్నాడు. మిగతా సొమ్ము తీసుకుని తాటిపెల్లి ఆర్టీవో కార్యాలయానికి వెళ్లగా.. ఏసీబీ రంగంలోకి దిగి ఆర్టీవోపై కేసు నమోదు చేసింది.

# నైపుణ్యంతో పాటే కొలువు



మెట్‌పల్లి : విద్యార్హతల ఆధారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అందిస్తున్న శిక్షణ తరగతులు యువతకు వరంగా మారాయి. దీన్‌దయాళ్ గ్రామీణ కౌశల్ యోజన పథకం(డీడీజీకేవై) ఆధ్వర్యంలో మూడు నెలల పాటు కంప్యూటర్ కోర్సులపై ఉచిత శిక్షణ అందిస్తున్నారు. మెట్‌పల్లిలో దాదాపు మూడు నెలల కిందట ప్రారంభమైన కోర్సుల్లో అకౌంటెన్సీ, జీఎస్టీ అసిస్టెంట్, ఎం.ఎస్.ఆఫీస్, సాఫ్ట్ స్కిల్స్‌లపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

ఒక్కో బ్యాచ్‌లో 35 మంది చొప్పున నాలుగు బ్యాచ్‌లలో మొత్తం 140 మంది నిరుద్యోగ యువతకు ఆగస్టు 1న మొదటి విడత శిక్షణ ప్రారంభమైంది. నవంబర్ 5న తరగతులు పూర్తి కానుండగా శిక్షణార్థులందరికీ ఉద్యోగావకాశాలు కల్పించనున్నారు. ఉచిత శిక్షణ కోసం మూడు నెలలకు ఒక్కో అభ్యర్థిపై రూ.40 వేల వరకు ప్రభుత్వాలు వెచ్చిస్తున్నాయి. ఉచిత శిక్షణతో డబ్బులు ఆదా కావడంతో పాటు ఉద్యోగావకాశాలు అందుబాటులోకి వచ్చాయని శిక్షణ పొందుతున్న యువత 'ఈనాడు-ఈటీవీతో' ఆనందం వ్యక్తం చేశారు.

**రెండో విడతకు ప్రచారం**

ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన వారిని శిక్షణకు ఎంపిక చేస్తున్నారు. మొదటి బ్యాచ్ పూర్తి కాగానే రెండో బ్యాచ్ ప్రారంభించడానికి పత్రికల్లో ప్రకటనలు ఇవ్వనున్నారు. దీంతో పాటు కరపత్రాల పంపిణీ, ప్రభుత్వ కార్యాలయాల నోటీసు బోర్డులపై ప్రదర్శించనున్నారు. ఆసక్తి గలవారు ఆధార్, ఫొటోలు, విద్యార్హత మార్కుల ప్రతి జిరాక్సులను శిక్షణ కేంద్రంలో అందించాల్సి ఉంటుంది.

**మాలాంటి వారికి ప్రయోజనం-ఓలపు రవళి, డిగ్రీ విద్యార్థిని, మందమర్రి, మంచిర్యాల జిల్లా**

ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాన్ని శిక్షణలో నేర్పిస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులుంటాయి. మధ్యాహ్నం గంట విశ్రాంతి ఉంటుంది. ఉచిత శిక్షణ మాలాంటి వారికి ఎంతో ఉపయోగపడుతుంది.

**వసతి, భోజనం ఉచితమే-ఎండీ.యాస్మిన్, శిక్షణ కేంద్రం నిర్వాహకుడు**

ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలకు చెందిన సుమారు 140 మంది యువతకు ఉచితంగా కంప్యూటర్ కోర్సులు నేర్పిస్తున్నాం. వసతి, భోజన ఏర్పాట్లు కూడా ఉచితంగానే అందిస్తున్నాం. శిక్షణ పూర్తయ్యాక తప్పకుండా ఉద్యోగావకాశాలు లభించేలా ఏర్పాట్లు చేశాం.

# అక్రమ వ్యవహారం.. గ్యాస్ వినియోగం



వేములవాడ : గృహావసరాలకు వినియోగించాల్సిన వంట గ్యాస్ సిలిండర్లు పక్కదారి పడుతున్నాయి. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటిలతోపాటు మండల కేంద్రాలు దినదినం అభివృద్ధి చెందుతున్నాయి. దీంతో హొటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు పెరిగిపోతున్నాయి. ఇలాంటి వాటిలో నిబంధనల ప్రకారం నిర్వాహకులు వాణిజ్య సిలిండర్లు వినియోగించాల్సి ఉంటుంది. కానీ చాలాప్రాంతాల్లో ఇంటి అవసరాలకు ఉపయోగించేవాటిని వినియోగిస్తున్నారు. పెద్దఎత్తున ఈ దందా సాగుతున్నా.. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలులేవు.

**రాయితీని కాజేస్తున్నారు**

జిల్లాలో దాదాపు 12 ఏజెన్సీలు వంట గ్యాస్ సిలిండర్లను సరఫరా చేస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం గృహావసరాలకు సంబంధించిన వివిధ రకాల కనెక్షన్లు 1,76,000 వరకు ఉన్నాయి. ఇందులో దాదాపు 50 వేలకు పైగా గృహావసరాలకు సంబంధించిన సిలిండర్లు ఈ ఏజెన్సీల ద్వారా జిల్లా వ్యాప్తంగా సరఫరా జరుగుతున్నాయి. వీటితోపాటు వాణిజ్య కనెక్షన్లు దాదాపు 2 వేలకు పైగా ఉంటాయి. ఇందులో 19 కిలోల వాణిజ్య సిలిండరు ధర రూ.1860 ఉండగా.. గృహావసరాల సిలిండర్(15.8 కిలోలు) దాదాపు రూ.900లకు లభిస్తుంది. దీంతో చాలామంది హొటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్ల యజమానులు వీటినే వినియోగిస్తూ ప్రభుత్వం అందించే గ్యాస్ రాయితీని కాజేస్తున్నారు. దీంతో ప్రజలకు చెందాల్సిన రాయితీ పక్కదారి పడుతోంది.

**అక్రమంగా గ్యాస్ నింపుతూ..**

సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లోని చాలా ప్రాంతాల్లో గ్యాస్‌స్టౌల మరమ్మతుల పేరుతో దుకాణాలు నిర్వహిస్తూ అక్రమ రీ-ఫిల్లింగ్ దందా కొనసాగిస్తున్నారు. పౌరసరఫరాల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించిన దాఖలాలు లేవు. గృహావసరాల సిలిండర్ల నుంచి అక్రమంగా చిన్నచిన్న గ్యాస్ వాటిల్లో నింపి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ దందా భారీ ఎత్తున సాగుతోంది. ఇప్పటికైనా అధికారులు అక్రమ గ్యాస్ వినియోగంపై దృష్టి సారించి సామాన్యులకు అందాల్సిన ప్రభుత్వ రాయితీని పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాల్సింది.

**చర్యలు తీసుకుంటాం- చంద్రప్రకాశ్, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి**


గృహావసరాల సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగించడం నేరం. జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటాం. అక్రమంగా వినియోగించినట్లు తెలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

# మరణ శాసనం రాస్తున్న మమకారం!

కొత్తగూడెం : వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నారని తన భార్యతో పాటు ఇద్దరు కుమార్తెల(3, 4ఏళ్ల పిల్లల)ను డాక్టర్ వృత్తిలో ఉన్న ఓ వ్యక్తి హతమార్చిన ఘటన గతేడాది ఖమ్మం జిల్లాలో చోటుచేసుకుంది. భార్యకు మత్తుమందు ఇచ్చి, పిల్లలను ఊపిరాడకుండా చేసి చంపాడు. అనంతరం కారు ప్రమాదంగా చిత్రీకరించాడు. తల్లికి కంటి సమస్య, పిల్లలకు శ్వాసకోశ ఇబ్బందులు ఆ కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేశాయి. పిల్లల ఆరోగ్య సమస్యలపై భర్తతో తరచూ గొడవలు కావటంతో తీవ్ర ఒత్తిడికి లోనైన తల్లి.. తన పిల్లలను వేటకొడవలితో నరికి చంపి అనంతరం తాను ఆత్మహత్య చేసుకుంది. ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన ఓ మహిళ ఈ దారుణ నిర్ణయం తీసుకుంది. కన్నపేగే పిల్లలకు మరణశాసనం రాస్తోంది. కాలం విసిరిన కఠిన పరీక్షల్లో అమ్మానాన్నలు ఓడిపోతున్నారు. తమ కలల ప్రపంచానికి, కన్నబిడ్డల బంగారు భవిష్యత్తుకు వారే ముగింపు పలుకుతున్నారు. అభంశుభం తెలియని పసిపిల్లలను కన్నవారే కడతేర్చుతున్న అమానవీయ ఘటనలు ఇటీవల కాలంలో తరచూ జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. భావిభారత పౌరులుగా ఎదగాల్సిన పిల్లలు అర్ధాంతరంగా తనువు చాలించటం సమాజ పతనానికి నాంది పలుకుతోంది.

**మేము లేని లోకంలో మీకు చోటు లేదు**

మానవ సంబంధాల్లో అత్యంత పవిత్రమైనది కన్నపేగు బంధం. ఆర్థిక సంక్షోభం, తీవ్రమైన మానసిక ఒత్తిడి, భవిష్యత్తుపై నమ్మకం కోల్పోవటం



వంటి కారణాల వల్ల తల్లి ప్రేమ సైతం అమావాస్య చీకటి అంచున నిల్చొంటోంది. పిల్లలను పెంచాల్సిన చేతులే ఉసురు తీయటానికి సిద్ధపడుతుండటం ఆలోచింపజేస్తోంది. ఈ కష్టాల ప్రపంచంలో తల్లిదండ్రులు లేకపోతే పిల్లలు అనాథలవుతారు లేదా తమలాగే ఇబ్బందులు ఎదుర్కొంటారనే భ్రమతో చిన్నారులను చంపి తర్వాత వారూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. దీన్ని అమ్మానాన్నలు త్యాగంలా భావించినా.. ఇది ఒక మానసిక రుగ్మతగా నిపుణులు పరిగణిస్తున్నారు.

**కారణాలేవైనా..**

తల్లిదండ్రులకు భవిష్యత్తు అంధకారంగా కనిపించినా.. కన్నబిడ్డలకు మంచి జీవితాన్ని ఇవ్వలేకపోతున్నామనే బాధతో దారుణమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు.

భార్య లేదా అత్తామామలపై ప్రతీకారం తీర్చుకోవాలనే క్రమంలో కొందరు పిల్లలను హింసించటం, చంపటం వంటి ఘటనలకు పాల్పడుతున్నారు. వివాహేతర సంబంధాలతో నూతన జీవితాన్ని ప్రారంభించాలనుకున్నప్పుడు దానికి అడ్డుగా పిల్లలు ఉన్నారని భావించి వారిని దూరం చేసుకుంటున్నారు.

తీవ్రమైన కుటుంబ కలహాలు, భార్యాభర్తల మధ్య ఘర్షణలు, వేధింపుల వాతావరణం పిల్లల పాలిట శాపంగా మారుతోంది.

ఆత్మహత్యలకు పాల్పడటమంటేనే భావోద్వేగాలను నియంత్రించుకోలేకపోవటం. దీని నుంచి బయటపడేందుకు తల్లిదండ్రులు కష్టాలను ఎదుర్కొనే పద్ధతులను నేర్చుకోవాలి. సమస్యలకు పరిష్కారం వెతకటంపై దృష్టి సారించాలి. ఆందోళన, ఒత్తిడి లక్షణాలు ఉంటే నిపుణుల సహాయం తీసుకోవాలి.

జువ్వాది వెంకటేశ్వరబాబు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు, కొత్తగూడెం

# వెదురిల్లు.. మమతల పొదరిల్లు

ఖమ్మం : ప్రకృతిసిద్ధ జీవనానికి, ప్రశాంతతకు చిరునామాగా నిలుస్తోంది ఆ ఇల్లు.. వివిధ రకాల పండ్లు, కూరగాయల, తీగజాతి మొక్కలతో ఆవరణ నిండుగా కనిపిస్తుంది. ఆ ఇంట్లోకి వెళ్లగానే వెదురుతో నిర్మించిన గోడలు చల్లదనంతో స్వాగతం పలుకుతాయి. ఏదులాపురం మున్సిపాలిటీ సాయిగణేశ్‌నగర్‌కు చెందిన దంపతులు షేక్ వీరయ్య, ఖాసీంబీ తమ ఇంటి మొదటి అంతస్తులో నివసిస్తుంటారు. రేకుల పైకప్పుతో ఇంటిని నిర్మించుకుని సోలార్ వ్యవస్థ అమర్చుకున్నారు. సీలింగ్‌తోపాటు ఇంటి గోడలుగా పూర్తిగా వెదురు తడకలను వినియోగించారు. చెక్కు చెదరకుండా ఉండేలా బీడింగ్ సాయంతో వాటిని బిగించారు. వంటగది, బెడ్‌రూం, హాలు.. అన్నీ పూర్తిగా వెదురుతో మెరుస్తుంటాయి. ఇవి పాడుకాకుండా ఏడాదికోసారి



టచ్‌ఉడ్ స్ప్రే చేస్తారు. అందుకే అది చెదలు పట్టదు. తేమ చేరదు. ఇంటి ముందు సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, పూలు, పండ్ల మొక్కలను పెంచుతున్నారు. ఇంటి అవసరాలకు వాటినే ఉపయోగిస్తున్నారు. ఏదో ఒక ప్రత్యేకత ఉండాలనే ఉద్దేశంతో అయిదేళ్ల క్రితం రూ.7లక్షలతో ఈ కుటీరం నిర్మించుకున్నామని, ఇన్నేళ్లయినా నిర్మాణం చెక్కు చెదరలేదని వీరయ్య దంపతులు తెలిపారు. ఇంటిలో వాతావరణం చల్లగా అనిపిస్తుందని వివరించారు.

# పేరుకే 'డీలక్స్'

హైదరాబాద్: గతంలో ఈసీఐఎల్ నుంచి కోఠి మార్గంలో 3, 3కే, 3కేఎన్ నంబరు డీలక్స్ బస్సులను తిప్పిన ఆర్టీసీ.. అన్ని బస్సులను చర్లపల్లికి మార్చేసింది. దీంతో ఈసీఐఎల్, బర్కత్‌పుర, కాచిగూడ, విద్యానగర్, కుషాయిగూడ, బండ్లగూడ నుంచి నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 16ఏ నంబరు మార్గంలో నడిచే డీలక్స్ బస్సును చర్లపల్లి వరకు పొడిగించిన ఆర్టీసీ.. ఈసీఐఎల్ మీదుగా కాకుండా మరో మార్గంలో మళ్లించడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది.

గ్రేటర్ పరిధిలో మొత్తం 275 డీలక్స్ బస్సులను ఆర్టీసీ నడుపుతోంది. అన్ని బస్‌స్టాప్‌లలో నిలపకుండా ప్రయాణికులను త్వరితగతిన గమ్యస్థానాలకు చేరుస్తాయనే ఉద్దేశంతో 9 వేల మంది నెలవారి బస్‌పాసులు తీసుకున్నారు. కొన్నాళ్లకే ఆయా మార్గాల్లో డీలక్స్ బస్సులను తగ్గించిన ఆర్టీసీ వాటిని ఇతర మార్గాలకు మళ్లించింది. దీంతో బస్‌పాస్ కొనుగోలు చేసిన ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. రూ.1830తో నెలవారీ పాస్ తీసుకొని లాభం ఏంటని ప్రశ్నించగా...ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణించొచ్చని అధికారులు వింతగా సమాధానమిస్తున్నారు.

గ్రేటర్‌లో ప్రతినెలా 10,000 మంది ఆర్డినరీ మంత్లీ పాస్‌లు తీసుకుంటున్నారు. ఎక్స్‌ప్రెస్ పాస్‌లు 80,000, మెట్రో డీలక్స్ బస్సు పాసులు 9 వేల మంది తీసుకుంటున్నారు. డీలక్స్ పాస్ ఉన్నవారు ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్‌లలోనూ ప్రయాణించే వెసులుబాటు ఉంది. అయితే



సులభతర ప్రయాణం, సౌకర్యవంతంగా ఉంటుందని డీలక్స్ పాస్ తీసుకుంటే సర్వీసులు తగ్గించడంతో వీటితో ప్రయోజనం ఏంటన్న ప్రశ్నలు ఎదురవుతున్నాయి.గతేడాది ఏప్రిల్‌లో మెట్రో డీలక్స్ బస్సులను రోడ్డెక్కించిన ఆర్టీసీ తొలుత 1హెచ్, 49ఎం, 3కే, 3, 3కేఎన్, 16ఏ మార్గాల్లో ప్రారంభించింది. తర్వాత మరికొన్నింటిని ఈసీఐఎల్ క్రాస్‌రోడ్స్, ఏఎస్‌రావునగర్, సఫిల్‌గూడ, ఆనంద్‌బాగ్, అనుటెక్స్, మల్కాజిగిరి, మెట్టుగూడ, రైల్ నిలయం, సికింద్రాబాద్ (ఉప్పల్ వైపు), అఫ్జల్‌గంజ్, సీబీఎస్, కాచిగూడ క్రాస్‌రోడ్స్, బర్కత్‌పుర, విద్యానగర్, తార్నాక తదితర ప్రాంతాలకు ఉపయుక్తమయ్యేలా సర్దుబాటు చేసింది. అయితే కొన్నాళ్లకు బస్సులను వేరే మార్గాలకు మళ్లించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

# చేసేది కొంత... బిల్లులేమో చాంతాడంత!

హైదరాబాద్: జలమండలిలో ఎయిర్‌టెక్ మిషన్లు గుత్తేదారులకు కాసులపంట పండిస్తున్నాయి. వారు చేసిందే పని.. అడిగిందే సొమ్ము అన్నట్లుగా నెలనెలా కోట్ల రూపాయలు జలమండలి చెల్లిస్తోంది. పాత ఎయిర్‌టెక్ మిషన్లు వాడుతూ తక్కువ సామర్థ్యంతో తక్కువ పనిచేసి పెద్ద మిషన్లు, పెద్ద యంత్రాలు వాడినట్లు బిల్లులు తీసుకుంటున్నారు. పనిచేసిన వెంటనే మురుగు పొంగడం, బ్లాకేజీలు సాధారణంగా మారింది. మురుగు కాలువల్లో తీసిన స్లడ్జ్‌ని బహిరంగ ప్రదేశాల్లో పడేయడంతో పారిశుధ్య, పర్యావరణ సమస్యలకు దారితీస్తోంది.

వాస్తవమైన మురుగు శుద్ధి రికార్డులు లేకుండా తప్పుడు లాగ్‌లు చూపిస్తున్నట్లు గుర్తించారు.

శిక్షణ లేని ప్రైవేట్ వ్యక్తులను ఉపయోగించడం ద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయి. మురుగు సమస్యలు పూర్తిగా పరిష్కారంకావడం



లేదు.

**ఆన్‌లైన్ పర్యవేక్షణతోనే అడ్డుకట్ట:** సెక్షన్లవారీగా ఎయిర్‌టెక్‌మిషన్లు కేటాయించారు. ఎంత పనిచేశారు? సమస్య పూర్తిగా పరిష్కారం అయిందా? పనులు చేసిన చోట మళ్లీ సమస్య వస్తోందా? వంటి అంశాల జోలికిపోకుండా కాంట్రాక్టర్లు అడిగిందే తడవుగా బిల్లులను చెల్లిస్తున్నారు. దీనిపై దృష్టి సారిస్తున్నామని ఉన్నతాధికారులు పేర్కొన్నారు. జీపీఎస్ సహా ఆన్‌లైన్ పర్యవేక్షణతోనే అక్రమాలకు అడ్డుకట్ట వేయొచ్చని అభిప్రాయపడ్డారు.

ఎయిర్‌టెక్ మిషన్లు: 200పైగా
వినియోగం: ఐదేళ్లకు పైగా
ఒక్కో మిషన్‌కు నెలకు చెల్లించే మొత్తం: రూ.3.5లక్షలు
ఏడాదికి చెల్లిస్తున్న మొత్తం: రూ.70 కోట్లకు పైగా

# ఆర్టీఏకు కాసుల పండగ

కరీంనగర్ : దసరా.. దీపావళి పండగల సమయంలో ఉమ్మడి జిల్లాలో వాహనాల కొనుగోళ్లు పెరిగాయి. కొత్త వాహనాలు కొనుగోలుదారుల ఇళ్లకు చేరగా.. రవాణా శాఖకు కాసుల పంట పండింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది సెప్టెంబరు 1 నుంచి అక్టోబరు 16 వరకు 4,472 వాహనాలు రిజిస్ట్రేషన్ కాగా రవాణా శాఖకు రూ.28.32 కోట్ల ఆదాయం సమకూరింది. నాలుగు జిల్లాల్లో అన్ని రకాల వాహనాలు 4,472 రిజిస్ట్రేషన్ కాగా ఇందులో 2,754 ద్విచక్ర వాహనాలు, 489 కార్లు ఉన్నాయి. అక్టోబరు- 2024లో దసరా సందర్భంగా 2,096 ద్విచక్ర వాహనాలు, 356 కార్లు రిజిస్ట్రేషన్ అయ్యాయి. రవాణా శాఖకు రిజిస్ట్రేషన్, జీవితపన్ను, ఇతరత్రా రూ.24.59 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ సంవత్సరం రూ.28.32 కోట్ల ఆదాయం ఆర్జించింది.గతేడాదితో పోలిస్తే ఈసారి ద్విచక్ర, కార్ల విక్రయాలు పెరిగాయి. సెప్టెంబరు 22, 2025 నుంచి జీఎస్టీలో మార్పులతోపాటు ఆయా కంపెనీలవారు రాయితీలు ప్రకటించడం కూడా వాహనాల కొనుగోళ్లు పెరగడానికి కారణమైంది.

# నకిలీ ఇంజిన్ ఆయిల్.. వినియోగిస్తే వాహనాలకు ముప్పు




హైదరాబాద్ : నగరంలో ఇటీవల ప్రముఖ బ్రాండ్ పేరుతో నకిలీ ఇంజిన్ ఆయిల్ విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఆ బ్రాండ్ లేబుల్‌ని బాటిళ్లపై అంటించి అమ్ముతున్నట్లు గుర్తించారు. అతడి నుంచి రూ.3 లక్షల విలువచేసే సుమారు 710 లీటర్ల నకిలీ ఇంజిన్ ఆయిల్ సీజ్ చేశారు.

హైదరాబాద్‌లో ఇంట్లో రెండు ద్విచక్రవాహనాలు, పది మందిలో ఆరుగురికి కార్లు ఉన్నాయి. వాటిల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే.. క్రమం తప్పకుండా సర్వీసింగ్ చేయించాలి. నాణ్యమైన ఇంజిన్ ఆయిల్ వినియోగిస్తూ.. దాన్ని ఎప్పటికప్పుడూ మార్చుకోవాలి. ఇలాంటి ఆయిల్‌ని కూడా నకిలీ చేస్తున్నారు. బ్రాండెడ్ ఇంజిన్ ఆయిల్ లేబుళ్లు వేసి తక్కువ ధరకే విక్రయిస్తుండగా అవగాహనలేమితో చాలామంది కొని మోసపోతున్నారు. ఇలాంటి సందర్భంలో జాగ్రత్తలతో నకిలీ ఆయిల్‌ను గుర్తించి, ముప్పుని ముందుగానే ఆపేయవచ్చని ఆటోమొబైల్ నిపుణులు చెబుతున్నారు.

**ప్రధాన సంకేతాలివీ..**

నకిలీ ఆయిల్ బాటిళ్లకు ప్యాకేజీ, సీలింగ్‌లో తేడాలుంటాయి. వాటిపై అర్థంకాని అక్షరాలు, నాణ్యత సరిగాలేని ముద్రణతో లేబుళ్లు ఉంటాయి. ప్రత్యేకంగా బ్రాండ్ హెూలోగ్రామ్, సీల్, క్యూఆర్ కోడ్‌లను తనిఖీ చేయాలి.

నకిలీ ఇంజిన్ ఆయిల్ తేలికపాటి, పలుచని రంగుతో కనిపిస్తుంది. అసలైనది పెట్రోల్ వాసనతో ఉంటుంది. ఘాటు రసాయన వాసన వస్తే నకిలీదిగా అనుమానించాల్సిందే.

నకిలీ ఆయిల్‌ను చాలా తక్కువ ధరకు విక్రయిస్తారు.

తయారీ సంస్థ చిరునామా వంటి ముఖ్యమైన సమాచారం లేకుంటే అనుమానించాల్సిందే.

**కలిగే నష్టాలివీ..**

నకిలీ ఆయిల్ వాడకంతో ఇంజిన్‌లో ఘర్షణ అధికమై.. అంతర్గత భాగాలు అరిగిపోతాయి. బేరింగ్‌లలోనూ సమస్యలు ఉత్పన్నమవుతాయి.

తుప్పు నుంచి రక్షణ, పనితీరును మెరుగుపర్చడానికి ఇంజిన్ ఆయిల్ దోహదం చేస్తుంది. నకిలీది వాడటంతో వాహన ఇంజిన్ జీవితకాలం గణనీయంగా తగ్గిపోతుంది.

నకిలీ ఇంజిన్ వాడకం ద్వారా పెట్రోల్, డీజిల్ ఎక్కువగా కాలుతుంది. మైలేజీ తగ్గుతుంది.

తరచుగా మరమ్మతులతో నిర్వహణ ఖర్చులు పెరిగిపోతాయి.

**నమ్మకస్థుల దగ్గరే కొనాలి**

'ఇంజిన్ ఆయిల్‌ని నమ్మకస్థుడైన, ఆథరైజ్డ్ డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలి. తక్కువ ధర వాటిని కొనుగోలు చేసే వాడితే.. వాహనాల పనితీరు మందగిస్తుంది. కొద్దిదూరం ప్రయాణించినా ఇంజిన్ వేడెక్కుతుంది. అగ్నిప్రమాదాలకు కూడా ఆస్కారం ఉంటుంది.'బి.నాగరాజు, ఆటో మొబైల్ నిపుణుడు, ఉప్పల్

# నిబంధనాల ఛత్రం..పదోన్నతులు దూరం



హైదరాబాద్ : 'మీరు మౌఖిక పరీక్షలో ఉత్తీర్ణులు కాకపోతే.. డీమోషన్ ఇస్తాం.. ఇంతవరకు మీరు పొందిన అధిక వేతనం కూడా రికవరీ చేస్తాం. దానికి మీరు అంగీకారం తెలిపితే ఇంటర్వ్యూకు హాజరుకండి.. లేకపోతే వెళ్లండి..'ఎంతో చరిత్ర కలిగిన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్యుల పదోన్నతుల్లో ఎదురైన ఇబ్బందికర పరిస్థితి ఇది. స్వయంగా వర్సిటీ వైస్ ఛాన్స్‌లరే ఈ నిబంధన విధించడం గమనార్హం. ఈ షరతుతో.. పలువురు ఇంటర్వ్యూకు హాజరుకాలేదు. యూజీసీ చరిత్రలో ఎక్కడా లేని నిబంధన ఇది. దీనిపై ఆచార్యులు ఆందోళనబాట పట్టారు. మొత్తం 55 మందికి అన్యాయం జరిగిందని వర్సిటీ ఆచార్యుల సంఘం ఆవేదన వ్యక్తం చేసింది. ఉస్మానియా వర్సిటీ పరిధిలో క్యాంపస్ కళాశాలతో పాటు నిజాం కళాశాల, సైఫాబాద్, సికింద్రాబాద్ పీజీ, కోఠి కళాశాలలు ఉన్నాయి. కోఠి మహిళా కళాశాలకు ఇటీవల వర్సిటీగా గుర్తింపు వచ్చిన విషయం తెలిసిందే. మొత్తం 1232 శాశ్వత ఆచార్యుల పోస్టులు ఉన్నాయి. వీటిలో ప్రస్తుతం 290 మంది మాత్రమే ఉన్నారు. మిగిలినవి ఒప్పంద పద్ధతిలో తీసుకుంటున్నారు. మొదట సహాయ ఆచార్యులుగా ఉద్యోగంలో చేరతారు. తర్వాత పదోన్నతులు ఇవ్వడానికి యూజీసీ నిబంధనల ప్రకారం మార్గదర్శకాలున్నాయి. ఉస్మానియా సొంత షరతులు విధిస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. గత (సెప్టెంబరు) నెల 16 నుంచి 24 వరకు పదోన్నతుల ప్రక్రియ జరిగింది. ఉస్మానియాలో నిబంధనలను పక్కన పెట్టి ఇంటర్వ్యూలో కేవలం అకడమిక్ ప్రశ్నలు అడిగి, 20కి 8 మార్కులు వేసి ఫెయిల్ చేస్తున్నారని ఆచార్యులు ఆరోపిస్తున్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి పదోన్నతులకు మౌఖిక పరీక్షలు నిర్వహించాల్సిన ఉప కులపతి ఏడాదికి ఒకసారి మాత్రమే జరుపుతున్నారు. ఇటీవల నిర్వహించిన పరీక్షకు 103 మందిని పిలిచి 55 మందిని ఫెయిల్ చేశారు. **కొన్ని ఉదాహరణలు పరిశీలిస్తే..**

భౌతికశాస్త్రం విభాగానికి చెందిన ఖలీమ్ అసిస్టెంటు నుంచి అసోసియేట్ పదోన్నతికి హాజరయ్యారు. ఆయన పరిశోధన పత్రాలు నేచర్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఇది అత్యంత ప్రతిష్ఠాత్మకం. అయినా ఆయనకు పదోన్నతి లభించలేదు.

జంతుశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వరరావు సీనియర్ ప్రొఫెసర్‌కు అర్హత సాధిస్తే.. ఇంటర్వ్యూలో ఫెయిల్ అయితే అసోసియేట్‌కు డీమోట్ చేస్తామని, అంగీకరిస్తేనే హాజరు కావాలని షరతు విధించారు. అంతేకాదు.. డీమోషన్ చేసిన తర్వాత వేతనం రికవరీ చేస్తామని హెచ్చరించారు. దీంతో ఆయన హాజరు కాలేదు.

ఇలా 2010 పాత మార్గదర్శకాల ప్రకారం పీహెచ్‌డీ లేకుండానే అసిస్టెంట్ ప్రొఫెసర్‌లుగా నియమితులైన వారందరూ.. ఇంటర్వ్యూకు హాజరు కాలేదు. కేవలం ఒక్కరు మాత్రమే హాజరయ్యారు.

దీనిపై వీసీ కుమార్ మొలుగరం కు వివరణ ఇస్తూ.. పదోన్నతుల ప్రక్రియ అంతా పారదర్శకంగానే నిర్వహించామని చెప్పారు.

# అధి'కారు'లు.. అద్దె బిల్లులు స్వాహా!



కరీంనగర్ : కొందరు అధికారులు సొంత కార్లు వాడుతూ నకిలీ నంబర్లతో అద్దె బిల్లులు తీసుకుంటున్నారు. సమాచార హక్కు చట్టం కింద ఇటీవల ఒకరు వివరాలు సేకరించగా బల్దియా అధికారులు వాడే 21 అద్దెకార్ల నంబర్లన్నీ తప్పుడు వివరాలతో పొందుపర్చినట్లు తేలింది. టీఎస్ 11 యూసీ 0809 అనే కారును ప్రణాళిక విభాగం అధికారులు వాడుతున్నట్లు లెక్కల్లో రాశారు. వాస్తవానికి ఆ నంబరుతో ఉన్న ఆటో హైదరాబాద్‌లో తిరుగుతోంది. నెలకు ఒక్కో వాహనానికి రూ.33 వేల చొప్పున రూ.6.93 లక్షల బిల్లులు తీసుకుంటున్నారు.

జిల్లా వైద్యారోగ్యశాఖలోని ఓ అధికారి రెండు వాహనాల బిల్లులను జేబుల్లో వేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న ఆ అధికారి తన పోస్ట్‌కు తగిన కారును వాడుతూనే మరో వాహనం బిల్లును కొన్నేళ్లుగా కాజేశారని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. ఇటీవల జిల్లా పరిషత్‌లో ఓ అద్దె కారు బిల్లును సక్రమంగా చెల్లించే విషయంలో చేతివాటాన్ని చూపిన ప్రభుత్వ ఉద్యోగి అనిశాకు పట్టుబడ్డారు. ఈ అద్దె కార్ల విషయంలో అన్ని స్థాయిల్లో ఆమ్యామ్యాల జోరు నడుస్తోంది. నెలకు నిర్ణీత కిలోమీటర్లు తిరగకున్నా తిరిగినట్టు రాసినందుకు సిబ్బంది కొంత మొత్తాన్ని నెల నెలా డిమాండ్ చేస్తుండటం గమనార్హం.

రూ.అర కోటిపైన.. జిల్లా వ్యాప్తంగా మండలాధికారులతోపాటు జిల్లా స్థాయిలోని వివిధ విభాగాల ఉన్నతాధికారులంతా కలిపి 152 అద్దె కార్లను వినియోగిస్తున్నారు. ఈ వాహనాలకు అద్దెను నెలకు రూ.33 వేల చొప్పున చెల్లిస్తున్నారు. ఈ లెక్కన మొత్తం వాహనాలకు నెలలో రూ.50.16 లక్షలను అద్దెగా ఖజానా నుంచి బిల్లులుగా ఇస్తున్నారు. కేవలం 30 శాతం మంది అద్దె వాహనాలు వాడుతుండగా.. మిగతా వారంతా సొంత వాహనాల్లోనే క్షేత్రస్థాయి పర్యటనలకు, కార్యాలయాలకు వెళ్తూ బిల్లులను తీసుకుంటున్నారు.

**ఇలా అభ్యంతరకరం..**

అధికారులు విధిగా పసుపు రంగు బోర్డుతో ఉన్న అద్దె వాహనం వినియోగించాలి. కానీ సొంతవాటిలో తిరుగుతున్నారు.

నెలకు 2500 కి.మీ.లు విధిగా తిరగాలి. కానీ చాలామంది అంతకన్నా తక్కువ తిరుగుతూ బిల్లులు రాసుకుంటున్నారు.

కొందరు 2500 కి.మీ.లు కన్నా అధికంగా బిల్లులు పెట్టి కి.మీ రూ.10 చొప్పున అదనపు బిల్లును పొందుతున్నారు.

ట్యాక్సీ ప్లేట్‌వి వాటితే కొందరికి ఉపాధి అందుతుంది. దీంతోపాటు ఆర్టీఏకు ఆ వాహనం ద్వారా పన్ను సమకూరుతుంది.

సొంత వాహనం వాడుతూ రికార్డుల్లో మాత్రం ట్యాక్సీ ప్లేట్ కలిగిన వాహనాల వివరాలు పొందుపరుస్తున్నారు.

# హద్దులు చెరిపేసి.. అక్రమణలకు తెరతీసి

కరీంనగర్ : పెద్దపల్లి, గోదావరిఖని, సుల్తానాబాద్, మంథని పట్టణాల్లోని ప్రభుత్వ భూముల రక్షణ ప్రశ్నార్థకంగా మారింది. రెండు నెలల కిందట పెద్దపల్లి బల్దియా పరిధి చందంపల్లి సమీపంలోని ఓ సర్కారు స్థలాన్ని ఆక్రమించి ప్లాట్లు చేశారనే ఫిర్యాదుతో తహసీల్దార్‌తోపాటు రెవెన్యూ సిబ్బంది అక్కడికి వెళ్లి హద్దులు నిర్ణయించారు. మేడిపల్లి ఓసీపీ ఏర్పాటు సమయంలో రామగుండం వెళ్లేందుకు నిర్మించిన 100 అడుగుల వెడల్పున్న రహదారి ఆక్రమణకు గురవగా ప్రస్తుతం కుంచించుకుపోయింది.

ఓదెల మండలం మడక గ్రామంలో 10 ఎకరాల ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురవుతుందని గతేడాది డిసెంబరులో ఓ పార్టీ నాయకులు ఉన్నతాధికారులకు వినతిపత్రం అందించారు. పలుమార్లు హద్దులను నిర్ణయించిన ఈ స్థలం ఆక్రమణలోనే ఉండిపోయింది.

భూముల ధరలకు రెక్కలు రావడంతో అందినకాడికి దండుకోవాలనే పంథాలో కొందరు ఆక్రమణదారులు సర్కారు స్థలాలపై కన్నేస్తున్నారు. ప్రధాన రహదారులను ఆనుకుని ఉన్న చోట పక్కనున్న సర్వే నంబరు




భూముల్లో వీటిని కలుపుకొంటున్నారు.

రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా పలుచోట్ల భూముల వివరాలు తారుమారయ్యాయి. భూప్రక్షాళన సమయంలో పక్కనున్న వారు సర్కారు స్థలంలోని కొంత భాగాన్ని కలుపుకొన్నారు. ఇందుకు తహసీల్దార్ కార్యాలయాల్లోని పలువురు సిబ్బంది సహకరించారనే ఆరోపణలు ఉన్నాయి. మార్కెట్లో ఎకరం స్థలం రూ.50 లక్షల నుంచి రూ.2 కోట్లవరకు ప్రాంతాన్ని బట్టి పలుకుతుండగా స్థిరాస్తి వ్యాపారులు అందినకాడికి ఆక్రమించుకోవాలని చూస్తున్నారు.

**గతంలో గుర్తించినా..**


ఏప్రిల్‌లో జిల్లావ్యాప్తంగా కలెక్టర్ ఆదేశాలతో ప్రభుత్వ స్థలాలను గుర్తించగా 33,334 ఎకరాలున్నట్లు లెక్క తేలింది. పలు మండలాల్లో సగటున 50-60 ఎకరాల ఆక్రమణలు గుర్తించి బోర్డులు పాతారు. మిగతా చోట్ల కూడా ఆక్రమణలు గుర్తించి బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. సామాజిక అవసరాల కోసం గతంలో పరిహారం ఇచ్చి సేకరించిన భూములకు హద్దులు నిర్ణయించి వాటిని కాపాడాలి. వారంలో ఓ రోజు సర్వేయర్లు గ్రామాలవారీగా ప్రభుత్వ స్థలాల హద్దులను గుర్తిస్తూ వాటిని రక్షించే పని చేపడితే ప్రయోజనం చేకూరనుంది.

# మామూళ్ల మత్తులో తూలుతూ!

సిరిసిల్ల : ఎక్సైజ్ శాఖ ఖజానాకు రాబడిని పెంచే క్రమంలో నిబంధనలు, చట్టాలను అధికారులు గాలికొదిలేశారు. జిల్లా కేంద్రంలోని ఓ బార్‌కు ట్రేడ్ లైసెన్సు లేకుండానే ఎక్సైజ్ అధికారులు అనుమతులిచ్చేశారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లోని ప్రధాన కూడళ్లలో మద్యం దుకాణాలతో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాహనదారులు, సమీప ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా చర్యలు తీసుకోవడం లేదు.. నెలనెలా అందే మామూళ్లే ఇందుకు కారణమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రూ.11 లక్షలకుపైనే..

జిల్లాలో 48 మద్యం దుకాణాలు, 8 బార్లున్నాయి. వీటిలో పోలీసులు, ఎక్సైజ్‌శాఖ మామూళ్ల దందా అంతా ఇంతాకాదు. సిరిసిల్ల పట్టణంలోని ఒక్కో మద్యం దుకాణానికి పోలీసులకు నెలకు రూ.15 వేలు, ఎక్సైజ్ సిబ్బందికి రూ.20 వేలు దండుకుంటున్నారు. వేములవాడలో ఒక్కో దుకాణానికి పోలీసులు, ఎక్సైజ్ వారికి విడివిడిగా నెలకు రూ.18 వేల చొప్పున వసూలు చేస్తున్నారు. ఇక మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లోనివి అయితే నెలకు రూ.20 వేల నుంచి రూ.30 వేలు వసూలు చేస్తున్నారు. వీటిలో ట్రాఫిక్, టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంటువారు నెలకు రూ.3 వేల చొప్పున జేబులో వేసుకుంటున్నారు. ఇలా జిల్లాలో నెలకు మద్యం దుకాణాల ద్వారా రూ.11 లక్షలపైనే



మామూళ్లు చేతులు మారుతున్నాయి.

**ఇష్టారీతిన మద్యం సరఫరా**

జిల్లాలోని మద్యం దుకాణాదారులకు పోలీసుల అండదండలున్నాయనే ఉద్దేశంతో గ్రామాల్లో పోటాపోటీగా అనుబంధ గొలుసు దుకాణాలకు మద్యం సరఫరా చేస్తున్నారు. వారు అధిక ధరలకు విక్రయించినా, కల్తీ చేసిన నిబంధనలను తుంగలో తొక్కేస్తున్నా పట్టించుకోవడంలేదు. ఎక్కువ మద్యం గొలుసు దుకాణాలు ఉన్నవారి నుంచి రూ.10 వేల చొప్పున అదనంగా వసూలు చేస్తున్నారు. వచ్చే నెలాఖరుతో లీజు గడువు ముగుస్తుండటంతో ఈ నెలలోనే ముందస్తు వసూళ్లకు పాల్పడుతున్నారు.

**అనధికార ఆదేశాలపై విమర్శలు**

ప్రభుత్వం పోలీస్‌స్టేషన్ల నిర్వహణకు సంబంధించి పట్టణ ప్రాంతాలకు నెలకు రూ.50 వేలు, మండల కేంద్రాలకు రూ.25 వేల చొప్పున నిధులు విడుదల చేస్తుంది. ఆరు నెలలుగా ఈ నిధులు రావడంలేదు. వాహనాల నిర్వహణ, స్టేషన్‌లో ఇతర అవసరాలకు ఠాణా పరిధిలోని ఒక్కో దుకాణానికి అదనంగా కప్పం కట్టాల్సిందేనంటూ అనధికారిక ఆదేశాలు జారీ చేయడంపై విమర్శలు వస్తున్నాయి. దీంతో దుకాణ నిర్వాహకులు సైతం నిబంధనలు గాలికొదిలేశారు.

# హెచ్చరికలు కరవు

చిన్నకోడూరు : చుట్టూ పచ్చని అందాలు, పక్షుల కిలకిలరావాలకు తోడుగా జలసవ్వడులతో సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులోని రంగనాయకసాగర్ జలాశయం ప్రకృతి ప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఆ అందాలను తిలకిస్తూ జలాశయంలో కేరింతలు కొడుతూ ఆనందంలో మునిగి తేలాలని పర్యాటకులు ఉవ్విళ్లూరుతుంటారు. జలాశయం వద్ద కనీస సదుపాయాలు లేకపోవడంతో పాటు హెచ్చరికలు మచ్చుకైనా కానరావడం లేదు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో కలిసి సరదాగా గడిపేందుకు వచ్చే సందర్శకులు అజాగ్రత్త, నీటి లోతుపై అవగాహన లేక కొన్ని సందర్భాల్లో ప్రమాదంలో చిక్కుకుం



టున్నారు. ఈత, స్వీయ చిత్రాల కోసం జలాశయంలోకి దిగి ఇప్పటి వరకు సుమారు 20 మంది ప్రమాదవశాత్తు మృతి చెందారు. ముఖ్యంగా మెట్ల మార్గంలో ఎలాంటి కంచె నిర్మించలేదు. ఎక్కువ అధికారులు స్పందించి రక్షణ కంచె ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. వరంగల్‌కు చెందిన రెండు కుటుంబాల్లో మొత్తంగా 11 మంది ఈ ఏడాది మేలో రంగనాయకసాగర్ జలాశయం సందర్శనకు వచ్చారు. అందరూ జలాశయంలోకి దిగారు. ఈ క్రమంలో పదమూడేళ్ల బాలిక మునిగిపోతుండగా.. ఆమెను రక్షించేందుకు వెళ్లిన పదిహేనేళ్ల బాలుడు గల్లంతయ్యాడు. పోలీసు, ఫైర్ సిబ్బంది గంటసేపు వెతికి ఇద్దరిని బయటకు తీయగా అప్పటికే మృతి చెందారు. విషాద ఘటనలు జరుగుతున్నందున అధికారులు వెంటనే రక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# శిఖం చిక్కిపోతోంది!

మంచిర్యాల : హమాలీవాడలోని పోచమ్మ చెరువు విస్తీర్ణం ఆది నుంచి వివాదంలో ఉంది. నీటి పారుదల శాఖ రికార్డు ప్రకారం ఆ చెరువు శిఖం 64.39 ఎకరాలు ఉంది. రెవెన్యూ రికార్డు ప్రకారం అయిదెకరాలు ఉంది. ఆ రెండు శాఖల మధ్య సమన్వయ లోపంతో ఆ చెరువు చుట్టూ అనేక మంది అక్రమంగా భవనాలు నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. మంచిర్యాల హైటెక్‌సిటీ-జన్మభూమినగర్ కాలనీల మధ్య 47.32 ఎకరాల్లో రాముని చెరువు విస్తరించి ఉంది. చెరువు శిఖంలో గతంలో హైటెక్‌సిటీ వెంచర్ యజమానులు అక్రమంగా రెండు రహదారులు నిర్మించారు. అప్పుడులో ప్రచురితమైన కథనానికి నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి రహదారులను తొలగించారు. రాజకీయ నాయకులు జోక్యం చేసుకొని ప్రజలకు సౌకర్యం పేరుతో మళ్లీ ఆ శిఖం భూమిలో ఆ రహదారులు నిర్మించారు. ఆ చెరువు శిఖం భూమిని కబ్జా చేయడానికి కొందరు గుడి నిర్మాణం పేరుతో చుట్టూ కంచె ఏర్పాటు చేశారు. రెవెన్యూ అధికారులు కంచెను



తొలగించారు. నేటికీ ఆ స్థలం వివాదంలోనే ఉంది.

మంచిర్యాల నగరంలో చెరువు శిఖం భూములు ఆక్రమణకు గురవుతున్నా.. రక్షణ కల్పించాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. భూ అక్రమార్కులు శిఖం భూములను కబ్జా చేయడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఇక్కడ ఎనిమిది చెరువులు ఉంటే ఇప్పటికే రాముని చెరువు, పోచమ్మ, సాయికుంట చెరువు శిఖం సరిహద్దు భూములు ఆక్రమణకు గురయ్యాయి.

ఆరేళ్ల కిందట అప్పటి కలెక్టర్ ఆర్వీ కర్ణన్ రాముని చెరువు, పోచమ్మ చెరువుల భూమి సర్వే కోసం రూ.8 లక్షలు కేటాయించారు. రాముని చెరువు కొలతలు వేయించి హద్దురాళ్ల (సిమెంట్ దిమ్మెలు) ఏర్పాటు చేయించారు. హమాలీవాడలోని పోచమ్మ చెరువును అధికారులు సర్వే చేయడానికి వెళ్తే అక్కడి కాలనీవాసులు అడ్డుకున్నారు. తర్వాత వచ్చిన కలెక్టర్లు శిఖం భూములకు రక్షణ కల్పించడంపై ఆసక్తి చూపించడం లేదు. జిల్లా నీటి పారుదల, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు సమన్వయంతో చెరువు శిఖం భూములకు రక్షణ కంచె లేదా సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# బేగంపేటలో అరుదైన విజ్ఞాన సంపద

హైదరాబాద్ : మాజీ ప్రధాని పీవీ నరసింహారావు తన అభీష్టం మేరకు సేకరించిన అరుదైన పుస్తకాలు, అపారమైన విజ్ఞానాన్ని అందించే అరుదైన గ్రంథాలతో బేగంపేట బ్రాహ్మణవాడిలోని పీవీ స్మారక గ్రంథాలయం విశేష పాఠకాదరణ పొందుతోంది. స్వాతంత్ర్యోద్యమం నుంచి పీవీ హయాం వరకు చోటుచేసుకున్న ఘటనలు, ప్రముఖుల జీవిత విశేషాలు, జాతీయ నేతల కీలక ప్రసంగాలు, వారి ఆలోచనల నుంచి జాలువారిన అక్షర సుమాలు, నాడు లోక్‌సభ, రాజ్యసభల్లో జరిగిన చర్చల విశేషాలు వంటి వేలాది పుస్తకాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. బహుభాషా కోవిదుడిగా గుర్తింపు పొందిన పీవీ తన కోసం సేకరించినవి, కొనుగోలు చేసినవి, రచయితలు బహుమతిగా ఇచ్చినవి వెరసి సుమారు పది వేలకుపైగా ఇందులో ఉన్నాయి. భారత రాజకీయ, సామాజిక చరిత్రలకు నిలువుటద్దాలుగా నిలుస్తున్నాయి. 1996లో ఏర్పాటైన ఈ భాండాగారం ఇతర గ్రంథాలయాలకంటే ఎంతో భిన్నమైనది. దీనిని పీవీ కూతురు, ఎమ్మెల్సీ వాణీదేవి నిర్వహిస్తున్నారు.

**ఎన్నో అరుదైన పుస్తకాలు..**

స్వాతంత్ర్యోద్యమంలో ప్రముఖుల ప్రసంగాలు, రచనలు వీటిలో ఉన్నాయి. నెహ్రూ, అంబేద్కర్, బాబూ రాజేంద్రప్రసాద్, శాస్త్రవేత్తగా పనిచేసిన కాలంలో అబ్దుల్‌కలాం, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ ఆటోబయోగ్రఫీ, వారి కీలక ప్రసంగాలు, ఆర్థిక వ్యవహారాల విశేషాలు, లోక్‌సభ, రాజ్యసభల్లో చర్చకు వచ్చిన పలు కీలకాంశాలు, ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ కాంగ్రెస్ నేతల కార్యకలాపాలు, ఆర్థిక, గ్రామీణాభివృద్ధి వివరాలు, గాంధేయవాదం, విశ్వనాథ సత్యనారాయణ, పాటూరి ప్రభాకర్‌శాస్త్రి అక్షర సంపద ఉన్నాయి. పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అవసరమైన పుస్తకాలున్నాయి. దీన్ని స్టడీ సెంటర్‌గా తీర్చిదిద్దాలని, పరిశోధన కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రయత్నిస్తున్నట్లు కేంద్రం నిర్వాహకులు, సురభి సోలార్ ఎనర్జీ కేంద్రం డైరెక్టర్ శేఖర్ మారంరాజు తెలిపారు.

# వ్యాపారుల కొర్రీ.. వినియోగదారులు వర్రీ



మెదక్ : మెదక్‌లో జీఎస్టీ (వస్తుసేవల పన్ను) సంస్కరణల ప్రభావం నిత్యావసర వస్తువులకు వర్తించడంలేదు. ధరలు తగ్గించి విక్రయించాల్సి ఉండగా, పాత ఎంఆర్‌పీకే విక్రయిస్తున్నారు. దీంతో వినియోగదారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక భారం తగ్గుతుందని ఆశించిన వారికి నిరాశే ఎదురవుతోంది. పన్ను విధానం ఈనెల 22 నుంచి అమల్లోకి వచ్చినా, ఎక్కడా ధరలను తగ్గించి విక్రయించడం లేదు. పాతస్టాకే ఉందని చెబుతున్నారు. కంపెనీల నుంచి తగ్గిన ధరలు రాలేదని సాకులు చెబుతుండగా, సవరించిన వివరాలను సదరు కంపెనీలు ప్రకటిస్తాయని, ఆ ప్రకారం విక్రయించాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు. జిల్లాలోని ఆయా పట్టణాల్లో బృందం వస్తువులను పరిశీలించగా పాత ధరలకే విక్రయిస్తున్నారు. జిల్లాలో మెదక్, నర్సాపూర్, తూప్రాన్, రామాయంపేట పురపాలికలతో పాటు చేగుంట, పెద్దశంకరంపేట ప్రధాన పట్టణాలతో పాటు మండల కేంద్రాల్లో ఆయా రంగాల వ్యాపారం జోరుగా సాగుతుంది. ఆయా రంగాలకు సంబంధించి వ్యాపారం రూ.10 కోట్ల వరకు ఉంటుంది. జిల్లాలోని నాలుగు బల్దియాల్లో ప్రధాన సరకుల కేంద్రాలను పరిశీలిస్తే ఎక్కడా తగ్గింపు ధరలకు విక్రయించడం లేదు. పాత స్టాక్ అయిపోయాక, కొత్తవి వచ్చాకే అమలు చేస్తామని వ్యాపారులు చెబుతున్నారు. ఆయా వస్తువులకు ఎమ్మార్పీలు సైతం పాత ధరలే ఉన్నాయి. సిమెంట్ ధర రూ.330 ఉంటే రూ.20 వరకు తగ్గింది. పాల ప్యాకెట్ల ధరలు తగ్గలేదు. దుకాణాల్లో ఎక్కడా తగ్గింపు ధరల బోర్డులను ఏర్పాటు చేయకపోవడం గమనార్హం.

**ఫిర్యాదు ఇలా...**

మెదక్‌లోని వాణిజ్యపన్నుల శాఖ కార్యాలయం(ఎస్‌జీఎస్టీ), కేంద్ర జీఎస్టీ(సీజీఎస్టీ) కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చని అధికారులు పేర్కొన్నారు. లేదంటే టోల్‌ఫ్రీ నంబరు 1915 లేదా, 18004253787 హెల్ప్‌డెస్క్‌లో సంప్రదించాలని సూచించారు.

దేవేందర్, సహాయ కమిషనర్, వాణిజ్యపన్నుల శాఖ, మెదక్

కేంద్ర ప్రభుత్వం సవరించిన ధరల ప్రకారం వస్తువులను విక్రయించాలి. తగ్గించిన ధరల వివరాలు సదరు కంపెనీలు డీలర్లకు తెలియజేస్తాయి. జీఎస్టీ వసూలు చేస్తే ఫిర్యాదు చేస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

బోర్డులు ప్రదర్శించాలి: రవిగౌడ్, నర్సాపూర్

ఏయే వస్తువులపై ఎంత జీఎస్టీ తగ్గుతుందనేది వ్యాపారులకు సదరు కంపెనీలు ఇన్‌వాయిస్ అందించాలి. వాటిని దుకాణాల్లో బహిరంగంగా ప్రదర్శించాలి.

# చనాఖ.. ఆశలు నెరవేరక!



ఆదిలాబాద్ : తెలంగాణ స్వరాష్ట్రమైన తొలినాళ్లలో పురుడు పోసుకున్న చనాఖ-కోర్ట బ్యారేజీ పనుల్లో నెలకొన్న ప్రతిష్టంభన వీడటం లేదు. అప్పటి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ప్రాజెక్టు రిజర్వాయర్ ఆనకట్ట నిర్మాణానికి ఎకరాకు రూ.8 లక్షల చొప్పున పరిహారం చెల్లించింది. ఆ తర్వాత పరిహారాన్ని ఎకరాకు రూ.7 లక్షలకు పరిమితం చేయడంతో రైతులు భూములు ఇవ్వడానికి ముందుకురావడం లేదు. ఫలితంగా లోయర్ పెన్‌గంగా కాల్వ ద్వారా 35 వేల ఎకరాలకు నీరిచ్చేలా అవసరమైన పిల్ల కాల్వల భూ సేకరణ ఆగిపోయింది. వర్షాకాలంలో హత్తిఘాట్ నుంచి నీటిని ఎత్తిపోసేలా భీంపూర్ మండలంలో నిర్మించే పిప్పల్‌కోటి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఆనకట్ట కోసం 180 ఎకరాలను సేకరించారు. అయితే, నీటి నిల్వ సహా చనాఖ-కోర్ట బ్యారేజీ కాల్వ(సీకేబీసీ) కోసం సేకరించాల్సిన 820 ఎకరాలకు చెల్లించే పరిహారం ఎటూతేలడం లేదు. చనాఖ-కోర్ట బ్యారేజీని అంతర్రాష్ట్ర ప్రాజెక్టు అని ప్రకటించుకోవడం తప్పితే సాగునీరు అందించాలనే ఆశయం నెరవేరటం లేదు.

**ప్రధాన అంశాలు**

తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులో భూసేకరణ అవసరం లేకుండా ప్రభుత్వం పెన్‌గంగా నదిపై చనాఖ-కోర్ట బ్యారేజీని నిర్మించింది. ఇక్కడ కేవలం 0.8 టీఎంసీల నీరే నిలువ ఉంటుంది. వర్షాకాలంలో 5 టీఎంసీల పైబడి వచ్చే నీటి లభ్యతను సద్వినియోగం చేసుకునేలా ఎగువనున్న భీంపూర్ మండలంలో 1.4 టీఎంసీల సామర్థ్యంతో పిప్పల్‌కోటి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులు చేపట్టింది. 180 ఎకరాల విస్తీర్ణంలో 4.2 కి.మీ. పొడవుతో కట్ట నిర్మాణం చేస్తోంది.

ఎల్‌పీసీ పిల్ల కాల్వల కోసం 100 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉంది. ఎకరాకు కనీసం రూ.10 లక్షల చొప్పున పరిహారాన్ని పరిగణనలోకి తీసుకుంటే రూ.100 కోట్లు అవసరం.

పిప్పల్‌కోటి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కోసం మరో 820 ఎకరాల పరిహారం కోసం రైతులు ఎకరాకు రూ.30 లక్షల చొప్పున డిమాండ్ చేయడంతో ప్రతిష్టంభన నెలకొంది.

**కట్టకే పరిమితం**ఇది పిప్పల్‌కోటి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కట్ట.. ఈ ప్రాజెక్టు పంట చేలకు నీరందించలేక ఇలా అలంకారప్రాయంగా మిగిలింది. **పరిహారం అత్యల్పం..**నసీరుద్దీన్, భూ నిర్వాసితుడు, పిప్పల్‌కోటి–ాకున్న అయిదెకరాలు రిజర్వాయర్ కింద పోతోంది. రిజర్వాయర్ పక్కన భూముల ధరలు ఎకరాకు రూ.40 లక్షలు పలుకుతుంటే.. మాకేమో రూ.7 లక్షల చొప్పున ఇస్తామని అంటున్నారు. ముంపు ప్రాంతంగా ప్రభుత్వం నిర్ణయించడంతో వేరేవాళ్లు కూడా కొనడానికి ముందుకు రావడం లేదు.

# కలగానే ఉపాధి కల్పన




ఉట్నూరు : నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన కలగానే మిగులుతోంది. గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ అండ్ మార్కెటింగ్ మిషన్(ఈజీఎంఎం), ఐటీడీఏ ఆధీనంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్(వైటీసీ)లలో యువత ఆసక్తి, అభిరుచికి అనుగుణంగా నైపుణ్యాల శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించాల్సి ఉంది. కానీ ప్రభుత్వం నిధులను కేటాయించడం విస్మరించింది. ఫలితంగా శిక్షణ లేక కేంద్రాలు వెలవెలబోతున్నాయి. యువతకు ఉపాధి కరవైంది. గ్రామీణాభివృద్ధిశాఖ ఈజీఎంఎం ద్వారా ప్రతి మూడు నెలలకోసారి ఉచిత భోజనం, నివాస వసతితో యువతకు కంప్యూటర్, ఇతర శిక్షణలను నిర్వహించేది. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఆయా కంపెనీలలో ఉపాధి కల్పించేది. శిక్షణల నిర్వహణకు ఏటా రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ నిధులను కేటాయించి కార్యక్రమాలు జరిగేలా పర్యవేక్షించేది. కానీ రెండేళ్ల నుంచి నిధులు కేటాయింపు లేక శిక్షణలు నిలిచిపోయాయి. ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉట్నూరు, బెల్లంపల్లి, ఇచ్చోడ, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ మండలాల్లో 2016లో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐదు వైటీసీలను నెలకొల్పింది. ప్రతి జిల్లాకు ఒక జాబ్ మేనేజర్, వార్డెన్, మొబలైజర్లు, బోధకులను నియమించారు. వైటీసీల నిర్వహణకు ప్రభుత్వం ఏటా రూ.3-4 కోట్ల నిధులను కేటాయించేది. దీంతో వైటీసీల పరిధిలోని మండలాల్లో నిరుద్యోగ ఆదివాసీ గిరిజన యువతీయువకులను ఎంపిక చేసి ఉచిత భోజనం, నివాస వసతి కల్పిస్తూ.. కంప్యూటర్ ప్రోగ్రామింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్, బ్యాంకింగ్, ఫైనాన్స్ తదితర కోర్సులలో శిక్షణ కల్పించేవారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉపాధి కల్పించేందుకు రాష్ట్రంలోని ప్రముఖ కంపెనీలను ఆహ్వానించి జాబ్ మేళాలు ఏర్పాటు చేసి అభ్యర్థులకు ఉద్యోగాలను కల్పించేవారు.

**ప్రస్తుత పరిస్థితి..**వైటీసీలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. ఐటీడీఏకు రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ నిధుల కేటాయింపులో తీవ్ర జాప్యం చేస్తోంది. 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాల్లో నిధులు కేటాయిస్తామని ప్రకటించి ఆశలు రేకెత్తించారు. కానీ కేటాయింపు విస్మరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు మంజూరు చేసి శిక్షణలను పునరుద్ధరిస్తే నిరుద్యోగ గిరిజన యువత ఉద్యోగ, ఉపాధి పొందేందుకు అవకాశం ఉంటుంది.

**సర్కారీ కొలువుల కోసం..**


పీఈటీసీల్లో నైపుణ్యాల శిక్షణ, ఉపాధి కల్పించడంతోపాటు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న గిరిజన యువతకు కానిస్టేబుల్, ఎస్ఐ, గ్రూప్-2, గ్రూప్-4, ఆర్ఆర్‌బీ, ఉపాధ్యాయ, అటవీశాఖ ఉద్యోగాల కోసం ప్రత్యేక శిక్షణ ఇచ్చేవారు. ఉచితంగా అభ్యాసన సామగ్రి అందజేస్తూ.. వారు ఉద్యోగాలు సాధించేలా ప్రోత్సహించేవారు.

# వరదాయిని.. ఉరిమింది!

తాండూరు : వ్యాపార కార్యకలాపాలు ఒక్కసారిగా స్తంభించాయి. తాండూరు, వికారాబాద్, కొడంగల్, పరిగి పట్టణాలకు పరిసర గ్రామాల నుంచి పండగకు సరకులు కొనేందుకు వచ్చేవారు. వర్షాలతో రద్దీ బాగా తగ్గింది. దీంతో దుకాణాలు వెలవెలబోతున్నాయి. జిల్లాకు వరప్రదాయిని కాగ్నానది ఉగ్రరూపం దాల్చింది. భారీ వర్షాలకు బషీరాబాద్, యాలాల, తాండూరు, పెద్దేముల్ కాగ్నానది పరివాహక మండలాల్లోని పంట పొలాలు, ఇళ్లు నీట మునిగాయి. ప్రధాన రహదారులు పాడయ్యాయి. యాలాల మండలం కోకట్ వంతెన తెగిపోవడంతో సుమారు 35 గ్రామాలకు వెళ్లేందుకు సిబ్బందిగా మారింది.హల్కోడ- నవాంద్గీ మధ్య వేసిన రోడ్డు కొట్టుకుపోయింది.

**10వేల ఎకరాల్లో పంటలకు నష్టం..**

నియోజకవర్గంలో 10వేల ఎకరాలకుపైగా పంటలకు నష్టం వాటిల్లిందని రైతులు, వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. బషీరాబాద్ మండలం జీవన్గీ, గంగ్వార్, మంతట్టి, క్యాద్గిరా, నవాంద్గీ, ఇందర్‌చేడ్, పెద్దేముల్ మండలంలోని కందనెల్లి, యాలాల మండలం బెన్నూరు, కోకట్, సంగెం, తాండూరు మండలం వీర్‌శెట్టిపల్లి, గోనూరు, పాత తాండూరు పరిసరాల నుంచి కాగ్నానది ప్రవహిస్తుండడంతో వర్షాలకు అంది పొంగి కంది, పత్తి, వరి పంటలన్నీ నీటిముగాయి. రూ.కోట్లలో



రైతన్నలకు నష్టం వాటిల్లడంతో తల్లడిల్లుతునారు.

**ట్రిప్పులు కుదించిన ఆర్టీసీ..**

వర్షాలకు ప్రధాన రహదారులు ధ్వంసం కావడంతో ఆర్టీసీ బస్సుల ట్రిప్పులు కుదించారు. తాండూరు నుంచి మహబూబ్‌నగర్‌కు 4, హైదరాబాద్ రూట్లో 5, చించోళి రూట్లో 4 ట్రిప్పులు తగ్గించామని తాండూరు డిపో మేనేజరు సురేశ్‌కుమార్ తెలిపారు.

**ఉపాధి కోల్పోయిన నాపరాతి కార్మికులు..**

మల్కాపూరు, ఓగీపూరు, కరణ్‌కోట గనుల్లోకి వరద నీరు భారీగా వచ్చి చేరింది. గౌతాపూరు, చెంగేష్‌పూరు, కోకట్, కొడంగల్ రోడ్ల వారగా ఉన్న పాలిష్ యూనిట్లలోకి వరద చేరడంతో పనులు స్తంభించాయి. దీంతో వేల మంది కార్మికులకు ఉపాధి లేకుండాపోయింది.

**ప్రభుత్వం ఆదుకోవాలి..**

- వెంకటేశం, నవాంద్గీ.

మా గ్రామం కాగ్నానదికి ఒడ్డున ఉంటుంది. ఊరి చుట్టూ నీటి ప్రవాహంతో రెండు వైపులా పత్తి, కంది, వరి పంటలన్నీ నీట మునిగాయి. నాకున్న పదెకరాల్లో పంటలు వరదలో మునిగిపోయాయి. ఊళ్లో సుమారు 300 ఎకరాలకుపైగా పంటలు పాడయ్యాయి. చేతికొచ్చిన పత్తి నేలమట్టమైంది. ప్రభుత్వం ఆదుకోవాలి.

# భద్రాద్రి.. ఒడిసిపట్టింది

ఖమ్మం : వాననీటి సంరక్షణలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జాతీయ స్థాయిలో ప్రత్యేకతను చాటింది. కేంద్ర ప్రభుత్వం గురువారం ప్రకటించిన జల్ సంచయ్ జన్ భాగీదారీ-1.0 ర్యాంకుల్లో రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాలు గుర్తింపు పొందగా.. అందులో భద్రాద్రి జిల్లా రూ.25 లక్షల బహుమతి విభాగానికి ఎంపికైంది. నీటి వృథాను అరికట్టడానికి ఇంకుడుగుంతలు, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్, పంట కుంటలు, ఊట చెరువులు సహా 29,103 పనులు చేపట్టి భూగర్భజలాల సంరక్షణకు చేసిన కృషికి ఫలితం దక్కింది.

**ఖర్చు తక్కువ.. ఫలితం ఎక్కువ**

నీటి వనరులను సుస్థిరం చేయటానికి గతేడాది కేంద్ర ప్రభుత్వం జల్ సంచయ్ జన్ భాగీదారీ కార్యక్రమం చేపట్టింది. పథకం మార్గదర్శకాలపై ప్రభుత్వాధికారులతోపాటు ప్రజలకు కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ అవగాహన కల్పించారు. ఒక మీటరు చొప్పున పొడవు, వెడల్పు, లోతుతో తక్కువ ఖర్చుతో తవ్వుకునేలా ఇంకుడుగుంతలకు శ్రీకారం చుట్టారు. విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, కార్యాలయాలు, పార్కులు, రోడ్లకు రెండువైపులా, చేతిపంపుల చెంత, నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో అధికారులు వీటిని స్వచ్ఛందంగా నిర్మించారు. 2024 ఏప్రిల్ 1 నుంచి ఈఏడాది మే 31 వరకు భద్రాద్రి జిల్లావ్యాప్తంగా 24,421 ఇంకుడుగుంతలు తవ్వారు. ఉపాధి హామీ పథకం కింద మరో 2,358 ఇంకుడుగుంతలు, 806 పంట కుంటలు నిర్మించారు. 1,255 నీటివనరుల్లో పూడికతీత పనులు చేపట్టారు. 25 ఊట కుంటలు తవ్వించారు.

ఐటీసీ నిధులతో దుమ్ముగూడెంలో 50, చర్ల మండలంలో 183 పంట కుంటలు, సింగరేణి ఆధ్వర్యంలో ఐదు నీటి వనరులను కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో నిర్మించారు. ఈ పనులను జేఎస్‌జేబీ ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదుచేయగా.. కేంద్ర నోడల్ అధికారి పృథ్వీరాజ్ పర్యవేక్షించి ఆమోదించారు. ఫలితంగా నగదు బహుమతి దక్కింది.

**స్ఫూర్తి కొనసాగేలా..**

ప్రభుత్వ కార్యాలయాలు, ఖాళీ స్థలాల్లో ఇంకుడుగుంతలు తవ్వించటంతో నీరు నిలిచే బదులు భూగర్భంలోకి ఇంకుతోంది. బహుమతి సాధించిన స్ఫూర్తితో 2.0లోనూ వ్యవసాయ భూములు, గ్రామాల్లో వాననీరు ఎక్కడికక్కడ భూగర్భంలోకి ఇంకటానికి గుంతలు తవ్వించాలని భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ నిర్ణయించారు. ఖమ్మం జిల్లాలో భూగర్భజలాలు అధికంగా ఉన్నాయి. పైగా గతేడాది పనులు ప్రతిపాదించకపోవటంతో 'జల్ సంచయ్ జన్ భాగీదారీ'లో భాగస్వాములం కాలేదని గ్రామీణాభివృద్ధి అధికారులు చెబుతున్నారు. ఈఏడాది రూఫ్ వాటర్ హార్వెస్టింగ్, ఇంకుడుగుంతలు నిర్మించటానికి సమాయత్తమవుతున్నామని తెలిపారు. 'భద్రాద్రి జిల్లాకు బహుమతి ద్వారా అందే రూ.25లక్షలను నీటిసంరక్షణ పనులు, ప్రజా చైతన్య సదస్సులకు వెచ్చిస్తాం. సాంకేతిక నైపుణ్యాలను పెంచుకునేందుకు వినియోగిస్తాం' అని డీఆర్డీఓ విద్యాచందన కు తెలిపారు.

## టిడ్కో ఇళ్లు వీడిన చిక్కుముళ్లు

ఆదోని : ఉమ్మడి కర్నూలు జిల్లాలో టిడ్కో ఇళ్ల నిర్మాణాల పూర్తికి కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. 2014–19 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలో కర్నూలు నగరపాలక సంస్థతో పాటు నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు పురపాలక సంఘాల్లో 300, 365, 430 చ.అ. నివాసాలు, ఆళ్లగడ్డ, డోన్ పురపాలికల్లో షీర్ వాల్ సాంకేతికతతో 300 చ.అ. నివాసాల నిర్మాణాలు చేపట్టారు. రూ.1611.80 కోట్ల వ్యయంతో మొత్తం 30,672 ఇళ్లకు గాను 14,262 పూర్తిచేశారు. ఇప్పటికే పురపాలక సంఘాల వారీగా నిర్మాణాల పురోగతిపై పలు మార్లు సమీక్ష చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ అసంపూర్తి ఇళ్లను 2026 మార్చి 31 నాటికి పూర్తిచేయాలని ఆదేశాలు జారీ చేశారు.



**రూ.25 కోట్లు విడుదల**

తెదేపా ప్రభుత్వం 2019 నాటికి 90శాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసింది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం నిర్మాణాలను ముందుకు తీసుకెళ్లకపోవడంతో లబ్ధిదారులకు సకాలంలో ఇళ్లు అందివ్వలేకపోయారు. గృహాలకు వైకాపా రంగులు మార్చేందుకు రూ.లక్షలు వెచ్చించడంతో పాటు జంగిల్ క్లియరెన్స్ పేరుతో గుత్తేదారుల జేబులు నింపే పనులు చేసింది. తెదేపా హయాంలో పనులు పూర్తయి, రావాల్సిన రూ.25 కోట్ల బిల్లులను తాజాగా కూటమి ప్రభుత్వం విడుదల చేసింది. ప్రస్తుతం రూ.123 కోట్లతో పనులు పూర్తిచేయనున్నారు.

## కాలుష్య భూతం 'పట్టు'కుంది

వెల్దుర్తి : జాతీయ స్థాయిలో 'పట్టు' ప్రఖ్యాతి పొందిన శ్రమజీవులను కాలుష్య భూతం కకావికలం చేసింది. వెల్దుర్తి మండలం సూదేపల్లిలో 1,500 ఎకరాల్లో 150 మంది రైతులు మల్బరీ సాగు చేసేవారు. గ్రామంలో నెలకు 3 వేల నుంచి 4 వేల కిలోల పట్టుగూళ్లు ఉత్పత్తి అయ్యేవి. ఏడాదికి 10 నుంచి 11 కోతలు తీసేవారు. వీరంతా హిందూపురానికి వెళ్లి విక్రయించి లాభాలు పొందేవారు. ఒక్కో రైతుకు సగటును ఏటా రూ.5 లక్షల ఆదాయం వచ్చేది. డోన్ మండలం ఉడుములపాడులో వెలిసిన ఓ పరిశ్రమ నుంచి విడుదలవుతున్న కాలుష్యం 'పట్టు' దిగుబడులను చిదిమేసింది. మల్బరీ మొక్కలు ఎదగడం లేదు.. కొత్త ఆకులు రావడం లేదు.. ఏటా ఐదు పంటలు రాలేని దుస్థితి నెలకొంది. చేసేది లేక రైతులు మల్బరీ సాగును ఒక్కొక్కరు వదిలేస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో ఐదుగురే పంట సాగు చేస్తున్నారు.



**కూలీలుగా మారుతున్న అన్నదాతలు**

మల్బరీ సాగులో మంచి దిగుబడులు సాధించి, పది మందికి ఉపాధి చూపిన రైతులు నేడు కూలీలుగా మారుతున్నారు. కాలుష్యం కారణంగా పంట దెబ్బతినడంతో పంటను వదిలేశారు. ఇతర పనుల కోసం కర్నూలు నగరానికి వెళ్తున్నారు. పట్టుగూళ్ల పెంపకంలో జాతీయ స్థాయిలో ఉత్తమ రైతు అవార్డు అందుకున్న శివశంకరగౌడ్ కూడా సాగు వదిలేశారు.

రామానాయుడు తనకున్న మూడెకరాల్లో పదేళ్లుగా మల్బరీసాగు చేపట్టేవారు. ఏటా 11 కోతలు తీసి రూ.5 లక్షల ఆదాయం పొందేవారు. ఖర్చులు పోను ఏడాదికి రూ.3 లక్షల లాభం వచ్చేది. రాముడు మూడెకరాలు కౌలుకు తీసుకొని కొన్నేళ్లుగా మల్బరీ సాగు చేసేవారు. రెండేళ్లుగా పంట దెబ్బతినడంతో వదిలేశారు. వీరిద్దరూ కుటుంబ పోషణ కోసం కర్నూలుకు వెళ్తున్నారు.

పట్టుగూళ్లు ఉత్పత్తి చేస్తున్న రైతులకు ప్రభుత్వం కిలోకు ప్రోత్సాహకంగా అదనంగా రూ.50 అందించేవారు. దీనివల్ల ఒక్కో రైతుకు రూ.10 వేల మేర అదనపు ఆదాయం సమకూరేది. ఇవి చెల్లించకపోవడంతో రైతుల్లో నిరుత్సాహం నెలకొంది.

## భానుడితో దోస్త్..ఉపాధి మస్త్..

విజయనగరం : ఐటీఐ విద్యార్థులకు కొత్త తరం కోర్సులు పరిచయం చేయడం ద్వారా భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా సోలార్, డ్రోన్, ఏఐ, విద్యుత్తు వాహనాలకు సంబంధించిన సాంకేతికతపై శిక్షణ నిమిత్తం ల్యాబ్‌లను అందుబాటులోకి తీసుకొస్తోంది. ఇప్పటికే విజయనగరంలోని ప్రభుత్వ ఐటీఐలో సౌర శక్తితో నడిచే ల్యాబ్‌ను ప్రారంభించారు. త్వరలో డ్రోన్ టెక్నాలజీ, ఈవీ ల్యాబ్‌లు అందుబాటులోకి రానున్నాయి.

**ఇతర కళాశాలల వారికీ..**

విజయనగరంలో ఏర్పాటైన ల్యాబ్‌తో విద్యార్థులకు సౌర విద్యుత్తుపై అవగాహన ఏర్పడుతుంది. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద(సీఎస్ఆర్) కింద మైక్రోమ్యాక్స్ ఎలక్ట్రానిక్స్ రూ.7 లక్షలతో దీనిని ఏర్పాటు చేసింది. ఈనెల 13న ఎమ్మెల్యే అదితి ప్రారంభించారు. ప్రస్తుతం శిక్షణ తరగతులు సాగుతున్నాయి. ఇక్కడి వారితో పాటు ఇతర కళాశాలలకు చెందిన వారికీ తర్ఫీదునిస్తున్నారు.

**ఏడు రోజుల పాటు..**

'సౌరవిద్యుత్తు' అంశాన్ని చదువులో భాగం చేయనున్నారు. ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ ట్రేడ్‌ల వారికి వారం పాటు శిక్షణ ఇస్తారు. హైదరాబాద్‌లో శిక్షణ పొందివచ్చిన జిల్లాకు చెందిన శ్రీకాంత్, త్రినాథరావు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో మూడు ప్రభుత్వ, 25 ప్రైవేటు ఐటీఐలున్నాయి. వీటిల్లో 1400 మందికి గానూ.. ఇప్పటివరకు 500 మందికి మెలకువలు నేర్పించినట్లు జిల్లా కన్వీనర్ టీవీ.గిరి తెలిపారు. సౌర శక్తి వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఆ దిశగా ముందుకెళుతున్నామన్నారు.

# నిబంధనలపై 'రాళ్లు'



నంద్యాల : జిల్లాలో కంకర, లైమ్ కంకర, క్వారీల్లో నిబంధనలపై రాళ్లు వేస్తున్నారు. లీజుదారులు రెన్యువల్‌కు దరఖాస్తు చేసుకుంటూ.. అనుమతులు వచ్చే దాకా ఆగకుండా విచ్చలవిడిగా తవ్వకాలు చేస్తున్నారు. నంద్యాల, బేతంచెర్ల గనుల శాఖ కార్యాలయాల పరిధిలో రోడ్డు మెటల్ క్వారీలు ఐదు ఉన్నాయి. బనగానపల్లి మండలం భానుముక్కల క్వారీల్లో కంకర తవ్వకాలు జరుగుతున్నాయి. ప్యాపిలి, డోన్ మండలాల్లో ఉన్న క్వారీల్లో ప్రస్తుతం జరగడం లేదు. నంద్యాల కార్యాలయం పరిధి పాణ్యం మండలంలోని తమ్మరాజుపల్లె తదితర ప్రాంతాల్లో 16, ఆళ్లగడ్డ పరిధిలో రెండు క్వారీలు ఉన్నాయి. నిర్దేశిత పరిధి దాటి తవ్వకాలు జరుగుతున్నా చర్యలు మాత్రం లేవు.

**అంతా దోపిడీ**

పాణ్యం మండలం గద్దెలకొండలో కంకర తవ్వకాల్లో మూడింటికి మాత్రమే అనుమతులున్నాయి. పెద్దఎత్తున ఉల్లంఘనలు జరుగుతున్నాయి. అనుమతులున్న క్వారీల్లోనూ నిర్దేశించిన దానికంటే అధిక లోతులో తవ్వకాలు జరుగుతున్నాయి. బనగానపల్లి పరిధిలో ఇష్టారీతిన బ్లాస్టింగ్‌లతో దుమ్ము, ధూళి చేరడంతో పర్యావరణ సమస్యలు తలెత్తుతున్నాయి. నంద్యాలలో వేస్తున్న సిమెంట్ రహదారులు, బహుళ అంతస్తులు, గృహ నిర్మాణాలకు తమ్మరాజుపల్లెలో జరుగుతున్న అక్రమ తవ్వకాల కంకరే వాడుతున్నారు. నంద్యాల, ఆత్మకూరు, నందికొట్కూరు నియోజకవర్గాల్లోని వివిధ నిర్మాణాలకూ ఇదే మెటల్ వాడుతున్నారు.

**లైమ్ కంకర ఇదే స్థాయిలో**

స్థిరాస్తి వ్యాపారంతోపాటు నంద్యాలలోని వివిధ ప్రాంతాల్లోని కాలనీలు, పాఠశాలలు, కళాశాలలు, రెస్టారెంట్లు తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున లైమ్ కంకర వాడుతున్నారు. దీంతో దళారులు కొందరు తమ్మరాజుపల్లె గద్దెలకొండ నుంచి ప్రత్యేకంగా తెప్పించుకుని ఇక్కడ విక్రయాలు చేస్తున్నారు. గద్దెలకొండలో రాత్రి వేళల్లో తవ్వకాలు పెద్దఎత్తున జరుగుతున్నాయి. పాణ్యం పోలీసులకు సమాచారం ఇచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు

క్వారీలు: 283

రోడ్డు మెటల్ క్వారీలు: 32

రెన్యువల్ దశలో : 16

రెన్యువల్ పేరుతో 'దగా'పాణ్యం, బనగానపల్లి ప్రాంతాల పరిధిలోని క్వారీల్లో ప్రస్తుతం కొన్ని రెన్యువల్ దశలో ఉన్నాయి. 15 క్వారీలకు దరఖాస్తులను ప్రస్తుతం పరిశీలిస్తున్నారు. ఆయా క్వారీల్లోనూ తవ్వకాలు సాగుతున్నాయి. 32 క్వారీల పరిధిలో ఎక్కడా నిబంధనలు పాటించడం లేదు. పర్యావరణ అనుమతులు 9 క్వారీలకు మాత్రమే ఉన్నాయి. పాణ్యం ప్రాంతాల్లోని క్వారీల్లో ప్రైవేట్ సైన్యం ఆధ్వర్యంలో తవ్వకాలు జరుగుతున్నాయి. నంద్యాల, ఆత్మకూరు, నందికొట్కూరు మున్సిపాల్టీలతోపాటు ప్రకాశం జిల్లా దిగువమెట్ట నుంచి చలమ వరకు ప్రస్తుతం జరుగుతున్న డబ్లింగ్ రైల్వే పనుల్లో ఈ కంకర వాడుతున్నారు. నల్లమల్ల అరణ్యంలోకి నేరుగా పాణ్యం, ఆళ్లగడ్డ ప్రాంతాల నుంచి అక్రమంగా తవ్విన నల్ల కంకర రవాణా జరుగుతుంది.

# పరిశ్రమ పెట్టాలా..12 శాఖలను కలవనక్కర్లే !



విజయనగరం : పరిశ్రమ పెట్టాలంటే సుమారు 12 శాఖల అధికారులను కలవాలి. మనం వెళ్లే వేళకు వారు కార్యాలయాల్లో ఉంటారో.. క్షేత్ర పర్యటనకు వెళ్తారో తెలియదు. సరైన పత్రాలు లేవనో.. వివరాలు అసంపూర్తిగా ఉన్నాయనో ఒకటికి పదిసార్లు తిరగాల్సి వచ్చేది. గతంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఎదురైన ఇబ్బందులివి. కూటమి ప్రభుత్వం రాకతో సింగిల్ విండో విధానాన్ని తీసుకొచ్చింది. 2024–29 పాలసీలో భాగంగా త్వరితగతిన ఒకేచోట అనుమతులు ఇస్తోంది.

**అన్నీ వారే చూసుకుంటారు..**

%www.apindustries.gov.in% వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేస్తే పరిశ్రమల శాఖ అధికారులు పరిశీలిస్తారు. నోడల్ ఏజెన్సీగా పనిచేస్తూ విద్యుత్తు, పంచాయతీ, పురపాలక, అగ్నిమాపక, రెవెన్యూ, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్, కాలుష్య నియంత్రణ మండలి, భూగర్భ జల విభాగాలను సంప్రదిస్తారు. స్థాయిని బట్టి 7, 15, 21 రోజుల్లో అనుమతులు వచ్చేలా చూస్తారు. స్వయం ఉపాధి యూనిట్ అయితే వారంలోనే పని పూర్తిచేశారు.

**రాయితీలు పెరిగాయ్..**

పరిశ్రమలు స్థాపించే ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, మహిళలకు గతంలో 35 శాతం రాయితీ అందించేవారు. ప్రస్తుతం 45 శాతానికి పెంచారు. ఇతరులకు పరిశ్రమల ఆధారంగా వివిధ విభాగాల్లో 25 శాతం వరకు రాయితీ దక్కనుంది.

విజయనగరం జిల్లాలో గతేడాది ఆగస్టు నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తుల్లో 4,019కు అనుమతులు ఇచ్చారు.

రెండు జిల్లాల్లో పారిశ్రామిక వాడలు రూపుదిద్దుకుంటున్నాయి. ఆయా పార్కుల్లోనే స్థలాలు సైతం కేటాయిస్తారు. ప్రాజెక్టు నివేదిక, అనుమతి పత్రాలను సమర్పించాలని పరిశ్రమల కేంద్రం విజయనగరం జీఎం ఎం.డి.షఫీ అహ్మద్, మన్యం ఇన్‌ఛార్జి జీఎం కరుణాకర్ సూచిస్తున్నారు. మన్యంలో 1,479 మందికి అవకాశం దక్కింది. ఇందులో రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల లోపు చిరు పరిశ్రమలున్నాయి.

అనుమతులు పొందిన వాటిలో రైస్ మిల్లులు, కాగితపు కప్పులు– ప్లేట్లు, పిండి మిల్లులు, ఆటోమొబైల్, ఫెర్రో అల్లాయిస్, వ్యవసాయ, పాలు, బ్యాకరీ ఉత్పత్తులు, ప్రింటింగ్, ఆహారశుద్ధి, వివిధ రకాల ఉత్పత్తుల యూనిట్లు ఉన్నాయి.

# నగరానికి పండ్ల సోయగం



విజయనగరం : వేసవిలో విజయనగరం వెళ్లలేమండీ బాబూ అంటుంటారు మన పెద్దలు. ఒకప్పుడు అంత వేడి ఉండేది. రానురానూ తగ్గినా ఉక్కబోత మాత్రం వెంటాడుతోంది. దీనికి ప్రధాన కారణంగా అక్కడి కాలుష్యమే. దీనికి అడ్డుకట్ట వేసేందుకు నగరపాలక సంస్థ చర్యలు తీసుకుంటోంది. పచ్చదనం పెంపులో భాగంగా తొలి విడత కింద 50 వేల పండ్ల మొక్కలు నాటనుంది. ఈమేరకు ఎన్‌క్యాప్ నిధులు రూ.20 లక్షలను ఖర్చు చేయనుంది. స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఇటీవల కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**డివిజన్‌కు వెయ్యి చొప్పున..**

నగర పరిధిలో 50 డివిజన్లు ఉన్నాయి. 1000 చొప్పున 50 వేల మొక్కలు పంపిణీ చేయనున్నారు. ఇటీవల కడియం నుంచి 5 వేలు తెప్పించారు. ఇందులో జామ, నేరేడు, పనస, మామిడి, సపోటా, సీతాఫలం తదితర రకాలున్నాయి. విడతల వారీగా మిగిలిన వాటిని తెప్పిస్తారు. డివైడర్లు, పార్కులు, ప్రధాన కూడళ్లు, చెరువు గట్లు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో నాటనున్నారు. మరోవైపు మిద్దె పంటలను సైతం ప్రోత్సహించనున్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛాంధ్ర అవార్డులకు నగరపాలికకు చెందిన మూడు సంఘాలు ఎంపికయ్యాయి. **గత ప్రభుత్వ హయాంలో ఇలా..**

గత ప్రభుత్వ హయాంలో జగనన్న హరిత నగరాల పేరిట రూ.26 లక్షలతో 2,650, మెగా ప్లాంటేషన్ కింద రూ.53.95 లక్షలతో 5,652 మొక్కలు నాటారు. ట్రీగార్డుల కోసం మరో రూ.18.20 లక్షలు, నామ ఫలకాల పేరిట ఇంకో రూ.8.75 లక్షలు వెచ్చించారు. ఇందులో ఒక్కటీ కనిపించడం లేదు.

**కాలుష్యానికి అడ్డుకట్ట..**

నగరంలో కొన్నేళ్లుగా కాలుష్యం పెరుగుతోంది. వాహనాల వినియోగం, పరిశ్రమల నుంచి వెలువడే పొగ కారణంగా గాలిలో స్వచ్ఛత తగ్గుతోంది. ప్రస్తుతం వీటీ.అగ్రహారం, కస్పా, నగరపాలిక కూడలిలో గ్రోత్ సెంటర్ల ద్వారా వాయు కాలుష్యాన్ని పరిశీలిస్తున్నారు. పీసీబీ(పొల్యూషన్ కంట్రోల్ బోర్డు) ప్రకారం పీఎం– 10(పార్టిక్యులేట్ మేటర్) విలువ రోజుకు 100 ఎంఎఫ్‌సీఎం(మైక్రోగ్రామ్స్ పర్ క్యూబిక్ మీటర్) దాటకూడదు. ఏడాదిలో సరాసరి 60లోపే ఉండాలి. ప్రస్తుతం జిల్లా కేంద్రంలో 72 నుంచి 77 వరకు నమోదవుతోంది. మొక్కల పెంపకంతో దీన్ని తగ్గించనున్నారు.

**రక్షణకు చర్యలు..** పచ్చదనం పెంపు, కాలుష్యం నివారణే లక్ష్యంగా ముందుకెళుతున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య తెలిపారు. తొలి విడతలో డివిజన్‌కు 1000 చొప్పున మొక్కలు అందిస్తామని, అలాగే ఇప్పటికే నాటిన వాటి రక్షణ కోసం వెయ్యి ట్రీగార్డులు కొనుగోలు చేయనున్నామన్నారు. ఈ మేరకు ఒక్కో దానికీ రూ.1800 చొప్పున వెచ్చిస్తామన్నారు.

## పీవీఆర్‌కు 'వంద'నం!

ఒంగోలు : విశ్రాంత డీజీపీ నండూరి సాంబశివరావు, అప్పా పూర్వ జేడీ తోట వెంకట్రావు, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కె.గిరిజాశంకర్, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, ఐఆర్ఎస్ అధికారి డాక్టర్ సలీం, సాహిత్యంలో జీవితకాల పురస్కార గ్రహీత తల్లావజుల శివాజీ, బీసీరాయ్ అవార్డు గ్రహీత చివుకుల లక్ష్మీనరసింహమూర్తి, ప్రముఖ సినీ నిర్మాత పోకూరి బాబూరావు, సినీ రచయిత మరుదూరి రాజా, దర్శక, నిర్మాత కోన వెంకట్ ఇలా వేలాది మంది ప్రముఖులు అక్షరాలు దిద్దింది అదే జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలోని పిశుపాటి వెంకట రంగయ్య నగర పాలక ఉన్నత పాఠశాల. 1925లో ప్రారంభమైన ఈ బడి లక్షలాది మందికి




విద్యాబుద్ధులు నేర్పింది. వచ్చే ఏడాది జనవరిలో శతాబ్ది ఉత్సవాలకు ముస్తాబవుతోంది.

**అక్షర బీజం పడిందిలా..**


కరవది జమీందారు పిశుపాటి బంగారుభొట్లు, వెంకట లక్ష్మమ్మ కుమారుడు వెంకటరంగయ్య ఆంగ్లేయుల పాలనలో నెల్లూరు జిల్లా బోర్డు సభ్యునిగా పనిచేశారు. 1898లో తన పేరిట ఒంగోలు నగరంలో ప్రాథమిక పాఠశాల ప్రారంభించి తరువాత దానిని పిశుపాటి వెంకట రంగయ్య హిందూ మిడిల్ స్కూలుగా అభివృద్ధి చేశారు. పాఠశాలకు సొంత భవన నిర్మాణం ప్రారంభించి 1922లో తన 51వ ఏట మరణించారు. అనంతరం ఆయన రెండో కుమారుడు వెంకట్రాయశర్మ పాఠశాల నిర్వహణ చేపట్టి 1925లో నూతన భవనంలో పాఠశాల నిర్వహించారు. 1950లో పాఠశాల పురపాలక సంఘంలో విలీనమైంది. నాటి నుంచి నేటి వరకు సరాసరిన 3 వేల మంది విద్యార్థులతో పాఠశాల కొనసాగుతోంది.

## రాను.. నే ఒంగోలుకు రాను!

ఒంగోలు : మేఘం కమ్ముకుందంటే ఒంగోలు నగరానికి వెళ్లేందుకు జిల్లావాసులు వెనుకంజ వేస్తారు... చినుకు పడిందంటే నగరంలోకి అడుగు పెట్టేందుకు భయపడతారు...అదే వర్షం కురిసిందంటే అటువైపే చూడరు.. ఇక భారీ వర్షాలు కురుస్తున్నాయంటే ప్రయాణం చేయాలనే ఆలోచననే మానుకుంటారు. ఇదీ జిల్లా కేంద్రం పరిస్థితి. జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరానికి వివిధ పనుల నిమిత్తం వచ్చినవారు బస్టాండులో అడుగుపెట్టగానే భయాందోళనకు గురవుతున్నారు. చిన్నపాటి వర్షానికే ఎదురుగా ఉన్న ప్రధాన రహదారి చెరువును తలపిస్తుండడంతో నగరంలో తిరిగేదెలాగని మదన పడుతున్నారు. నగరంలోని రహదారులు, వీధులు, కూడళ్లు సైతం ముంపు బారిన పడుతుండడంతో నగరవాసులే కాదు నగరానికి వచ్చినవారికి జలకష్టాలు తప్పడం లేదు.

నగర జనాభాను వణికించే పోతురాజు కాలువలో పూడికను ఈ ఏడాది చాలా వరకు తొలగించడంతో 40 కాలనీలకు కొంతమేర ముంపు సమస్య తప్పింది. వచ్చే ఏడాది వర్షాకాలానికి కథ మొదటికి రాకుండా కట్టలను పటిష్ఠం చేసేవిధంగా చర్యలు చేపట్టాల్సి ఉంది. తాజాగా బుధవారం పోతురాజు కాలువ కట్ట బఫర్ జోన్‌లో ఉన్న ఆక్రమ నిర్మాణాలను మేయర్, కమిషనర్ దగ్గరుండి తొలగించారు. కాలువ పరిధిలో అక్రమ నిర్మాణాలు తొలగిస్తేనే ముంపు సమస్య తప్పుతుంది. మరోవైపు కాలువను అనుకుని ఉన్న కాలనీల వాసులు దీన్ని డంపింగ్ యార్డులా మార్చేయడంతో ముంపు సమస్య ఎదురవుతోంది. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నీరు పారే మార్గాలపై ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపట్టడంతో మోకాలి లోతున వరదనీరు నిలిచిపోతోంది.

కారణాలెన్నో..ఒంగోలు బస్టాండు ఎదురుగా ఏళ్ల కిందట నిర్మించిన డ్రెయిన్ ఉన్నప్పటికీ సామర్థ్యం సరిపోవడంలేదు. అప్పట్లో ఆర్అండ్‌బీ అధికారులు డ్రెయిన్‌కు రహదారికి మధ్య కేబుళ్లు వేసేందుకు కాలువ మాదిరి నిర్మించారు. అసలు కాలువలోకి నీరు వెళ్లే మార్గం లేక వరదనీరు నిలిచిపోతోంది. ప్రస్తుతం రహదారికిరువైపులా రూ.కోటిన్నరతో కొత్తగా కాలువ నిర్మాణం చేపట్టేందుకు నగరపాలక సంస్థ అధికారులు సిద్ధమవుతున్నారు.చాలాచోట్ల దశాబ్దాల కిందట నిర్మించిన రహదారులు కావడంతో వాటి కంటే ఎత్తులో డ్రెయిన్లు ఉండటంతో వర్షాలకు రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి.డ్రెయిన్లు ఆక్రమించి



భారీ నిర్మాణాలు చేపట్టడంతో నీరు పారక ముంపు సమస్య ఎదురవుతోంది.నగరం అంతకంతకూ విస్తరిస్తున్నా, ఆ స్థాయిలో కాలువల నిర్మాణం జరగకపోవడంతో ముంపు ముప్పు తప్పడం లేదు.

**24 గంటలూ అత్యవసర సేవలు**

25 మంది సిబ్బందితో నగరపాలక సంస్థ సన్నద్ధం

సహాయం కోసం చేయాల్సిన నంబరు 08592227766

వర్షాలతో ఒంగోలు నగర పరిధిలో ఎటువంటి సమస్య ఎదురైనా అత్యవసర సమయంలో ఆదుకునేందుకు నగరపాలక సంస్థ 10 మంది ఇంజినీరింగ్, 15 మంది పారిశుద్ధ్య సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని నియమించింది. చెట్లు కూలినా, కాలువల్లో నీరు పారక ముంపు ఎదురైనా తక్షణం సహాయక చర్యలు చేపట్టనుంది. రెండు జేసీబీలు, నాలుగు కోత యంత్రాలను సిద్ధం చేసింది. కాల్ సెంటర్ ఏర్పాటు చేసి 24 గంటలపాటు ఫోన్ నంబరు అందుబాటులో ఉంచింది.

**కాలువల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి**

**– వెంకటేశ్వరరావు, కమిషనర్**

ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి కాలువల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాం. మొదటి ప్రాధాన్యంగా వీటికే నిధులు కేటాయిస్తున్నాం. రానున్న కాలంలో నగర వాసులకు ముంపు సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.

# 'పట్టు'కుంటే.. కట్టేస్తారంతే

ధర్మవరం : మందపు దారంతో నేసిన సిల్క్‌చీర, వాటి పైనే వర్క్, డిజైన్ వగైరా.. కట్టుకుంటే భుజాలు లాగేంత బరువు. ఇదంతా పాత స్టైల్. ఇప్పుడు మహిళలు, యువతుల అభిరుచి మారింది. బరువు అనగానే వద్దు అంటున్నారు. చీర ఎంత తేలికగా ఉంటే అంత సౌలభ్యం అనే రీతిలో ఆలోచనాధోరణి ఉంది. ప్రధానంగా అందానికి పట్టు, సౌలభ్యతకు తేలిక అనే కోణంలో యువతులు మొగ్గు చూపుతున్నారు. ఈ మార్పును ధర్మవరం డిజైనర్లు అందిపుచ్చుకుని చీరలను తీర్చిదిద్దుతున్నారు. పెరుగుతున్న అమ్మకాలు మగువ మనసును చెప్పకనే చెబుతున్నాయి.

**డిమాండ్ వేటికి**

ఆరు నెలల నుంచి అంచులేని, చిన్నబార్డర్ ఉన్న పట్టుచీరలు కావాలని మహారాష్ట్ర, దిల్లీ, హరియాణా, కేరళ, కర్ణాటక రాష్ట్రాల నుంచి ఆర్డర్లు



వస్తున్నాయి. చిన్న బుట్టాలు కలిగిన జరీ స్థానంలో థ్రెడ్ (పట్టుదారం) కాంట్రాస్ట్ చీరలు, ప్లెయిన్ బుట్టా, బార్డర్ లెస్, చిన్న బార్డర్, లైట్ కలర్స్, థ్రెడ్ బార్డర్, ప్లెయిన్ కాంట్రాస్ట్, జరీ చెక్స్ చీరలకు విపరీత డిమాండ్ వస్తోంది.

మగ్గానికి ఏర్పాటు చేసుకున్న 3 కొమ్ముల సాయంతో పట్టు చీరలు నేస్తున్నారు. జాకెట్, కొంగు రెండువైపులా అంచులు అన్నీ ఒకే రంగులో రూపొందిస్తున్నారు. చీరలో వచ్చే రంగు బ్లౌజ్, కొంగు, బార్డర్‌లో కలవకుండా ఆకర్షణీయంగా తయారు చేస్తున్నారు.

900–1000 గ్రాములు : సాధారణ పట్టుచీర బరువు

500–600 గ్రా...: ప్రస్తుతం బరువు తగ్గిన తరువాత

10–15 రోజులు: తేలిక చీర తయారీకి పట్టే సమయం

ఎగుమతులు: ఆరు నెలల నుంచి పెరుగుదల

# శ్రీసిటీ వాకిట.. సిరి వనం

వరదయ్యపాళెం : శ్రీసిటీ పరిశ్రమల సామ్రాజ్యం. ఇక్కడ కేవలం కర్మాగారాలే ఉంటాయనుకుంటే పొరపాటే. పచ్చదనానికి నిలయంగా మారడం విశేషం. దేశంలోనే అత్యంత ప్రసిద్ధి చెందిన ఏజీబీసీ సంస్థ ద్వారా గ్రీన్‌సిటీ గోల్డ్ రేటింగ్ అవార్డు సైతం దక్కింది. పర్యావరణానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ హరితవనంలా తీర్చిదిద్దుతుండటమే ప్రధాన కారణం. జపాన్ మియావాకీ విధానంలో మొక్కలు పెంచడంతో అవి ఇప్పుడు వృక్షాలుగా ఎదిగి అడవిని తలపిస్తుండటం గమనార్హం.

**సామాజిక ప్రయోజనం..**

పరిశ్రమలు నెలకొల్పే స్థలంలో చెట్లను కొట్టివేస్తుంటారు. పచ్చదనం అన్న మాటే ఉండదు. ఇలా సాధారణంగా పారిశ్రామిక వాడల్లో కనిపించే పరిస్థితి. కానీ ఆదర్శ సెజ్‌గా పేరొందిన శ్రీసిటీలో ఇందుకు భిన్నమైన వాతావరణం కనిపిస్తుంది. అత్యంత విలువైన భూముల్లో కృత్రిమ అడవులను సృష్టించగా, పచ్చదనం పరిఢవిల్లుతోంది.



సెజ్ విస్తరించిన ప్రతి గ్రామంలో ఎకరాకు పైగా భూమిని కేటాయించి మొక్కలు నాటి సంరక్షించారు. అవి ఇప్పుడు అడవిని తలపిస్తున్నాయి. దారికి ఇరువైపులా పచ్చదనం కనిపిస్తుంది.

ప్రతి పరిశ్రమలోనూ పచ్చదనానికి ప్రాధాన్యం ఇస్తున్నారు.

ప్రత్యేకంగా 25 ఎకరాలు కేటాయించగా, నర్సరీ ఏర్పాటు చేసి వివిధ రకాల మొక్కలు పెంచారు.

**నందనవనంలా తీర్చిదిద్దడమే..**

– రవీంద్రసన్నారెడ్డి, ఎండీ, శ్రీసిటీ

పరిశ్రమల స్థాపనే ధ్యేయంగా ఏర్పాటైన శ్రీసిటీని ఓ నందనవనంలా తీర్చిదిద్దడమే మా ఆశయం. ఇందుకు ప్రత్యేకంగా భూములను కేటాయించి కృత్రిమ అడువులను సృష్టించాం. ప్రకృతివనంలా తీర్చిదిద్దడంతో అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలను సైతం ఆకట్టుకుంటోంది. శ్రీసిటీ గ్రీన్‌సిటీగా పేరొందడం ఎంతో సంతోషాన్నిస్తోంది.

# 'ఎడతెగని' వానలు

చిత్తూరు : అల్పపీడనంతో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల జిల్లాలో జనజీవనం అతలాకుతలమైంది. పలు మార్గాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. చిత్తూరు నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జిల్లాలో పలుచోట్ల పొలాలు దెబ్బతిన్నాయి. చెరువులు, వాగులు, నదులు పొంగిపొర్లుతున్నాయి. మొత్తం 24 చెరువులకు గండ్లు పడ్డాయి. వాటికి అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. అత్యధికంగా గూడూరులో 107.2, విజయపురం మండలంలో 99.2 మి.మీ. కురవగా, అత్యల్పంగా పెద్దపంజాణిలో 16.6 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. పెనుమూరు 86.6, కార్వేటినగరం 80.4, వెదురుకుప్పం 79.4, పూతలపట్టు 79.2, నింద్ర 70.4, ఐరాల 59.6, నగరి 54.8, రొంపిచెర్ల 40.6 మి.మీ.ల వర్షపాతం నమోదైంది.

**స్తంభించిన రాకపోకలు**

సోమల మండలంలోని పెద్దఉప్పరపల్లె, దేవలకుప్పం, పేటూరు, బోనమంద, పొలికిమాకులపల్లె తదితర ఎగువ ప్రాంతాలలో మంగళవారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. దీంతో బుధవారం పెద్దఉప్పరపల్లె– చౌడేపల్లె మార్గంలో సీతమ్మచెరువు వంక ఉద్ధృతంగా ప్రవహించింది. ఈ మార్గంలో రాకపోకలు స్తంభించాయి. గార్గేయనది ఉగ్రరూపం దాల్చడంతో పెద్దఉప్పరపల్లె–బసవపల్లె మధ్య రాకపోకలు నిలిచాయి. ఆవులపల్లె–పెద్దఉప్పరపల్లె మధ్యలో వంతెనపై ఆర్టీసీ బస్సు దాటుతుండగా హఠాత్తుగా సీతమ్మచెరువు ప్రవాహం పెరిగింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి ప్రమాదాన్ని తప్పించారు.

కార్వేటినగరం మండలంలోని కృష్ణాపురం ప్రాజెక్టు గేట్లు రెండింటిని ఎత్తి వరదను కుశస్థలి నదిలోకి బుధవారం విడుదల చేశారు.

పుత్తూరు మండలం నేషనూరు పరిధిలోని మూలకోన అటవీప్రాంతం నుంచి నీటి ఉద్ధృతి జోరుగా ఉంది. అక్కడి చెక్‌పోస్టును మూసివేశారు. వడమాలపేట మండలంలోని అత్తూరు–కల్లూరు రోడ్డు కల్వర్టుపై భారీగా నీరు చేరింది.

# పేదల స్థలం.. వైకాపా నేతల పరం



గుత్తి : పేదల నిలువ నీడ కోసం ప్రభుత్వం నివేశన స్థలాన్ని కేటాయించగా వైకాపా నాయకులు గద్దల్లా తన్నుకుపోయారు. రూ.కోట్లు విలువైన జాగాను కబ్జా చేశారు. కాసులకు కక్కుర్తిపడిన కొందరు రెవెన్యూ అధికారులు.. అక్రమార్కులకు కట్టబెట్టారు. గుత్తి పట్టణ శివారులోని పాత హైవేకు ఆనుకుని ఉన్న సర్వే నంబరు 347లో సుమారు 17 ఎకరాలు ఉంది. ప్రస్తుతం ఇక్కడ ఎకరా రూ.5 కోట్ల వరకు పలుకుతోంది. రాష్ట్ర ప్రభుత్వం 1996 సంవత్సరం (హెచ్.నంబరు 29–1405), జనవరిలో సుమారు 1,200 మంది పేదలకు నివేశన స్థలాలను ఇచ్చింది. నీటి సౌకర్యం, సొమ్ములేక లబ్ధిదారులు సదరు స్థలంలో ఇళ్లను నిర్మించుకోలేదు. దీంతో నాయకులు కన్నేశారు. నివేశన స్థలాన్ని సాగు భూమిగా చూపి సొంతం చేసుకున్నారు. ఇటీవల అధికారులతోపాటు ప్రభుత్వ పెద్దలకు లబ్ధిదారులు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది.

**పని మనిషి పేరుతో..**

గుత్తికి చెందిన అప్పటి తహసీల్దారు రోషన్.. పేదలకు స్థలాలు కేటాయించి.. పట్టాలు మంజూరు చేశారు. వాటిని రద్దు చేయకనే 2023లో ఓ నాయకుడు తన పలుకుబడిని ఉపయోగించి అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. తన ఇంటిలో పని చేసే మహిళ పేరుతో వన్–బీ, పట్టాదారు పాసుపుస్తకాన్ని సృష్టించి... ఆమె నుంచి కొనుగోలు చేసినట్లు దస్త్రాలు తయారు చేసుకున్నాడు.

కడప జిల్లా పచ్చికలపాడు గ్రామానికి చెందిన మధుసూదన్‌రెడ్డి జనరల్ పవర్ ఆఫ్ అటార్నీతో గుత్తికి చెందిన నలుగురు వైకాపా నాయకులు ఎలాంటి లింకు డాక్యుమెంట్లు లేకున్నా తాడిపత్రి, గుత్తిలో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. మొత్తానికి 2.21 ఎకరాల భూమిని సొంతం చేసుకున్నారు.

ఈక్రమంలో మరో నాయకుడు ఈ వ్యవహారాన్ని తెలుసుకుని తన ఇంటిలోని పని మనిషి పేరుతో అడంగల్, వన్–బీ సృష్టించాడు. తన పేరిట గుత్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. మిగిలిన భూమిని సైతం ఇతరులు కాజేశారు. వైకాపాకు చెందిన ఓ మైనారిటీ నాయకుడితోపాటు మరో నాయకుడు పేదలకు ఇచ్చిన భూమిని సబ్‌డివిజన్ చేయించుకుని డి–పట్టాలు పొందారు. రిజిస్ట్రేషన్, రెవెన్యూ అధికారులకు రూ.లక్షల్లో ముడుపులు ముట్టాయన్న ఆరోపణలు ఉన్నాయి.

**విచారించి తగిన చర్యలు తీసుకుంటాం**

శ్రీనివాస్, ఆర్డీవో, గుంతకల్లు నివేశన స్థలాల ఆక్రమణలపై సమగ్ర విచారణ చేయిస్తాం. తహసీల్దారుకు పట్టాలు, ఆధార్ కార్డుల ప్రతులను ఇస్తే లబ్ధిదారులకు న్యాయం చేస్తాం. పేదల స్థలాలు అన్యాక్రాంతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

# ఉల్లం'ఘనుల'పై ఉక్కుపాదం




తిరుపతి : ఆదాయార్జన శాఖలైన ఎక్సైజ్, గనులు, వాణిజ్య పన్నులు, రెవెన్యూ, తదితర శాఖలపై ముఖ్యమంత్రి చంద్రబాబు తరచూ సమీక్షిస్తున్నారు. ఈ క్రమంలోనే చిత్తూరు జిల్లాలో అనుమతులున్న, అనధికారికంగా నడుపుతున్న క్వారీల నిగ్గు తేల్చాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. అనంతరం ఉల్లంఘనలకు పాల్పడిన సంస్థలను ంచి జరిమానా, సీనరేజీ వసూలు చేయాలని గనుల శాఖ అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు అనుమతులు పొందిన 38 క్వారీలవారు పరిధికి మించి తవ్వకాలకు పాల్పడ్డారని తేలింది. తిరుపతి జిల్లాలోనూ గూడూరు డివిజన్‌లో ఇలాంటి అతిక్రమణలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో అక్కడా తనిఖీలు చేయాల్సి ఉంది.

**ఆరు బృందాలు.. 685 గనులు**

చిత్తూరు, పలమనేరు డివిజన్ గనుల శాఖ పరిధిలో ఈ ఏడాది జులై 31 నాటికి 685 క్వారీలున్నాయి. కలెక్టర్ ఆదేశాలతో ఆరు బృందాలు మూడు నెలల కిందట రంగంలోకి దిగాయి. కడపలోని రీజినల్ విజిలెన్స్ స్క్వాడ్ అధికారులతోపాటు రాయల్టీ ఇన్‌స్పెక్టర్లు, సాంకేతిక సహాయకులు తనిఖీలు చేశారు. ఈ ఏడాది అక్టోబరు 15 నాటికి చిత్తూరు డివిజన్‌లోని 433 క్వారీలకుగాను 341 చోట్ల తనిఖీలు పూర్తయ్యాయి.

**చిత్తూరు డివిజన్‌లోనే 30**

చిత్తూరు డివిజన్‌లో అనుమతులున్న 30 క్వారీల్లో పరిధికి మించి తవ్వారు. నగరిలో 13, వెదురుకుప్పం 5, తవణంపల్లె మూడు, ఐరాల, పూతలపట్టు, ఎస్ఆర్‌పురంలో రెండేసి, మిగతాచోట్ల ఒకటి చొప్పున గనుల్లో ఉల్లంఘనలు చోటుచేసుకున్నాయి. రామకుప్పంలో 3, వి.కోట 2, కుప్పం, చౌడేపల్లె, పుంగనూరులలో 8 మంది లీజుదారులకు నోటీసులిచ్చారు.

**సిలికాలోనూ ఇదేవిధంగా** గూడూరు డివిజన్‌లో సిలికా తవ్వకాల్లో అక్రమాలు కొనసాగుతున్నాయి. అనుమతులు ముగిశాక కూడా ఇక్కడ తవ్వుతున్నారు. స్థానిక నేతల మద్దతుతోనే ఈ దందా జరుగుతోంది. సత్యవేడు, చంద్రగిరి నియోజకవర్గాల్లో మాఫియా రెచ్చిపోతోంది. అధికారులకు ఫిర్యాదు వచ్చినప్పుడు ఒకట్రెండు వాహనాలను స్వాధీనం చేసుకుని చేతులు దులిపేసుకుంటున్నారు. ఇక్కడా తనిఖీలు చేస్తేనే ఖజానాకు డబ్బు వస్తుంది.

# ఇది.. 14 నెలల మహా యజ్ఞం!




సింధియా: సాగర జలాల (బ్యాక్ వాటర్) పాయ.. మేహాద్రి గెడ్డ జలాలు కలిసే ప్రాంతం గతంలో రవాణాకు చాలా కీలకంగా ఉండేది. రహదారుల సౌకర్యం అంతగా లేని ఆరు దశాబ్దాల కిందట పడవలపై ఈ పాయ దాటి విశాఖపట్నం–గాజువాక మధ్య రాకపోకలు సాగేవి. నేవల్ డాక్ యార్డు వద్ద 1960లో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ రైలు, రోడ్డు వంతెనలను ప్రభుత్వం నిర్మించింది. ఇంధన, రసాయన, నిత్యావసర వస్తువుల రవాణాలో ఈ వారధి అమూల్య సేవలందించింది. కాల క్రమంలో వంతెన బలహీన పడింది. దీంతో మరమ్మతులు అనివార్యమయ్యాయి. దాదాపు 14 నెలలుగా సాగుతున్న పనులు కొలిక్కివచ్చాయి. నగరంలో ఎప్పుడూ లేని రీతిలో ఓ వంతెన పనులకు ఇంత గడువు తీసుకొని ఎట్టకేలకు పూర్తి చేశారు.

2024, ఆగస్టు1: వంతెనను పోర్టు యాజమాన్యం పూర్తిగా మూసివేసింది. ప్రజా రవాణాకు డాక్‌యార్డు సమీప సీడబ్ల్యూసీ గోదాముల నుంచి మారుతి కూడలి మీదుగా అటు షీలానగర్, ఇటు కాన్వెంటు కూడలికి చేరుకునేలా ప్రత్యామ్నాయాన్ని సూచించింది.

9 నెలలు: మొత్తం మరమ్మతులు పూర్తి చేయాలనుకున్న కాలం.

రూ. 23 కోట్లు: తొలుత ఇంత వ్యయంతో పనులకు ప్రతిపాదించారు. చివరికి పనుల విలువ రూ.30 కోట్లకు చేరింది.

60,000: ప్రస్తుతం రోజుకి కనీసం ఇన్ని వాహనాలు ప్రయాణిస్తాయని అంచనా. 12,500: గతంలో నిత్యం ఈ వంతెనపై తిరిగే వాహనాల సంఖ్య. అలా ఆటంకం: వంతెన కింద సాగర జలాలు, బంకమట్టి.. మరోవైపు చౌడు నేల నేపథ్యంలో స్తంభాలు కుంగాయి. పోర్టు ట్రస్టు యాజయాన్యం చెన్నైకి చెందిన 'ఎస్ఈఆర్‌సీ' సంస్థతో వంతెన పటిష్ఠత, సామర్థ్యంపై పరీక్షలు నిర్వహించింది. వంతెన బాగా బలహీన పడినట్టు 2019 సెప్టెంబరులో నివేదిక ఇచ్చింది. దీంతో భారీ వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది.

రూ. 2 కోట్లు: రాత్రి వేళ వంతెనపై ప్రయాణం భద్రంగా సాగేందుకు ఇంత వ్యయంతో సీసీ కెమెరాలు, విద్యుద్దీపాలను ఏర్పాటు చేశారు. కొన్నాళ్లు ఒక వైపే: నవంబరు ఒకటి లేదా రెండో తేదీన ఈ వంతెనపై రాకపోకలకు మళ్లీ అనుమతిస్తారని సమాచారం. గాజువాక, సింధియా నుంచి నగరానికి వంతెన మీదుగా వెళ్లేందుకు అనుమతిస్తారు. 'సాగరమాల' ప్రాజెక్టు పనులు సాగుతున్నందున తిరుగు ప్రయాణంలో ఇటు వచ్చేందుకు అప్పుడే వీలు కాదు. పెట్రోపార్కు, ఐఎన్ఎస్ డేగా, మారుతి కూడలి మీదుగానే రావాల్సి ఉంటుంది.


# అవినీతి జాఢ్యం.. స్పందన శూన్యం!

తిరుపతి : తిరుపతి ఏసీబీ ఫోన్ నంబర్లు: 94404 46130 94404 46193 మీ పేరిట భూమి మారాలా? డబ్బు ఇవ్వాల్సిందే. మీ పదోన్నతి దస్త్రం కదలాలా? చేతులు తడపాల్సిందే. బిల్లులు మంజూరు చేయాలా? పర్సంటేజీ పంపాల్సిందే. కేసులో పేరు మాయం చేయాలా? ముడుపులు తాకించాల్సిందే.

–ఇలా డిమాండ్ చేసి దండుకోవడం నేరమని తెలిసినా.. అవినీతి ఆగడం లేదు. పనులు త్వరగా పూర్తి కావాలని అడిగింది ఇచ్చేస్తూ ప్రజలు సైతం అవినీతికి ఆజ్యం పోస్తున్నారు.

కొంతిద్దాం.. పని చేసుకుందాం: ప్రజల పనులు చేయడానికే ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారనే విషయం పక్కకు వెళ్లింది. ఎవరూ ఊరికే ఏమీ చేయరు. మన పని కావాలంటే అడిగిన దాంట్లో కొంతిచ్చి త్వరగా పని పూర్తి చేసుకుందామనే ధోరణిలో ప్రజలు ఉంటున్నారు. డబ్బు ఎందుకు ఇవ్వాలని ఎదురు తిరిగితే.. ఆ దస్త్రం లేదు, ఈ కాగితం తేవాలంటూ కొర్రీలు వేస్తూ వేధిస్తారు.

తొలి స్థానంలో రెవెన్యూ: 2020 నుంచి ఇప్పటి వరకు తిరుపతి



ప్రాంతీయ అవినీతి నిరోదక శాఖ (ఏసీబీ) పరిధిలో 40 కేసులు నమోదయ్యాయి. మొదటి స్థానంలో రెవెన్యూ శాఖ ఉంది. తర్వాత స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ, అటవీ, వైద్య ఆరోగ్య, మున్సిపల్ కార్పొరేషన్, పోలీసు, ఆర్టీఏ, పంచాయతీ రాజ్ శాఖలు నిలిచాయి. ఐదేళ్లుగా కేసులు: ఏసీబీ కేసుల విచారణలోనూ జాప్యం జరుగుతోంది. నెల్లూరు ఏసీబీ కోర్టుకు రెగ్యులర్ న్యాయమూర్తి లేకపోవడంతో.. ఆ ప్రభావం కేసుల విచారణపై పడుతోంది.

ఫిర్యాదులు చేయాలి: ఉద్యోగులు లంచం అడిగినా.. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినా ఏసీబీకి ఫిర్యాదు చేయొచ్చు.

# ఈట్ స్ట్రీట్‌లో ఎంచక్కా తినేయొచ్చు..!

తిరుపతి : ఈట్‌స్ట్రీట్.. వివిధ రకాల ఆహారం అంతా ఒకే చోట లభ్యమయ్యే ప్రదేశం. తిరుపతిలో ఇది త్వరలో అందుబాటులోకి రానుంది. రేణిగుంట మార్గంలో దీన్ని ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. అప్పట్లో ఇది కార్యరూపం దాల్చలేదు. నగరానికి దూరంగా ఏర్పాటు చేస్తే నగరవాసులకు వెళ్లలేరని అధికారులు భావించారు. దీంతో తిరుపతిలో అనువైన ప్రాంతాల ఎంపికకు కసరత్తు చేశారు. ఇస్కాన్ మార్గం, శ్రీనివాసం పరిసరాలు తదితర ప్రాంతాలను పరిశీలించారు. చివరకు నగరపాలిక కార్యాలయం ఎదురుగా నిర్మించిన మాస్టర్‌ప్లాన్ రోడ్డులో ఈట్‌స్ట్రీట్ ఏర్పాటుకు నిర్ణయించారు.



**రూ.కోటితో సౌకర్యాల కల్పన**

ప్రస్తుతం నిర్దేశిత ప్రాంతాన్ని వాహనాల పార్కింగ్‌కు వినియోగిస్తున్నారు. ఈ దారికి ఇరువైపులా శాశ్వత దుకాణాలు నిర్మించి ఆహార పదార్థాల తయారీ, విక్రయాలు ప్రారంభించనున్నారు. పిల్లలకు ఆహ్లాదం అందించడానికి పలు వసతులు కల్పించేలా అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇప్పటికే నమూనాను ఇంజినీరింగ్ అధికారులు సిద్ధం చేస్తున్నారు. 15 రోజుల్లో పనులు ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు. నిరంతరం కొనసాగేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

**పారదర్శకంగా దుకాణాల కేటాయింపు**

– ఎన్.మౌర్య, కమిషనర్ఈట్‌స్ట్రీట్ ఏర్పాటుకు స్థలాన్ని నిర్ణయించాం. పనుల ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నాం. పారదర్శకంగా దుకాణాలు కేటాయిస్తాం. ఇందుకు టెండరు వేస్తాం. దీనికి వచ్చే ఆదరణకు అనుగుణంగా మరోటి ఏర్పాటుచేస్తాం.

# జమదానీ.. అందాల గని

పాయకరావుపేట: జమదానీ చీరలకు ఉప్పాడ ప్రసిద్ధి. వారికి దీటుగా ఎన్నో ఏళ్ల నుంచి పాయకరావుపేట చేనేత కార్మికులు ఆ చీరలు నేస్తున్నారు. ఆప్కోకు సరఫరా చేస్తూ ప్రత్యేకత చాటుకుంటున్నారు. అందం, నాణ్యతతో మహిళల మనసు గెలుచుకుంటున్న చీరలకు మరింత ప్రాచుర్యం తీసుకువచ్చేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వినియోగదారులకు మరింత చేరువ చేయడంతో పాటు చేనేత కార్మికులకు చేతినిండా పని కల్పించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. జమదానీ చీర అంటే ఆడవాళ్లు ఎంతో ఇష్టపడుతుంటారు. దీని తయారీకి ప్రత్యేక మగ్గాలు వాడతారు. పాయకరావుపేటలో 60 మంది కార్మికులు దీనిలో ప్రత్యేకత చాటుకుంటున్నారు. ఒక్కోచీర తయారీకి డిజైన్ ఆధారంగా 15 నుంచి నెల రోజులు పడుతుంది. ముగ్గురు కార్మికులు శ్రమించాలి. ఇటీవల



చేనేత సంఘాన్ని సందర్శించిన హోంమంత్రి వంగలపూడి అనిత, కలెక్టర్ విజయకృష్ణన్ చీరల ప్రత్యేకత చూసి ఆశ్చర్యపోయారు. వీటికి మార్కెటింగ్ సౌకర్యం కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీనిలో భాగంగా పెద్దమాల్స్, భారీ వస్త్ర దుకాణాల యాజమాన్యాలతో చర్చించే దిశగా అడుగులు వేస్తున్నారు. వ్యాపార సంస్థల అవసరాలకు అనుగుణంగా సొసైటీ నుంచి చీరలు సరఫరా చేసే విధంగా ఒప్పందం చేసుకునే ప్రయత్నాలు సాగుతున్నాయి. హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ మార్కెటింగ్ పెంచేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

# బీమా లేక.. తగ్గిన ధీమా

ఎమ్మిగనూరు : ఉమ్మడి జిల్లాలో వందలాది కుటుంబాలు గొర్రెలు, మేకల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నాయి. వ్యవసాయ అనుబంధ రంగమైన జీవాల పెంపకం ద్వారా లక్షలాది గొర్రెలు, మేకలు పెంచుతూ జీవిస్తున్నారు. ప్రభుత్వం తక్కువ ప్రీమియంకు బీమా పెట్టినా.. జీవాల యజమానులు అవగాహన లేక బీమా చేయించుకోవడం లేదు. తాజాగా గొర్రెలు మృతి చెందిన యజమానులు బీమా చేయించుకోక పోవడంతో నష్టపరిహారం రాని పరిస్థితి నెలకొంది.

**ఉమ్మడి జిల్లాలో 20లక్షల జీవాలు**

ఉమ్మడి జిల్లాలో గొర్రెలు, మేకలు కలిపి 20 లక్షల వరకు ఉన్నట్లు పశుసంవర్ధకశాఖ అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా కర్నూలు జిల్లాలో మైదానం, బీడు భూములు, కొండలు, గుట్టలు అధికంగా ఉన్నాయి. చాలా మంది రైతులకు వ్యవసాయ భూమి లేక అనుబంధ రంగమైన జీవాల పెంపకం ద్వారా జీవనం సాగిస్తున్నాయి. ఈ రంగాన్ని బలోపేతం చేసేందుకు ఎమ్మిగనూరు మండలంలోని బనవాసిఫారం వద్ద రూ.6కోట్లతో మేకపోతుల వీర్య కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే చాలా నిర్మాణ పనులు పూర్తయ్యాయి.

**ఏడాదికి రూ.36 చెల్లిస్తే..**

గొర్రెలు, మేకల బీమా కోసం బీపీఎల్, ఎస్సీ, ఎస్టీలు ఏడాదికి రూ.36, రెండేళ్లకు రూ.54, మూడేళ్లకు రూ.75 కట్టాలి. ఇతర యజమానులు రూ.90లు, రెండేళ్లకు రూ.135లు, మూడేళ్లకు రూ.187లు చెల్లించాలి. ప్రకృతి వైపరీత్యాలు, ఇతర వ్యాధులతో చనిపోతే గొర్రె,



మేకు రూ.6వేల పరిహారం అందజేస్తారు.

**రైతులకు అవగాహన లేక**

జిల్లాలో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు సోగనూరులో 90గొర్రెలు, హాల్వి, కోసిగిలో దాదాపు 30కి పైగా గొర్రెలు చనిపోయాయి. సోగనూరులో జీవాల యజమానులు బీమా చేయించుకోలేదని పశుసంవర్ధకశాఖ సిబ్బంది తెలిపారు. జీవాల పెంపకందార్లు రూ.10లక్షల దాక నష్టపోయినా.. పరిహారం పొందలేని పరిస్థితి.

**అధిక వర్షాలతో మృత్యు గండం**

జిల్లాలో జీవాల పెంపకందార్లు అడవిలో మేపుకొచ్చి రాత్రి సమయంలో కంచెగా ఏర్పాటు చేసిన దొడ్డిలో ఉంచుతారు. వేసవి కాలంలో అయితే పొలాల్లో సేంద్రియ సత్తువ కోసం మంద కడతారు. అందుకు మందలోని గొర్రెల సంఖ్యను బట్టి రోజుకు రూ.1000 నుంచి రూ.5వేల వరకు ఇస్తారు. అధిక వర్షాలు మూగజీవాల పాలిట మృత్యుగండంగా మారుతోంది. ఎడతెరిపి లేకుండా కురిసిన వానకు అవి తడిసి చలిగాలులకు మేత లేక మృత్యువాతపడి పెంపకందార్లు నష్టపోతున్నారు. వేసవిలో అధిక ఎండలు ఉండే సమయాల్లో చెట్లు ఇతర చోట్ల మందను ఆపి కాపాడుకుంటారు. వర్షాకాలంలో వందలాది గొర్రెలు కాపాడుకోలేక రైతులు అవస్థలు పడుతున్నారు. బీమా ద్వారానైనా జీవాల పెంపకందార్లకు ధీమా కలిగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# నిధులొస్తేనే నీళ్లు

పార్వతీపురం: 'ఉమ్మడి జిల్లాలో చేపడుతున్న తోటపల్లి పనులు 95 శాతం పూర్తయ్యాయి, కేవలం అయిదు శాతం మాత్రమే మిగిలి ఉన్నాయి.'..ఇదీ ఇటీవల జలవనరుల శాఖ ప్రభుత్వానికి ఇచ్చిన నివేదిక. వాస్తవం..: తోటపల్లి జలాశయం నిర్మాణం అసంపూర్తి పనులతో నిలిచిపోయింది. పదేళ్లుగా కాలువల నిర్వహణ లేదు. లైనింగు పనులు చేపట్టే ప్రతిపాదనకు మోక్షం లేదు. ఉమ్మడి జిల్లా జీవనాడి అయిన తోటపల్లి జలాశయం కాలువల పనులు అడుగు ముందుకు.. ఆరడుగులు వెనక్కి అన్నట్లు సాగాయి.

రెండు లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టుకు నీరందించే ఈ ప్రాజెక్టుకు గత తెదేపా ప్రభుత్వంలో పార్వతీపురం డివిజనులో రూ.60 కోట్లు, విజయనగరం డివిజనులో దాదాపు రూ.70 కోట్ల పనులు మంజూరు చేశారు. తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వంలో ఈ పనుల్లో పురోగతి లేకుండా పోయింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం 25 శాతంలోపు జరిగిన పనులను రద్దు చేయాలని నిర్ణయించింది. పనుల అవసరాన్ని జలవనరులశాఖ ప్రభుత్వానికి నివేదించి, కొనసాగించేందుకు అనుమతి కోరింది. 2026 జూన్ వరకు నిర్వహించేందుకు గడువు ఉంది.

**అవునక.. కాదనక..**

జలాశయాల పరిధి రద్దు చేసిన, కొనసాగించాల్సిన పనులకు సంబంధించి ప్రభుత్వం వేర్వేరు ఉత్తర్వులిచ్చింది. ఈ రెండు జాబితాల్లోనూ తోటపల్లి పనుల్లేవు. దీంతో నిర్మాణాలు చేపట్టాలా? ఆపేయాలా? అన్న సందేహం అధికారుల్లో వ్యక్తమవుతోంది. బిల్లుల చెల్లింపునకు పీఏవో కార్యాలయానికి సమర్పించినా, వారు అనుమతించడం లేదని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు.

పార్వతీపురం డివిజన్ పరిధిలోని 48.88 కిలోమీటర్ల పొడవున ప్రధాన కాలువ ఉంది. ఇందులో 20 కి.మీ.పరిధి పూడికలు తీయాల్సి ఉండగా.. 12 కి.మీ.వరకే పనులు పూర్తయ్యాయి. వీటికి ఎస్డీఎం నిధుల నుంచి రూ.2.93 కోట్లు మంజూరు చేశారు. గుత్తేదారులు మధ్యలో ఆపేశారు. ప్రధాన కాలువలో 1,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేసే సామర్థ్యం ఉన్నా 800 క్యూసెక్కులకు మించి విడుదల సాధ్యం కావడం లేదు. తక్కువ వదిలితే శివారు పొలాలకు నీరందని దుస్థితి. కాలువను పూర్తిస్థాయిలో లైనింగ్ చేయడానికి వీలుగా రూ.99 కోట్లతో ప్రతిపాదించారు. ఇవి మంజూరైతే నీరు సక్రమంగా పారుతుంది.

ప్రభుత్వ పరిశీలనలో ఉంది

తోటపల్లి పనులను కొనసాగించే అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. ఉన్నతాధికారుల ఆదేశాలతో గడువు లోగా పూర్తిచేసేలా సిద్ధమవుతున్నాం. ఎస్డీఎం పనులు ఇంకా నాలుగు చోట్ల ప్రారంభం కాలేదు. రానున్న ఖరీఫ్‌కు తోటపల్లి పూర్తిస్థాయిలో సిద్ధమవుతుంది. హెచ్.మన్మథరావు,ఈఈ, తోటపల్లి ప్రాజెక్టు

ఇదీ పనుల తీరు:

అంచనా విలువ: రూ.59.58 కోట్లు

ఒప్పందం కుదిరినది: రూ.52.52 కోట్లు

ఇప్పటి జరిగిన పనులు: 18 శాతం

వాటి విలువ: రూ.9.90కోట్లు

నిర్మించాల్సిన స్ట్రక్చర్లు: 530

నిర్మించినది: 138

# ప్రకాశించని పర్యాటకం!



కొత్తపట్నం : జిల్లాలో విశాలమైన కోస్తా తీరప్రాంతం ఉన్నా గత వైకాపా ప్రభుత్వం పర్యాటక రంగంపై నిర్లక్ష్యం వహించింది. గుండ్లకమ్మ జలాశయంతోపాటు బైరవకోన పర్యాటక ప్రాంతంగా గుర్తింపు ఉంది. 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలో వచ్చిన నిధులతో చేపట్టిన పనులే నేటికీ దర్శనమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో ప్రాధాన్యమిస్తూ గతేడాది జిల్లాలో పర్యాటక అభివృద్ధికి రూ.33.50 కోట్లతో అంచనా రూపొందించింది. ఏడాది గడిచినా నేటికీ నిధుల ఊసేలేదు. నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

**సముద్రతీరాల్లో వసతుల లేమి**

జిల్లాలో కొత్తపట్నం, పాకల సముద్రతీరాలున్నాయి. ఇక్కడ విశ్రాంత గదులు గానీ, వ్యక్తిగత మరుగుదొడ్లు గానీ లేవు. 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలో పాకల సముద్రతీరంలో విశ్రాంతి భవనం, రెస్టారెంట్, సీసీ రోడ్డు, ఎల్ఈడీ దీపాలు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ నిమిత్తం రూ.4 కోట్ల నిధులు మంజూరు కాగాబీ తొలి విడతగా రూ.1.60 కోట్లతో పనులు చేపట్టారు. అనంతరం నిధుల్లేక పనులు నిలిచిపోయాయి. 2024-25 సంవత్సరానికి అసంపూర్తి పనుల పూర్తికి రూ.3 కోట్లతో ప్రతిపాదించారు. పాకల సముద్రతీరం అభివృద్ధి నిమిత్తం మరో 15 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. కాటేజీలు, రెస్టారెంట్, పార్కు, బల్లల ఏర్పాటుతోపాటు సుందరీకరణగా తీర్చిదిద్దేందుకు రూ.8 కోట్లతో అంచనా వేశారు. ఈ ఏడాది కొత్తపట్నంలో అతిథి గృహం నిర్మాణ నిమిత్తం రూ.6 కోట్లతో ప్రతిపాదించారు.

**పుణ్యక్షేత్రాల్లో కానరాని ప్రగతి**

బైరవకోనలో త్రిముఖ దుర్గాంబదేవి కొలువై ఉన్నారు. పక్కనే జలపాతం ఉంది. 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలో అక్కడ పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కాగా, అందులో విశ్రాంతి గదులు, కాటేజీలు, పరిపాలన భవన నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి. అదనపు గదులు, రెస్టారెంట్ నిర్మాణ నిమ్తితం రూ.కోటితో అంచనా వేశారు. త్రిపురాంతకంలోని బాలాత్రిపురసుందరీదేవి ఆలయ అవరణలో కాటేజీలు, పార్క్ అభివృద్ధికి రూ.1.50 కోట్లతో అంచనా వేశారు. **గుండ్లకమ్మ ఆహ్లాదమెన్నడో?**

గుండ్లకమ్మ జలాశయం వద్ద 2009లో బోటింగ్ ఏర్పాటు చేశారు. అన్నంగి వద్ద 13 ఎకరాలు కేటాయించారు. అయిదెకరాల్లో రూ.2.63 కోట్లతో 8 కాటేజీలు, రెస్టారెంట్, ఈత కొలును నిర్మించారు. మిగిలిన 8 ఎకరాల్లో ఒంగోలు గిత్త బొమ్మతోపాటు పార్క్, రోప్‌వేతోపాటు కొండ ఎక్కేందుకు వీలుగా రూ.8 కోట్లతో ప్రతిపాదించారు. దేవరంపాడులోని ఉప్పు సత్యాగ్రహ విజయస్తూపాన్ని పర్యాటక ప్రదేశంగా మార్చే క్రమంలో రూ.3 కోట్లతో అంచనా వేశారు.

# జల వృద్ధి.. రైతుకు లబ్ధి



నంద్యాల : ఉమ్మడి జిల్లాలో చిన్న నీటి పారుదలశాఖ పరిధిలోని చెరువులు నూతన కళను సంతరించుకోనున్నాయి. వీటిల్లో భూగర్భ జలాలు పెంపొందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఆర్‌ఆర్‌ఆర్ పథకం పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయనుంది.

ఉమ్మడి జిల్లాలో మైనర్ ఇరిగేషన్ శాఖ పరిధిలోని అన్ని చెరువులను ఆర్‌ఆర్‌ఆర్ (మరమ్మతులు, ఆధునికీకరణ, నవీకరణ) పథకం కింద అభివృద్ధి చేయనున్నారు. ఇందులో భాగంగా కర్నూలు జిల్లాలో 310, నంద్యాల జిల్లాలో 326 చెరువులను గుర్తించారు. ఇప్పటికే వివరాలు సేకరించి అంచనాలు రూపొందించారు. డీపీఆర్‌ను చిన్న నీటిపారుదల శాఖ అధికారులు తయారుచేసి డీఎల్ఐ (డిస్ట్రిక్ట్ లెవల్ ఫర్ ఇంప్లిమెంటేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ)కి నివేదించారు.

**సమన్వయంతో..**

మైనర్ ఇరిగేషన్ శాఖ అధికారులు గత రెండు నెలలుగా భూగర్భజల శాఖతో సమన్వయం చేసుకుని చెరువులను వర్గీకరించారు. నంద్యాల జిల్లాలో 8 నుంచి 20 మీటర్ల లోపు నీరు ఉన్న చెరువులు 250 ఉండగా, 20 మీటర్లకుపైగా నీటిమట్టం ఉన్న చెరువులు 76గా ఉన్నట్లు గుర్తించారు. కర్నూలు జిల్లాలో 20 మీటర్ల లోపు నీటిమట్టం ఉన్న చెరువులు 201, ఆపై నీటిమట్టం ఉన్నవి 125 వరకు ఉన్నాయి.

**చేపట్టనున్న పనులివే..**

చెరువు కట్టలను బలోపేతం చేయనున్నారు. తూముల మరమ్మతులతోపాటు చెరువుల్లోకి సాఫీగా నీరు వెళ్లేలా ప్రణాళిక రూపొందించుకుని అమలు చేయనున్నారు. వాగులు, వంకలు ద్వారా వచ్చే నీరు తగ్గిపోతున్న ప్రాంతాలను గుర్తించి చెక్‌డ్యామ్‌లు, వాటర్‌షెడ్లు నిర్మించి భూగర్భ జల నీటిమట్టం పెంచనున్నారు. ఫీడర్ ఛానళ్లను ఆధునికీకరించనున్నారు. ప్రత్యేకించి నీటి మట్టం తక్కువగా ఉన్న కర్నూలు జిల్లాలోని కోసిగి, ఆస్పరి, ఓర్వకల్లు, ఎమ్మిగనూరు మండలాలతోపాటు నంద్యాల జిల్లాలోని బేతంచెర్ల, నందికొట్కూరు, ప్యాపిలి ప్రాంతాల్లో చెరువుల విస్తీర్ణం పెంచడంతోపాటు ఆయా మండలాల పరిధిలోని పలు ప్రాంతాల్లో చెక్‌డ్యామ్‌లు నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారు చేశారు.

**రెండు విడతలుగా..**నంద్యాల జిల్లాలోని 326 చెరువులను రెండు విడతలుగా అభివృద్ధి చేయనున్నారు. మొదటి విడతగా రూ.22.87 కోట్లు, రెండో విడత కింద రూ.138.19 కోట్లు కేటాయించనున్నారు. కర్నూలు జిల్లాలో మొదట రూ.21.65 కోట్లు, రెండో విడతలో భాగంగా రూ.117.54 కోట్లు ఇవ్వనున్నారు.

# లయ తప్పుతోంది

కర్నూలు : ఉమ్మడి జిల్లాలో గుండె జబ్బు బారినపడుతున్న వారి సంఖ్య ఏటా పెరుగుతోంది. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఏడాదికి సుమారు 25 వేల మంది చికిత్స పొందుతున్నారు. బాధితుల్లో కొందరు సకాలంలో ముప్పును గుర్తించలేక ప్రాణాలు కోల్పోతున్నారు. ఒక్క కర్నూలు సర్వజన ఆస్పత్రికి ప్రతినెలా కొత్తగా 100- 120 గుండె జబ్బు కేసులు వస్తున్నాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ భారీగా నమోదవుతున్నాయి.

**నెలకు 1,400కుపైగా ఓపీ**

కర్నూలు సర్వజన ఆసుపత్రిలోని కార్డియాలజీ విభాగంలో నెలకు సుమారు 1,400 వరకు ఓపీ నమోదవుతోంది. 320 మంది ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. 50-70 యాంజియోగ్రామ్‌లు చేస్తున్నారు. 20-25 మందికి వైద్యులు స్టెంట్‌లు అమరుస్తున్నారు. 10-15 మందికి శస్త్రచికిత్సలు చేస్తున్నారు. కార్డియాలజీ విభాగంలో అందుతున్న వైద్యసేవల స్థాయిలో కార్డియోథొరాసిస్ విభాగంలో గుండె శస్త్రచికిత్సలు జరగడం లేదన్న విమర్శలున్నాయి.

**స్టెమి ప్రోగ్రాంతో అత్యవసర వైద్యం**

గ్రామీణ ప్రాంతాల ప్రజలకు గుండెపోటు వచ్చిందంటే పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రుల్లో ప్రాథమిక చికిత్స అందించే సౌకర్యాలు ఉండేవి కావు. ఈ నేపథ్యంలో 2023లో స్టెమి ప్రోగ్రాంను ప్రవేశపెట్టారు. సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల్లో త్రాంబోలైసిస్ విధానంలో భాగంగా ఒక్కోటి రూ.40 వేల ఖరీదైన టెనిక్టమి ప్లేజ్ అనే ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచారు. సీహెచ్‌సీలకు వచ్చిన బాధితులకు ఈసీజీ తీసి కర్నూలులోని టెలి మెడిసిన్ హబ్‌కు పంపిస్తారు. అక్కడి వైద్యుల సూచన మేరకు ఇంజెక్షన్ ఇస్తున్నారు.



గుండెపోటు వచ్చిన వారిని మొదటి గంటలోపు ఆసుపత్రికి తీసుకెళ్తే వెంటనే ఇంజెక్షన్ వేసి ప్రాణాలు కాపాడుతున్నారు. 2023లో 25, 2024లో 55, 2025లో 55 మందికి టెనిక్టమి ఇంజెక్షన్లు వేశారు.

**లక్షణాలు గుర్తించాలి – డాక్టర్ ప్రశాంత్, కార్డియాలజీ నిపుణులు**

చెమటలు పట్టడం.. ఎడమ చేయి లాగడం.. ఇతర లక్షణాలు కనిపిస్తే అప్రమత్తం కావాలి. గుండెలో నొప్పి వచ్చినప్పుడు కొందరు గ్యాస్ట్రిక్ సమస్య అని నిర్లక్ష్యం చేస్తుంటారు. రక్తపోటు, మధుమేహం ఉన్నవారికి గుండెజబ్బు ముప్పు ఎక్కువగా ఉంటుంది. 40 ఏళ్లు దాటినవారు కచ్చితంగా వైద్య పరీక్షలు చేయించుకోవాలి. ఈ జబ్బు బారినపడకుండా ఉండేందుకు నడక, యోగా, ధ్యానం చేస్తే కొంతవరకు మేలు జరుగుతుంది.

# అట్టకెక్కించారు

ఎమ్మిగనూరు : విద్యార్థులకు సాంకేతిక విద్య అందించే లక్ష్యంతో గత ప్రభుత్వ హయాంలో రూ.కోట్ల విలువ చేసే కంప్యూటర్లు, టీవీలు కొనుగోలు చేశారు. 'నాడు-నేడు' కింద పలు విద్యాలయాల్లో తరగతి గదుల నిర్మాణం పూర్తికాకముందే వీటిని సరఫరా చేశారు. పునాదుల స్థాయిలోనే ఉండగా వీటిని సరఫరా చేయడంతో మూలకు చేరాయి. ఫలితంగా రూ.కోట్ల విలువ చేసే టీవీలు, ఇతర సామగ్రి అట్టపెట్టెల్లోనే మూలుగుతున్నాయి. మరికొన్ని మరమ్మతులకు గురయ్యాయి.

**భారీగా నిధులు వెచ్చించి..**

ఉమ్మడి జిల్లాలోని పలు పాఠశాలలకు వీసీఆర్ (వర్చువల్ క్లాస్ రూం), డీసీఆర్ (డిజిటల్ క్లాస్ రూం)కు భారీ స్మార్ట్ టీవీలు, కంప్యూటర్లు, ఎల్‌సీడీ ప్రొజెక్టర్లు, యూపీఎస్, కీబోర్డు, మౌస్‌లు తదితరాలు పంపిణీ చేశారు. ఒక్కో యూనిట్ విలువ సుమారు రూ.2.40 లక్షలు ఉంటుంది. ఈ లెక్కన మొత్తం పాఠశాలలకు అందజేసిన పరికరాల విలువ రూ.కోట్లల్లో ఉంటుందని అంచనా.

**ఎక్కడెక్కడ ఎలా ఉందంటే..**గుడేకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 20 గదులు అసంపూర్తిగా ఉండటంతో 10 టీవీలను అట్టపెట్టెల్లో భద్రపరిచారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏడు టీవీలను గదిలో పెట్టి తాళాలు వేశారు. కోటేకల్లు, సోమప్పనగర్, నాగలాపురం, దైవందిన్నె, కందనాతి ఉన్నత పాఠశాలల్లో టీవీలు మూలకు చేరాయి.

నంద్యాల పరిధిలోని నందికొట్కూరు, నంద్యాల పట్టణం, బేతంచెర్ల, బనగానపల్లి, ఆళ్లగడ్డ పరిధిలో గదుల నిర్మాణాలు పూర్తికాక టీవీలను మూలన పెట్టేశారు.

**పక్కన పెట్టేసి..**ఎమ్మిగనూరు పట్టణంలోని మాచాని సోమప్ప బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలలో 3,600 మంది చదువుతున్నారు. ఈ విద్యాలయంలో 20 అదనపు గదుల కోసం రూ.2.40 కోట్లు మంజూరు చేశారు. ఆరు గదుల పనులు పూర్తి చేశారు. ప్రభుత్వం 35 టీవీలు మంజూరు చేసింది. మిగతా గదులు పునాదుల దశలో ఉండటంతో సుమారు 12 టీవీలు మూలన చేరాయి.

**గదులు సరిపోక..**

కొన్ని పాఠశాలల్లో గదులు సరిపోక ఆరుబయట కూర్చొని విద్యార్థులు పాఠాలు వింటున్నారు. ఈ నేపథ్యంలో వచ్చిన సామగ్రిని ఎక్కడ నిల్వ చేయాలో తెలియక ఉపాధ్యాయులు కొన్ని గదుల్లో భద్రపరిచారు. పిల్లలు కూర్చునేందుకు స్థలం లేని ప్రాంతాల్లో అట్టపెట్టెల్లో సామగ్రిని గదుల్లో నిల్వ చేశారు. నాడు-నేడు మొదటి విడతలో ఎంపికైన బడులు: 594

మంజూరైన నిధులు : రూ.166 కోట్లు

రెండో విడతలో ఎంపికైన పాఠశాలలు : 1051

నిధులు : సుమారు రూ.504.16 కోట్లు

ఉమ్మడి జిల్లాలో పాఠశాలలకు వచ్చిన టీవీలు: 3,256

మూలకు చేరినవి: 850కిపైగా వివిధ వస్తువులు

# వీసీ లేక పడకేసిన పాలన

పార్వతీపురం: తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో 20 రోజులకు పైగా ఉపకులపతి లేకపోవడంతో పాలన పడకేసింది. ఇన్‌ఛార్జి ఉపకులపతి కురుబ గోపాల్ గత నెల 31న ఉద్యోగ విరమణ చేశారు. సాధారణంగా వీసీ పదవీకాలం మూడేళ్లు మాత్రమే. కానీ వైకాపా హయాంలో నిబంధనలకు విరుద్ధంగా గత వీసీ జానకిరామ్ రెండోసారి పునర్నియామకం పొందారు. దీన్ని రద్దు చేస్తూ హైకోర్టు గతేడాది జూన్ 26న తీర్పునిచ్చింది. అనంతరం అనంతరాజుపేట ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ గోపాల్ వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీగా నియమితులయ్యారు. ఆ సమయంలో దాదాపు 50 రోజులపాటు వర్సిటీకి వీసీ లేరు.జీవో 39ని సవాల్ చేస్తూ.. ఉన్నత విద్యా శాఖ పరిధిలోని విశ్వవిద్యాలయాల్లో పని చేసే ఆచార్యుల ఉద్యోగ విరమణ వయసును 62 నుంచి 65కి పెంచుతూ 2023 జులై 27న అప్పటి వైకాపా ప్రభుత్వం జీవో నం.39 విడుదల చేసింది. కానీ దానిని ఉద్యాన, వ్యవసాయ, పశువైద్య విశ్వవిద్యాలయాలకు వర్తింపజేయలేదు. దీనిని సవాల్ చేస్తూ తన ఉద్యోగ విరమణ వయసును 65కి పెంచాలని గోపాల్ గత నెల 28న హైకోర్టును ఆశ్రయించారు. కోర్టులో పెండింగ్‌లో ఉండటంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 4న ఆయన రిలీవ్ అయ్యారు. దీనిపై మరికొందరు కూడా పిటిషన్ దాఖలు చ్చేశారు. అందరిదీ ఒకే రకమైన పిటిషన్ కావడంతో ఈ నెల 25న విచారణ నిర్వహిస్తామని హైకోర్టు ప్రకటించినా.. జరగలేదు.


**ఉద్యోగుల వేతనాలపై ప్రభావం..**

రాష్ట్రీయ కృషి వికాస యోజన (ఆర్‌కేవీవై) ద్వారా వర్సిటీ పరిధిలోని పరిశోధనా స్థానాలు, కళాశాలలకు నిధులు మంజూరయ్యాయి. వీటి వినియోగానికి వీసీ అనుమతులు తప్పనిసరి. ఇవి సకాలంలో వినియోగించకపోతే వెనక్కి వెళ్లిపోతాయి. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలకు సైతం వీసీ అనుమతిలో బిల్లులు ప్రభుత్వానికి పంపించాలి. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్) ఆధ్వర్యంలో పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలు త్వరలో జరగనున్నాయి. వర్సిటీ విద్యార్థులు ఉన్నత చదువుల కోసం వెళ్లే సమయంలో విద్యార్హత ధ్రువపత్రాలు అవసరం. వీసీ లేకపోవడంతో వీటిని జారీ చేయడం లేదు.

# జోరందుకుంది.. పారాది వారధి

బొబ్బిలి: వేగావతి నదిపై బొబ్బిలి మండలం పారాది వంతెన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఏడు స్తంభాలు పూర్తయ్యాయి. ఇరువైపులా రోడ్డును కలిపే స్తంభాలు నిర్మాణంలో ఉన్నాయి. ఓ వైపు పూర్తికాగా.. రెండోవైపు కాంక్రీటు వేస్తున్నారు. శ్లాబులకు ఐరన్ సెంట్రింగ్ సిద్ధం చేస్తున్నారు. వచ్చే మార్చికి పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి. రూ.6.50 కోట్ల పనులు జరిగినట్లు అధికారులు చెబుతున్నారు.

ఇటీవల వర్షాలు విరివిగా కురవడంతో నదిలో నీటి ప్రవాహం పెరిగి సమస్యతొస్తున్నాయి. వాహనాలు వెళ్లేందుకు వీలుగా నదిలో నిర్మించిన కాజ్‌వేపై నుంచి నీరు పారడంతో ఇబ్బంది ఎదురైంది. వచ్చే నెలలో వర్షాలు తగ్గే అవకాశం ఉన్నందున శ్లాబు శరవేగంగా జరిగే అవకాశాలు ఉన్నాయి.



**55 శాతం పూర్తి..**

గతేడాది అక్టోబరులో పనులు ప్రారంభమయ్యాయి. ఇంతవరకు 55 శాతం మేర పూర్తయ్యాయి. కీలకమైన బేస్మెంట్ పూర్తిచేసి స్తంభాల కాంక్రీటు పనులు చేపట్టారు. పిల్లర్ల మధ్య శ్లాబులు వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. శరవేగంగా సాగుతున్నాయని, దీనికి తగ్గట్లు బిల్లులు చెల్లిస్తే గుత్తేదారు గడువులోపు పూర్తిచేసే అవకాశాలు ఉన్నాయని ఎమ్మెల్యే బేబినాయన ఇటీవల అసెంబ్లీలో మాట్లాడారు.

**జాప్యం లేకుండా పనులు చేస్తున్నాం..:** పారాది వంతెన నిర్దేశిత వ్యవధిలోగా పూర్తిచేస్తాం. పిల్లర్ల నిర్మాణం పూర్తయింది. వాటి మధ్య శ్లాబులు వేసేందుకు సామగ్రి సిద్ధం చేస్తున్నాం. వర్షాలు పడుతున్నా జాప్యం లేకుండా పనులు చేస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నాణ్యతలో రాజీ లేకుండా చూస్తున్నాం.అప్పలరాజు, ఏఈ ర.భ.శాఖ, బొబ్బిలి సెక్షన్ శ్లాబు

# నిబంధనలు కట్టిపెట్టు.. గుత్తేదారులకు దోచిపెట్టు

పుట్టపర్తి : హిందూపురం మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు నిబంధనలను గాలికొదిలేశారు. టెండర్లు పిలవడంలో విధి విధానాలు పాటించడం లేదు. ఇది గుత్తేదారులకు వరంగా మారుతోంది. నీటి సరఫరాను మెరుగుపర్చడానికి రూ.5 కోట్లు ఖర్చు చేయడంలోనూ, వివిధ పనులకు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదికలు(డీపీఆర్) తయారు చేసే కన్సల్‌టెంట్లను ఎంపిక చేయడంలోనూ ఇంజినీరింగ్ విభాగం అధికారులు విఫలం కావడం విమర్శలకు తావిస్తోంది.

**ఆఫ్‌లైన్‌లో పిలిచి..**

తాజాగా మున్సిపల్ కార్యాలయ నిర్మాణాన్ని రూ.18.3 కోట్లతో నిర్మించాలని నిర్ణయించారు. భవన నిర్మాణానికి సంబంధించిన డీపీఆర్ సిద్ధం చేయడం, సాంకేతిక అనుమతులు తీసుకురావడం తదితర పనులు చేయడానికి కన్సల్‌టెంట్ల ఎంపికకు టెండర్లు పిలిచారు. ఆన్‌లైన్ టెండర్లు పిలవాలని నిబంధనలు ఉంటే ఆఫ్‌లైన్‌లో పిలిచారు. సమగ్ర ప్రతిపాదనల తయారు చేసే వారికి పని విలువలో 1 శాతం లోపే చెల్లించాలి. ఒక్క శాతం లోపు సొమ్ముకు టెండర్ వేసిన వారినే ఖరారు చేయాలి. అంటే మున్సిపల్ కార్యాలయ భవన సముదాయ ప్రణాళికను సిద్ధం చేసే వారికి రూ.18లక్షల లోపు చెల్లించాలి. ఇప్పుడు మున్సిపల్ అధికారులు ఖరారు చేసిన కన్సల్‌టెంటు సంస్థకు రూ.51 లక్షలు




చెల్లిస్తున్నారు. ఏకంగా రూ.33 లక్షలు అదనంగా వారికి దక్కుతుంది. అందులో ఎంత దక్కనుందోనని స్థానికులు చర్చించుకు ంటున్నారు.

**గతంలో ఇలాగే..**

గతంలోనూ సమగ్ర ప్రతిపాదనలు తయారు చేసే సంస్థలకు దోచిపెట్టినట్లు తెలుస్తోంది. పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పనకు కేటాయించిన రూ.92.5 కోట్ల పనులకు సంబంధించి సమగ్ర ప్రతిపాదనలు తయారు చేయడంలోనూ కన్సల్‌టెంట్‌కు అవగాహన లేక సమగ్ర ప్రాజెక్టు నివేదిక తయారీ ఆలస్యమైంది.

**నిబంధనలు ఉల్లంఘిస్తే రద్దు చేస్తాం –మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్**వెంటనే ఇంజినీరింగ్ విభాగం అధికారులతో చర్చిస్తా. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా టెండర్లు ఖరారు చేస్తే అవి ఏ దశలో ఉన్నా రద్దు చేస్తా. కరవు నిధుల పనులు నేను బాధ్యతలు తీసుకోకముందు జరిగాయి. వాటిలో ఏవైనా అక్రమాలు ఉంటే బిల్లుల చెల్లింపు నిలిపివేస్తా. అవసరమైతే విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకుంటా.

# ఒంటి గంట.. వైద్యుల ఇంటి బాట!

అనంతపురం : మధ్యాహ్నం దాటితే ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం దైవాదీనంగా మారిపోయింది. ఒంటి గంట తర్వాత కొన్ని ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల స్థానంలో ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. రాత్రి వేళల్లో డ్యూటీ డాక్టర్లు ఇళ్లకే పరిమితమవుతున్నారు. అత్యవసరమైతేనే ఫోన్ చేయాలంటూ నర్సులు, సిబ్బందికి ఆదేశాలిచ్చి బయోమెట్రిక్ వేసి వెళ్లిపోతున్నారు. గత తీవ్ర అనారోగ్యంతో ఉరవకొండ ఆసుపత్రికి వచ్చిన బాలుడికి నర్సుతో వైద్యం చేయించారు. ఆ సమయంలో డ్యూటీ డాక్టర్ అందుబాటులో ఉన్నా.. ఏమీ పట్టకుండా పైన గదిలో నిద్రపోయారు. సరైన వైద్యం అందక బాలుడు చనిపోయాడని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు.

**అన్నింటికీ అనంతపురమే..**

టెక్నీషియన్లు కూడా వైద్యులు వెళ్లిపోయిన తరువాత ఉడాయిస్తున్నారు. అత్యవసర కేసు వస్తే ఎక్స్‌రే, ఈసీజీ తీయడానికి సిబ్బంది అందుబాటులో ఉండటం లేదు. అత్యధిక శాతం కేసులను అనంతపురం సర్వజన వైద్యశాలకు రెఫర్ చేస్తూ చేతులు దులుపుకొంటున్నారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వస్తే ప్రాథమిక చికిత్స అందించకుండా పెద్దాసుపత్రికి పంపిస్తున్నారు.

**3 గంటలే సేవలు..!**

నిబంధనల మేరకు పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో వైద్యులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓపీ సేవలు



అందించాలి. డ్యూటీ డాక్టర్ 24 గంటలు అందుబాటులో ఉండాలి. కళ్యాణదుర్గం, ఉరవకొండలో ఉదయం 10 గంటల తర్వాతే ఓపీ ప్రారంభమవుతోంది. మధ్యాహ్నం ఒంటి గంటకు వైద్యులు వెళ్లిపోతున్నారు. రోజులో 3 గంటలు ఆసుపత్రిలో సేవలందిస్తున్నారు. డ్యూటీ డాక్టర్లు సక్రమంగా విధులకు హాజరు కావడం లేదు. రాయదుర్గం, గుంతకల్లు ప్రాంతీయ ఆసుపత్రుల్లోనూ మధ్యాహ్నం తర్వాత సక్రమంగా విధుల్లో ఉండటం లేదు.

**నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు** –డేవిడ్ సెల్వన్‌రాజ్, జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి

డ్యూటీ డాక్టర్ 24 గంటల పాటు విధుల్లో ఉంటారు కాబట్టి నిద్రపోవడంలో తప్పులేదు. కేసులు వచ్చినప్పుడు నర్సులు సమాచారం ఇస్తే వచ్చి చికిత్స చేస్తారు. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో వైద్యులు మధ్యాహ్నం తర్వాత ఉండటం లేదనే విషయంపై విచారణ జరుపుతాం. నిర్లక్ష్యంగా ఉన్నవారిపై తగిన చర్యలు తీసుకుంటాం.

# తవ్వేసి.. దోచేస్తూ..!



పుట్టపర్తి : మట్టి మాఫియా చెలరేగిపోతోంది. కొండలు, గుట్టలు, వంకలు, చెరువుల్లో మట్టి తవ్వేసి.. రవాణా చేస్తూ.. అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా భారీ యంత్రాలతో టిప్పర్లలో నింపి.. ప్రకృతి వనరులను కొల్లగొడుతున్నారు. అక్రమార్కులు టిప్పర్ మట్టిని రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు విక్రయిస్తున్నారు. ఈ తంతు యథేచ్ఛగా సాగుతున్నా పట్టించుకునేనాథులే కరవయ్యారు. అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు... ఆటువైపు కన్నెత్తి చూసిన పాపానపోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మాకు సంబంధం లేదన్నట్లు రెవెన్యూ, పోలీసు శాఖలు వ్యవహరిస్తుండటం పలు విమర్శలకు తావిస్తోంది. మట్టి మాఫియా దెబ్బకు కొండలు, గుట్టలు, కుంటలు కనుమరుగు అవుతున్నాయి. అధికారాన్ని అడ్డుపెట్టుకొని కొందరు నాయకులు ఇష్టారాజ్యంగా మట్టిని యంత్రాలతో తవ్వి తరలించేస్తున్నారు. జిల్లా కేంద్రం పుట్టపర్తితో పాటు కొత్తచెరువు, ముదిగుబ్బ తదితర ప్రాంతాల్లో ఈ దందా సాగుతోంది.

**ఎక్కడ.. ఎలాగంటే..**

పుట్టపర్తి సమీపంలోని కర్ణాటకనాగేపల్లి, కోవెలగుట్లపల్లి, కప్పలబండ వద్ద గుట్టలను తవ్వేసి టిప్పర్లలో తరలిస్తున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా రవాణా సాగుతోంది. రోజు 100 నుంచి 150 టిప్పర్ల మట్టి పుట్టపర్తితోపాటు పరిసర ప్రాంతాల్లోని లేఅవుట్‌లు, ఇతరత్రా వినియోగాలకు తరలిస్తున్నారు.

కొత్తచెరువులోని ప్రభుత్వ కార్యాలయాలకు కూతవేటు దూరంలోని పాములగుట్ట, పెనుకొండ రహదారిలోని నల్లగుట్ట నుంచి ఇష్టారాజ్యంగా రవాణా సాగిస్తున్నారు. కొంత మంది నేతలు అధికారం ఉంది కాదా అని దందా చేస్తున్నారు.

ముదిగుబ్బ నుంచి కోడూరు వరకు చేపడుతున్న నాలుగు వరసల రహదారి నిర్మాణానికి సమీప గుట్టల నుంచి అనుమతులు లేకుండానే మట్టి వినియోగిస్తున్నారు.

**అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తాం..**

– ఓబుళరెడ్డి, జిల్లా మైనింగ్ అధికారి

జిల్లాలో మట్టి అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాం. మట్టి తరలిస్తున్నారని ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందిస్తున్నాం. ఇప్పటికే కొన్ని చోట్ల కేసులు నమోదు చేయించాం. రెవెన్యూ, పోలీసు శాఖల సహకారంతో ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

# ధర దక్కక.. పంట కాపాడుకోలేక!



కళ్యాణదుర్గం : సాగు సమయంలో ఆశాజనకంగా ఉన్న మొక్కజొన్న ధర తాజాగా తగ్గుముఖం పట్టడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోగా.. విపణిలో దళారులు కనీస మద్దతు ధర కంటే రూ.400 తగ్గిస్తుండటంతో పంటను ఎలా విక్రయించుకోవాలో తెలియక పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో సుమారు 64 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగైంది. అత్యధికంగా రాయదుర్గం, కణేకల్లు, గుమ్మఘట్ట, డి.హీరేహాళ్, బ్రహ్మసముద్రం, బొమ్మనహాళ్, కళ్యాణదుర్గం, పెద్దపప్పూరు తదితర ప్రాంతాల రైతులు మొక్కజొన్నపై ఆశలు పెట్టుకున్నారు.

**పెట్టుబడి భారమై..**

రైతులు నాలుగు కిలోల విత్తన ప్యాకెట్ రూ.3,500 చొప్పున కొనుగోలు చేసి పంట సాగు చేశారు. అన్ని కలిపి ఎకరాకు సుమారు రూ.35 వేలకు పైగా ఖర్చు చేశారు. సగటున 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చినా.. ధర తగ్గుముఖం పట్టడంతో కనీసం ఖర్చులైనా వచ్చేలా లేవని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

**'మద్దతు' ప్రకటించినా..**

ప్రభుత్వం క్వింటాలుకు రూ2,400 చొప్పున మద్దతు ధర ప్రకటించినా.. విపణిలో దళారులు రూ2,000 నుంచి రూ2,100 మాత్రమే చెల్లిస్తామంటున్నారు. ఈ నేపథ్యంలో కొందరు రోడ్డు పక్కన, పొలాల్లోనే పంటను ఆరబోసి ఎదురుచూస్తున్నారు. మరోవైపు వర్షాలు కురుస్తుండటంతో పంటను కాపాడుకోలేక పడరాని పాట్లు పడుతున్నారు.

**ఖర్చు కూడా వచ్చేలా లేదు – రామాంజిని, యర్రగుంట**

దిగుబడులు వచ్చినా మద్దతు ధర దక్కక ఎకరాకు రూ.10 వేలు నష్టపోవాల్సిన దుస్థితి. మార్కెట్‌కు తెచ్చాక ధర తగ్గించి ఇస్తామని చెబుతుండటంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నాం.

**రోడ్డుపైనే ఆరబోస్తున్నాం.. – శ్రీరామప్ప, బోరంపల్లి**

రెండెకరాల్లో సాగుకు రూ.65 వేలకు పైగా పెట్టుబడి పెట్టాం. పంట ఆశాజనకంగా ఉన్నా ధర తగ్గింది. రోడ్డుపైనే పంట ఆరబోశాం. వర్షాలు కురుస్తుండటంతో కవర్లు కప్పి రక్షించుకోలేకపోతున్నాం. మొక్కజొన్న తడిస్తే ఎందుకూ పనికిరాకుండా పోతుంది.

**త్వరలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు – రాఘవేంద్రకుమార్, ఏడీ, పెన్నేశ్వరి, మార్క్‌ఫెడ్ అధికారిణి**త్వరలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరతో కొంటాం. ఈ మేరకు సన్నాహాలు చేస్తున్నాం. పంటలో తేమశాతం ఎక్కువగా ఉన్న రైతులు ఆరబెట్టుకొని తీసుకొస్తే మద్దతు ధర లభిస్తుంది.

# పీజీ కోర్సులకు తగ్గిన క్రేజీ

పుట్టపర్తి : పీజీసెట్ రాయడానికి విద్యార్థులు పోటీ పడేవారు. సీటు సాధించడం ఆషామాషీ విషయం కాదు. ఇదంతా ఒకప్పటి మాట. వర్సిటీలో పీజీ చేయడానికి చాలా మంది ఆసక్తి చూపడం లేదు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో 33 పీజీ కోర్సులకు గాను 1,100 సీట్లు ఉన్నాయి. ప్రస్తుతం ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతోంది. మొదటి విడతలో 213 సీట్లు భర్తీ అయ్యాయి. సైన్స్‌లో 18 విభాగాలు ఉండగా 157 సీట్లు... ఆర్ట్సులో 15 విభాగాలకు 56 సీట్లే భర్తీ కావడం గమనార్హం. 2023లో 326.. గతేడాది 296 సీట్లు భర్తీ కాగా... ఈ ఏడాది ప్రవేశాలు మరింతగా తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**6 విభాగాలకు ఆరుగురే..**

హిందీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, గ్రామీణాభివృద్ధి, సామాజిక కృషి, పాలిమార్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్‌లో కేవలం ఒకరు చొప్పున మాత్రమే అడ్మిషన్ పొందడం గమనార్హం.

**రెండో విడతలో పెరిగేనా..**

మొదటి విడత ప్రవేశాలకు ఈనెల 27తో గడువు ముగిసింది. రెండో విడతకు 29 (నేటి) నుంచి కౌన్సెలింగ్ ఆరంభమవుతుంది. 'తొలి విడతలో ప్రవేశం పొంది రిపోర్ట్ చేసిన సుమారు 30 మంది ఫీజు చెల్లించలేదు. 29న ఫీజు చెల్లించినా ప్రవేశానికి అనుమతి ఉంటుంది. ఈ విడతలో మరింత మంది విద్యార్థులు చేరే అవకాశం ఉంది' అని వర్సిటీ రిజిస్ట్రార్ రమేష్‌బాబు పేర్కొన్నారు.



**వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో..**

వైకాపా హయాంలో వర్సిటీల పరిస్థితి దయనీయంగా ఉండేది. విద్యార్థులకు చెల్లించే ఉపకారవేతనాలు బోధన రుసుం విశ్వవిద్యాలయాల ఖాతాలో జమ చేయకుండా ప్రచార ఆర్భాటం కోసం వసతిదీవెన, విద్యాదీవెన పథకాలు ప్రవేశపెట్టారు. సదరు పథకాల కింద విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఆ సొమ్ము జమ చేస్తామన్నారు. అవి కూడా సక్రమంగా చెల్లించకపోవడంతో పేద తల్లిదండ్రులకు చదివించడం భారంగా మారింది. అప్పటి నుంచి ప్రవేశాలు తగ్గుతూ వస్తున్నాయి.

# జల కాలుష్యం.. తగ్గించడం అవశ్యం

తిరుపతి : నీటిని కలుషితం చేసే పారిశ్రామిక, వ్యవసాయ వ్యర్థాలైన సీసం, పాదరసం, ఆర్సెనిక్, కాడ్మియం వంటి వాటితో మానవ ఆరోగ్యానికి, జలచరాలకు ఎంతో హాని కలుగుతుంది. రసాయన రంగులతో రూపొందించిన వినాయక విగ్రహాల నిమజ్జనంతోనూ జలకాలుష్యం పెరుగుతోంది. దీన్ని తన వంతుగా కొంతైనా తగ్గించాలని భావించింది శ్రీపద్మావతి మహిళా వర్సిటీ ఇంటిగ్రేటెడ్ బయోటెక్నాలజీ విద్యార్థిని డి.కుందనసాయి. ఈమె ఆలోచనను ఆవిష్కరణగా మార్చడానికి వర్సిటీ టీబీఐలోని నిధి ప్రయాస్ స్కీం రూ.5 లక్షల నిధులు మంజూరు చేసింది. వీటితో ఒక పరికరాన్ని రూపొందించింది.

**ఆల్గేతో డివైజ్..**

మైక్రోఆల్గే, అయస్కాంత కణాలు, మొక్కల ఆధారిత ఫైబర్లతో కుందనసాయి ఓ పరికరాన్ని రూపొందించింది. ఇది నీటిలోని భార లోహాలను పీల్చుకుని శుద్ధజలాలను ఇస్తుంది. 600 లీటర్ల నీటిలో



పేరుకుపోయిన వంద శాతం సీసం, 95 శాతం రాగి, 60 శాతం కాడ్మియం, 85 శాతం కోబాల్ట్ లను 48 గంటల్లో తొలగిస్తుంది.

**ప్రథమ బహుమతి సాధించా**

సైన్స్ అంటే ఇష్టంతో నీటి కాలుష్య నివారణపై ఏడాదిపాటు పరిశోధనలు చేసి ఈ డివైజ్‌ను రూపొందించా. అమెరికన్ ఎంబసీ ఆధ్వర్యంలో భువనేశ్వర్‌లో జరిగిన అకాడమీ ఫర్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ కార్యక్రమంలో మొదటి బహుమతి సాధించా. హైదరాబాద్ టీహబ్‌లో జరిగిన ఐకాన్ భారత్ పోటీల్లోనూ ప్రథమ బహుమతి నాకే వచ్చింది. ఆచార్య నాగార్జున వర్సిటీలో జరిగిన ఇన్నోవేటర్స్ పోటీల్లో ఉత్తమ పురస్కారం దక్కింది. చదువు పూర్తయ్యాక స్టార్టప్ నెలకొల్పుతా. కుందనసాయి

# రక్తపోటు.. చక్కెర కాటు

తిరుపతి: మారిన జీవనశైలి.. జంక్‌ఫుడ్, మద్యం, ధూమపానం వంటి అలవాట్లకు తోడు నిద్రలేమి, శారీరక శ్రమ కొరవడటంతో ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసులను రక్తపోటు, మధుమేహం చుట్టుముడుతున్నాయి. ఈ విషయం ఇటీవల ప్రభుత్వం చేసిన ఎన్‌సీడీ 3.0 సర్వేలో తేటతెల్లమైంది. రెండు జిల్లాల్లో అధిక రక్తపోటు, మధుమేహం బాధితుల సంఖ్య పెరుగుతోందని గణాంకాలు చెబుతున్నాయి. ఇవి ప్రమాద ఘంటికలను మోగిస్తున్నాయి.

**ఏం చేయాలంటే..**20 ఏళ్లు దాటిన వారు ఏడాదికి ఒకసారైనా గ్లూకోజు పరీక్ష చేయించుకోవాలి.

పరగడుపున రక్తంలో గ్లూకోజు మోతాదు 100–125 మధ్యలో ఉ



ంటే ముందస్తు మధుమేహంలోకి అడుగుపెట్టినట్లే.

మధుమేహం నిర్ధారణ అయితే తొలిరోజు నుంచే వైద్యులు సూచించిన ఔషధాలు వినియోగించాలి.

రోజూ వ్యాయామం, సమయానికి ఆహారం తీసుకోవాలి.

జిల్లాలో స్క్రీనింగ్ లక్ష్యం: 17,71,424

ఇప్పటివరకు పూర్తి: 16,58,756

గుర్తించిన బాధితుల సంఖ్య అధిక రక్తపోటు: 75,639

మధుమేహం: 63,424 రెండూ ఉన్నవారు: 92,019

నోటి క్యాన్సర్: 1 రొమ్ము : 1 గర్భాశయ ముఖద్వార క్యాన్సర్: 1

# 'గుట్ట'నక్కల పాలు

చిత్తూరు : చిత్తూరు మండలంలో ఆక్రమణలకు అంతే లేకుండా పోతోంది. కనిపించిన కొండలు, గుట్టలు, చెరువు పోరంబోకు భూములను ఇష్టానుసారం కబ్జా చేస్తున్నారు. తాజాగా ఓ పంచాయతీ కీలక నేత చెరువు సమీపంలోని కొండగుట్టను అన్యాక్రాంతం చేశారు. జిల్లా కేంద్రంలోనే ఈ తంతు జరుగుతున్నా.. రెవెన్యూ, జలవనరుల శాఖాధికారులు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.

చిత్తూరు మండలం దొడ్డిఅనంతాపురానికి చెందిన ఓ అధికార పార్టీ నేత ఇదే పంచాయతీలో 5.వెంకటాపురం చెరువు సమీపంలోని 15 ఎకరాల కొండగుట్టను దున్ని ఆక్రమణకు పాల్పడ్డారు. ప్రశ్నించిన వారిని బెదిరిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.

**విలువ.. పెరగడంతోనే**

చిత్తూరు–తచ్చూరు, బెంగళూరు–చెన్నై జాతీయ రహదారులు చిత్తూరు మండలం మీదుగా వెళ్లడంతో భూముల విలువ అమాంతం పెరిగింది. దీంతో అధికార పార్టీ నేతలు వైకాపా నాయకులతో కుమ్మక్కై ప్రభుత్వ భూములు కనిపించినా కబ్జాలకు తెరలేపుతున్నారు. వీఆర్‌ఏ, వీఆర్వోలతో గ్రామంలో పరిశీలించి ఏదైనా ఉంటే చర్యలు తీసుకుంటామని తహసీల్దారు జయప్రకాష్ తెలిపారు.

చురకలు



## చీరకట్టు.. పూల జడ.. ఆకట్టుకుంటున్న అమైరా దస్తూర్!

ఇండియన్ మోడల్.. సినీ హీరోయిన్ అయినటువంటి అమైరా దస్తూర్ ఎప్పటికప్పుడు తన హాట్ అందాలతో కుర్రకారుకు సెగలు పుట్టిస్తూ ఉంటుంది. హిందీ సినిమాల ద్వారా సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన ఈ ముద్దుగుమ్మ.. ప్రస్తుతం సినిమాల్లో అవకాశాల కోసం ఎదురు చూస్తోంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ ఎల్లో కలర్ శారీలో ఫోటోలను తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేసింది. ఈ ఫోటోలు నెట్టింట వైరల్ గా మారాయి.. తాజాగా అమైరా దస్తూర్ ఎల్లో కలర్ శారీ ఫొటోస్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తున్నాయి. ఇందులో అమైరా దస్తూర్ ఎల్లో కలర్ శారీతో పాటు తన పూల జడతో హైలెట్ అయింది. ముఖ్యంగా మల్లెపూలతో హెయిర్ స్టైల్ చేయించుకున్న ఈ ముద్దుగుమ్మని వెనక నుండి చూస్తే అచ్చ తెలుగు ఆడపిల్లలాగే కనిపిస్తోంది. ఇక స్లీవ్ లెస్ బ్లౌజ్ తో అందాలు హైలైట్ అయ్యేలా ఈ ముద్దుగుమ్మ తన శారీ ఫోటోలను ఇన్స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసింది. ఈ శారీలో అమైరా దస్తూర్ మరింత అందంగా కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ ఫొటోస్ చూసిన చాలామంది నెటిజన్స్ ఫైర్ ఎమోజీలను షేర్ చేస్తూ అందమే దిగివచ్చినట్లు ఉంది అన్నట్లుగా కామెంట్లు పెడుతున్నారు. తన నడుము ఒంపు సొంపులు చూపిస్తూ ఫోటోలకు



ఫోజులు ఇచ్చింది. ప్రస్తుతం ఈ ఫొటోస్ సోషల్ మీడియాలో వైరల్ గా మారగా.. చాలామంది ఈ ఫోటోలు చూసి పలు కామెంట్లు పెడుతున్నారు.. అమైరా దస్తూర్ పర్సనల్ సినీ కెరియర్ విషయానికి వస్తే.. మోడలింగ్ ద్వారా సినిమాల్లోకి వచ్చిన ఈ ముద్దుగుమ్మ 2013లో వచ్చిన బాలీవుడ్ మూవీ ఇసాక్ తో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత హిందీ తో పాటు తెలుగు,తమిళ సినిమాల్లో కూడా నటించింది. ఇక అమైరా దస్తూర్ సందీప్ కిషన్ హీరోగా నటించిన మనసుకు నచ్చింది అనే మూవీతో టాలీవుడ్లోకి ఎంట్రీ ఇచ్చింది. అలాగే రాజ్ తరుణ్ హీరోగా వచ్చిన రాజుగాడు మూవీ లో కూడా హీరోయిన్ గా నటించింది.. ఆ తర్వాత మళ్లీ తెలుగు సినిమాల్లో కనిపించలేదు. ఇక బాలీవుడ్ లో కొన్ని సినిమాల్లో నటించిన అమైరా దస్తూర్ చివరిగా తమిళంలో వచ్చిన భగీరా అనే సినిమాలో కనిపించింది.. అంతేకాకుండా పలు వెబ్ సిరీస్ లలో కూడా చేసింది. అలా సినిమాలు,వెబ్ సిరీస్ లు అంటూ ఇండస్ట్రీలో కొనసాగిన ఈ ముద్దుగుమ్మకి గత రెండు మూడు సంవత్సరాలు నుండి సినిమాల్లో ఎక్కువగా ఆఫర్స్ రావడం లేదు. అందుకే సినిమాల్లో ఆఫర్స్ అందుకోవడం కోసం ఇలా సోషల్ మీడియానే ప్రధానాయుధంగా మలుచుకొని తన ఫోటోలతో దర్శక నిర్మాతలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. మరి ఈ హీరోయిన్ అందాలు చూసైనా సినిమాల్లో ఏవైనా అవకాశాలు వస్తాయా అనేది చూడాలి.

## మమితా మరో సాయి పల్లవి అవ్వాలంటే..?

కొంతమంది హీరోయిన్స్ కి స్టార్ రేంజ్ వచ్చినా అది వాళ్ల గ్లామర్ తోనే అని తెలుస్తుంది. గ్లామర్ షోతో అలరించే భామలు కొందరైతే కేవలం తమ అభినయంతో మెప్పించే వారు ఇంకొంతమంది ఉంటారు. అలాంటి వారిలో మలయాళ భామ మమితా బైజు కూడా వస్తుంది. మమితా బైజు మలయాళ పరిశ్రమలో ఏడేళ్ల నుంచి సినిమాలు చేస్తుంది. ఐతే ప్రతి సినిమాలో మమితా తన టాలెంట్ తో అలరిస్తూ వస్తుంది. ప్రేమలు సినిమాతో ఆమె సౌత్ ఆడియన్స్ అందరికీ బాగా దగ్గరైంది. ప్రేమలు సినిమా తెలుగు ఆడియన్స్ కు కూడా బాగా నచ్చేసింది. అందుకే ఆమెను తెలుగు ప్రేక్షకులు కూడా ఇష్టపడుతున్నారు.

**ప్రదీప్ రంగనాథన్ తో డ్యూడ్..** ఐతే తెలుగులోనే కాదు తమిళంలో కూడా మమితాకు మంచి క్రేజ్ ఏర్పడింది. ఆల్రెడీ అమ్మడు అక్కడ సినిమాలు చేస్తుంది. దళపతి విజయ్ జన నాయగన్ తో సినిమా చేస్తున్న మమితా లేటెస్ట్ గా ప్రదీప్ రంగనాథన్ తో డ్యూడ్ లో ఆకట్టుకుంది. డ్యూడ్ సినిమాలో ఆమె రోల్ చూసిన ఆడియన్స్ మరోసారి మమితా ప్రేమలో పడిపోతున్నారు. ప్రతి పాత్ర కథ



విన్నప్పుడు ఎలా ఉన్నా తన అభినయంతో మెస్మరైజ్ చేస్తుంది మమితా బైజు. అందుకే ఆమెను సహజ నటిగా పొగిడేస్తున్నారు ఆడియన్స్. ఇక కొందరైతే మమితాను సాయి పల్లవితో పోల్చేస్తున్నారు. సాయి పల్లవి కూడా అంతే కేవలం పాత్ర ప్రాధాన్యత ఉంది అనిపిస్తే చాలు అది ఎలాంటి సినిమా అయినా చేస్తుంది. ఐతే సాయి పల్లవి తన కెరీర్ లో చాలా ప్రయోగాలు చేసింది. కానీ మమితా ఇప్పుడే కెరీర్ మొదలు పెట్టింది కాబట్టి ఆమెకు ఇంకా అలాంటి ఛాన్స్ లు రాలేదు. కచ్చితంగా సౌత్ ఆడియన్స్ మమితా మీద చూపిస్తున్న ప్రేమ చూస్తుంటే సాయి పల్లవి తర్వాత ఆమె అనిపించేలా క్రేజ్ తెచ్చుకుంటుంది.

**అభినయంతో ఆడియన్స్ ని మెప్పిస్తూ..** మమితా కూడా ఆడియన్స్ లో తనపై ఉన్న నమ్మకాన్ని తగ్గించకూడదని ఫిక్స్ అయ్యింది. గ్లామర్ షో చేయడం వల్ల సినిమా ఛాన్స్ లు వస్తాయేమో కానీ ఒక ఐదారు సినిమాల తర్వాత బోర్ కొట్టేస్తారు. కానీ అభినయంతో ఆడియన్స్ ని మెప్పిస్తూ.. సినిమా సినిమాకు.. ప్రతి పాత్రలో కొత్తగా కనిపిస్తే మాత్రం వాళ్లకి ఎక్కువ కెరీర్ ఉంటుంది. సో మమితాకు కచ్చితంగా మలయాళం మాత్రమే కాదు మిగతా సౌత్ భాషల్లో కూడా మంచి ప్రేక్షకాదరణ లభిస్తుందని చెపడంలో సందేహం లేదు.

తెలుగులో వెంకీ అట్లూరి సూర్య సినిమాలో మమితా హీరోయిన్ గా సెలెక్ట్ అయ్యింది. ఆ సినిమాతో మరోసారి తెలుగు, తమిళ ప్రేక్షకులను అలరించనుంది అమ్మడు.





# నవంబర్ లో నెగ్గేదెవరు?









ఈ ఇయర్ సెప్టెంబర్ లో టాలీవుడ్ నుంచి పలు బ్లాక్ బస్టర్ సినిమాలొచ్చాయి. తేజ సజ్జ మిరాయ్, బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కిష్కింధపురి, మౌళి లిటిల్ హార్ట్స్, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఓజి సినిమాలు బాక్సాఫీస్ ను కళకళలాడించాయి. ఇక అక్టోబర్ విషయానికొస్తే ఈ నెలలో పలు సినిమాలు రిలీజైనప్పటికీ గత నెల లాగా బ్లాక్ బస్టర్లు అందుకుని యునానిమస్ పాజిటివ్ టాక్ ను తెచ్చుకున్న సినిమాలు మాత్రం పెద్దగా లేవు. ఉన్నంతలో డ్యూడ్, కె ర్యాంప్ ఆడియన్స్ ను అలరించాయి. అక్టోబర్ 31న రవితేజ మాస్ జాతరతో అక్టోబర్ పూర్తి కానుంది. మరో వారం రోజుల్లో నవంబర్ నెలలో అడుగుపెట్టబోతున్నాం. సాధారణంగా నవంబర్ నెలలో బాక్సాఫీస్ కాస్త డల్ గానే ఉంటుంది. అందుకే భారీ సినిమాలను నవంబర్ లో రిలీజ్ చేయడానికి మేకర్స్ పెద్దగా ఆసక్తి చూపరు. నవంబర్ తర్వాత వచ్చే డిసెంబర్ లో క్రిస్మస్ సీజన్, ఆ తర్వాత జనవరిలో వచ్చే సంక్రాంతి సీజన్లపై పెద్ద సినిమాల చూపు ఉంటుంది. పెద్ద సినిమాల తాకిడి లేకుండా ఫ్రీ గా ఉంటుంది కాబట్టి పలు చిన్న, మీడియం రేంజ్ సినిమాలు నవంబర్ లో రిలీజై తమ లక్ ను టెస్ట్ చేసుకుంటుంటాయి. ఈ నేపథ్యంలోనే నవంబర్ లో కొన్ని తెలుగు సినిమాలతో పాటూ పలు హిందీ, ఇంగ్లీష్ సినిమాలు కూడా రిలీజ్ కానున్నాయి. మరి నవంబర్ లో ఏ వారం ఏ సినిమాలు రిలీజ్ కానున్నాయో చూద్దాం.

**నవంబర్ 7న..** రష్మిక మందన్నా హీరోయిన్ గా రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో తెరకెక్కిన ది గర్ల్‌ఫ్రెండ్ మూవీ సుధీర్ బాబు, సోనాక్షి సిన్హా కలిసి నటించిన జటాధర మూవీ ఇమ్రాన్ హష్మీ, యామీ గౌతమ్ జంటగా నటించిన హాక్ ప్రిడేటర్: బ్యాడ్‌లాండ్స్ అనే హాలీవుడ్ సినిమా

**నవంబర్ 14న..** దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే, రానా ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన కాంతా మూవీ బిందూ చంద్రమౌళి, చాందినీ చౌదరి, తరుణ్ భాస్కర్ లీడ్ రోల్స్ లో నటించిన సంతాన ప్రాప్తిరస్తు. అజయ్ దేవగన్, మాధవన్, రకుల్ ప్రీత్ సింగ్ ల దే దే ప్యార్ దే2

**నవంబర్ 21న..** ఫర్హాన్ అక్తర్, అమితాబ్ బచ్చన్, రాశీ ఖన్నా ప్రధాన పాత్రల్లో నటించిన 120 బహదూర్. విక్‌డ్2 అనే ఇంగ్లీష్ సినిమా

**నవంబర్ 28న..** రామ్ పోతినేని, భాగ్యశ్రీ బోర్సే జంటగా తెరకెక్కిన ఆంధ్రా కింగ్ తాలూకా. ధనుష్, కృతి సనన్ నటించిన తేరే ఇష్క్ మేన్. జూటోపియా2 అనే హాలీవుడ్ మూవీ అయితే వీటిలో టాలీవుడ్ లో ప్రతీ వారం ఓ క్రేజీ సినిమా ఉంది. ఇప్పటికే ఆయా సినిమాల నుంచి రిలీజైన కంటెంట్ సినిమాలపై అంచనాలను కూడా పెంచాయి. మరి ఈ నేపథ్యంలో నవంబర్ లో ఏయే సినిమాలు ఆడియన్స్ ను మెప్పిస్తాయో చూడాలి.

# మాస్ ఫ్యాన్స్ కి ఫీస్ట్.. కరుప్పు నుంచీ సాంగ్ రిలీజ్!



తమిళ నటుడు సూర్య రెట్రో మూవీ తర్వాత ఆర్జే బాలాజీ డైరెక్షన్లో కరుప్పు అనే మూవీతో మన ముందుకు రాబోతున్నారు. సూర్య నటించిన 45వ సినిమాగా తెరకెక్కుతున్న కరుప్పు మూవీ విడుదల తేదీ గురించి నిర్మాతలు ఇప్పటివరకు అఫీషియల్ గా వెల్లడించకపోయినప్పటికీ తాజాగా దీపావళి పండుగ సందర్భంగా కరుప్పు మూవీ నుండి మొదటి పాటను రిలీజ్ చేశారు.. తాజాగా “గాడ్ మోడ్” అనే పాటను రిలీజ్ చేశారు.నాలుగు నిమిషాల నిడివి గల ఈ ట్రాక్ సూర్య రోల్ ని పూర్తిగా గాడ్ మోడ్ లో చూపిస్తుంది. తమిళ జానపద మతంలో ఎక్కువగా పూజించబడే పవర్ ఫుల్ దేవుడు అయినటువంటి కరుప్పు స్వామి మానవ స్వరూపంగా ఈ పాటను ప్రదర్శించారు. తప్పు చేసిన వారికి ఈ దేవుడి పర్యవేక్షణలో స్థానం లేదు అని ఈ పాట చెబుతుంది.. ఇక ఈ పాట కోరస్ లో హీరో సూర్యను కరుప్పు స్వామి అని పిలుస్తారు.. అతని రాక ఎంతోమందికి చిరునవ్వులు తెప్పిస్తుందని, ఎంతోమంది ప్రజల హృదయాలను ప్రశాంత పరుస్తుందని ఈ పాట ద్వారా తెలిపారు.. తాజాగా విడుదలైన సూర్య కరుప్పు మూవీలోని పాట ఎంతోమంది అభిమానులను ఉత్సాహపరుస్తుంది..అలా తాజాగా విడుదలైన కరుప్పు సినిమాలోని గాడ్ మోడ్ పాటకి ఆయన అభిమానులు సోషల్ మీడియాలో ఆసక్తికరమైన పోస్టులు పెడుతున్నారు. ఆర్జె బాలాజీ డైరెక్షన్లో తెరకెక్కుతున్న కరుప్పు మూవీకి సంబంధించిన టీజర్ ని జూన్ ప్రారంభంలో నిర్మాతలు రిలీజ్ చేశారు. ఈ టీజర్ లో సూర్య బ్లాక్ కలర్ షర్ట్ , వైట్ కలర్ ధోతి ధరించి పవర్ ప్యాక్డ్ అవతారంలో కనిపించారు. అలాగే ఈ టీజర్ లో సూర్య న్యాయవాదిగా కోట్ ధరించినట్లు కూడా చూపించారు. ఇప్పటికే రెండు సినిమాలలో న్యాయవాది పాత్రలో మెరిసిన సూర్య ముచ్చటగా మూడోసారి కూడా కరుప్పు మూవీలో న్యాయవాది పాత్రలో కనిపించబోతున్నట్టు టీజర్ ద్వారా అర్థమైంది. ఈ సినిమాని డ్రీమ్ వారియర్ పిక్చర్స్ బ్యానర్ పై ఎస్.ఆర్. ప్రభు, ఎస్.ఆర్.ప్రకాష్ బాబు లు నిర్మిస్తున్నారు.ఇక ఈ మూవీలో సూర్య సరసన త్రిష హీరోయిన్ గా నటిస్తోంది. అలాగే యోగి బాబు, స్వతిక, శివదా,ఇంద్రన్స్, సుప్రీత్ రెడ్డిలు కీ రోల్స్ పోషిస్తున్నారు.ఈ సినిమాకి సాయి అభ్యాంకర్ సంగీతం అందిస్తున్నారు. అలా రెట్రో మూవీ ఫ్లాప్ తర్వాత సూర్య కరుప్పు మూవీతో మనల్ని అలరించబోతున్నారు. ఈ సినిమానే కాకుండా సూర్య , వెంకీ అట్లూరి డైరెక్షన్లో ఫ్యామిలీ ఎమోషనల్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న సూర్య 46 అనే వర్కింగ్ టైటిల్ తో వస్తున్న మూవీలో కూడా నటిస్తున్నారు.

ఈ సినిమాలో హీరోయిన్ గా మమితా బైజు నటించగా.. రవీనా టాండన్, రాధిక శరత్ కుమార్ లు కీ రోల్స్ పోషిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ కూడా శరవేగంగా జరుగుతుంది.

## రెడ్ గౌన్‌లో రకుల్.. గ్లామర్‌తో కట్టిపడేస్తోందిగా..

టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు తనకంటూ ఓ ప్రత్యేకమైన ఫాలోయింగ్ సంపాదించుకున్న బ్యూటీ రకుల్ ప్రీత్ సింగ్. నటనతోనే కాకుండా తన ఫిట్‌నెస్, యూనిక్ స్టైల్ స్టేట్ మెంట్లతో ఎప్పుడూ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంటుంది. లేటెస్ట్ గా ఆమె షేర్ చేసిన ఫొటోలు ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంటున్నాయి. లేటెస్ట్ ఫొటోషూట్‌లో రకుల్ స్ట్రాప్ లెస్ రెడ్ గౌన్‌లో మెరిసిపోయింది. థై హై స్లిట్‌తో ఉన్న ఈ స్టైలిష్ అవుట్‌ఫిట్‌లో ఎంతో గ్లామరస్‌గా కనిపిస్తోంది. “ఈ అవుట్‌ఫిట్, ఈ సాంగ్‌తో ప్రేమలో పడిపోయా” అంటూ ఆమె పెట్టిన క్యాప్షన్‌ను బట్టి ఈ లుక్‌ను ఎంతగా ఇష్టపడిందో అర్థమవుతోంది.



ఆమె పోజులకు నెటిజన్లు ఫిదా అవుతున్నారు. ‘వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్’ సినిమాతో టాలీవుడ్‌లో బ్రేక్ అందుకున్న రకుల్, ఆ తర్వాత ‘నాన్నకు ప్రేమతో’, ‘సరైనోడు’ వంటి వరుస హిట్లల్లో స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. తెలుగులో టాప్ లీగ్‌లో ఉండగానే బాలీవుడ్‌పైనా దృష్టి సారించి, అక్కడ కూడా వరుస ఆఫర్లతో తనకంటూ ఓ స్థానాన్ని సంపాదించుకుంది. ప్రస్తుతం రకుల్ కెరీర్ సౌత్, నార్త్ అనే తేడా లేకుండా ఫుల్ స్వింగ్‌లో కొనసాగుతోంది. ఆమె చేతిలో పలు క్రేజీ ప్రాజెక్టులు ఉన్నాయి. ముఖ్యంగా, కమల్ హాసన్, శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న పాన్ ఇండియా చిత్రం ‘ఇండియన్ 3’ లో కూడా రకుల్ కీలక పాత్ర పోషిస్తోంది. అయితే ఈ సినిమా ఇంకా హోల్డ్ లోనే ఉంది. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం రకుల్ ఎప్పుడూ చురుగ్గా ఉంటుంది. తన లేటెస్ట్ ఫొటోషూట్లు, ఫిట్‌నెస్ అప్‌డేట్లతో ఫ్యాన్స్‌కు నిత్యం టచ్‌లో ఉంటూ తన క్రేజ్‌ను ఏమాత్రం తగ్గకుండా చూసుకుంటోంది.

## నేను మహిళగా మారిన రోజు అది: ప్రియాంక చోప్రా

గ్లోబల్ ఐకాన్ ప్రియాంక చోప్రా ఏం చేసినా అది ప్రత్యేకంగా ఉంటుంది. భర్త, పిల్లలు, కుటుంబంతో విదేశీ బీచ్ లలో చిలౌట్ చేస్తున్నా లేదా రెడ్ కార్పెట్ ఈవెంట్లలో క్యాట్ వాక్ లు చేసినా, న్యూయార్క్ వీధుల్లో అప్రయత్నంగా షికార్లు చేసినా.. ప్రతిసారీ సందర్భానికి తగ్గట్టుగా తన లుక్‌తో మైమరిపిస్తుంది. అంతర్జాతీయ రెడ్ కార్పెట్ ఈవెంట్లలో పీసీ ఫ్యాషన్ సెన్స్ పరంగా విఫలం కాలేదు. పీసీ లుక్ సెన్స్, ధరించిన ఆభరణాల గురించి విస్తృతంగా చర్చ సాగుతుంది. ముఖ్యంగా ప్రియాంక చోప్రా ఆభరణాల ఎంపికలు అందరి దృష్టిని ఆకర్షిస్తుంటాయి. లగ్జరీ జ్యువెలరీ బ్రాండ్ బల్గారి గ్లోబల్ అంబాసిడర్‌గా ఉన్న ప్రియాంక చోప్రా ఆభరణాలతో వ్యక్తిగత సంబంధం గురించి తాజాగా మాట్లాడింది. తాజా ఇంటర్వ్యూలో పీసీ తనను తాను మహిళగా ఆవిష్కరించుకున్న సందర్భం గురించి మాట్లాడింది. ప్రియాంక చోప్రా తన పారితోషికం అందుకున్న తర్వాత,



మొదటగా రెండు క్యారెట్ల వజ్రాన్ని కొనుగోలు చేసానని తెలిపింది. అది కూడా తన మొదటి సినిమాకి అందిన పారితోషికాన్ని దాచుకుని ఖర్చు చేసిందట. నా వజ్రాలను నేను కొనుగోలు చేయడం అంటే నేను ఒక మహిళగా మారినట్టేనని నా తల్లి (మధు చోప్రా) చెప్పారని ప్రియాంక చోప్రా తెలిపింది. నేను కొనుగోలు చేసిన మొదటి ముఖ్యమైన ఆభరణం రెండు క్యారెట్ల వజ్రం. ఇది నా కెరీర్ ఆరంభంలో .. నా మొదటి సంతకం నుంచి దాచుకున్న డబ్బు.. అని వెల్లడించింది.రెడ్ కార్పెట్ ఈవెంట్స్, సినిమా ప్రీమియర్ల కోసం ఆభరణాల ఎంపికకు వేరే ఏదైనా విధానం ఉందా? అని ప్రశ్నిస్తే... ధరించాలనుకున్న ఆభరణం ఎలాంటిదో ఎంపిక చేసుకున్న దుస్తులు నిర్ణయిస్తాయని వెల్లడించింది. 2019 కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ లో తెల్లటి టల్లే గౌనుతో అద్భుతమైన చోపార్డ్ డైమండ్ నెక్లెస్, చెవిపోగులను ధరించింది.

అది ఆ సంవత్సరం అత్యంత చర్చనీయాంశమైన లుక్స్‌లో ఒకటిగా మారింది. 2017 మెట్ గాలా ఈవెంట్ కోసం రాల్ఫ్ లారెన్ ట్రెంచ్ గౌను ధరించింది. 2023 మెట్ గాలాలో అరుదైన 11.16-క్యారెట్ పియర్-ఆకారపు నీలిరంగు వజ్రం, లగున బ్లూను కలిగి ఉన్న అద్భుతమైన బల్గారి నెక్లెస్ లను ధరించింది. ప్రియాంక ఫ్యాషన్ అండ్ ట్రెండ్స్ ని అనుకరించడంలో సుదీర్ఘ అనుభవం కలిగిన ఫ్యాషనిస్టా. అందాల రాణిగా యువతరం మనసుల్లో నిలిచి ఉండటానికి ఇది కూడా ఒక ప్రధాన కారణం.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536